

కొట్టుకుపోయిన గుండ్లకమ్మ గేటు నుంచి వృథాగా పోతున్న నీరు (ఫైల్)

**నిధులు ఇవ్వక నత్తనడకన పనులు**

గుండ్లకమ్మ రెండు గేట్లు వరుసగా కొట్టుకుపోయాక కళ్లు తెరిచిన వైసీపీ ప్రభుత్వం 12గేట్ల మరమ్మతులకు అనుమతి ఇచ్చింది. రూ.6.80 కోట్లకు అహ్మదాబాద్ కంపెనీ టెండర్ పొంది పనులు చేపట్టింది. ఇప్పటికి నాలుగు గేట్లను అమర్చింది. మరో రెండింటి పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకూ రూ.3.60 కోట్ల మేర బిల్లులు కాగా ఒక్క రూపాయి కూడా వైసీపీ ప్రభుత్వం ఇవ్వక గేట్ల పనులు నత్తనడకన సాగాయి. ప్రస్తుత పరిస్థితి చూస్తే సగం గేట్లు బాగా లేవు. ప్రాజెక్టులోకి నీరు వస్తే కొట్టుకుపోయే అవకాశం ఉంటుందని అధికారులు చెప్తున్నారు. ఈనేపథ్యంలో తక్షణం పెండింగ్ బిల్లులు ఇస్తే మిగిలిన గేట్లను కూడా కాంట్రాక్టు కంపెనీ పూర్తిచేసే అవకాశం ఉంది.


నాగార్జున సాగర్ గేట్లను ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న నీరు

# నీరుగారిన ఆశలు!

- వైసీపీ ప్రభుత్వంలో వెలిగొండ, గుండ్లకమ్మపై నిర్లక్ష్యం
- సాగర్ కాలువల మరమ్మతులు తూచ్
- శ్రీశైలం, సాగర్ పొంగిపొర్లుతున్నా నీరు తీసుకోలేని దుస్థితి
- కూటమి పాలకులపైనే ప్రజల ఆశలు

గత ప్రభుత్వ నిర్లక్ష్యం జిల్లావాసులకు శాపంగా మారింది. ప్రాజెక్టుల నిండా నీరున్నా తెచ్చుకోలేని పరిస్థితి నెలకొంది. గత వైసీపీ పాలనంతా ఆర్భాటమే తప్ప ప్రజలకు నీరివ్వాలన్న చిత్తశుద్ధి కరువైంది. ఇప్పుడు నష్టం కనిపిస్తోంది. వెలిగొండ, గుండ్లకమ్మ ప్రాజెక్టులు జిల్లాకు అత్యంత కీలకమైనవి. కాగా ఆ రెండింటి విషయంలో జగన్ అండ్ కో వ్యవహరించిన తీరు అత్యంత దారుణంగా ఉంది. గుండ్లకమ్మకు గేట్లు బిగించలేకపోయారు. వెలిగొండ ప్రాజెక్టులో కీలకమైన రెండు సొరంగాల తవ్వకాల పనులు పూర్తయ్యి కృష్ణానది నుంచి నీరు తీసుకునే వీలున్నప్పటికీ నిర్వాసితులకు పునరావాస చర్యల విషయంలో చేతులెత్తేశారు. దీంతో నేడు శ్రీశైలం ప్రాజెక్టుకు వరద పోటెత్తుతున్నా చుక్కనీరు వెలిగొండకు తీసుకోలేని దుస్థితి నెలకొంది.

## కృష్ణమ్మ పరవళ్లు.. జిల్లాకు కన్నీళ్లు


వెలిగొండ టన్నెల్-2 (ఫైల్)

ఒంగోలు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మకు రెండేళ్ల తర్వాత భారీగా వరద నీరు వస్తూ పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతాల్లోని కర్ణాటక, తెలంగాణ ప్రాజెక్టులే కాక రాష్ట్రంలోని కృష్ణానదిపై ఉన్న భారీ జలాశయాలైన శ్రీశైలం, సాగర్‌లు పొంగిపొర్లుతున్నాయి. లక్షల క్యూసెక్కుల నీరు నదిని దాటి సముద్రం వైపు వెళ్తోంది. ఆ వరదను మరల్చుకుని రిజర్వాయర్లను నింపుకునే అవకాశం ఉన్నా జిల్లాప్రజలకు కన్నీళ్లే మిగిలాయి. వర్షాలు లేక, పంటలు సాగుకాక ఆందోళన చెందుతున్న రైతులకు కనీసం కృష్ణమ్మ పరవళ్లను జిల్లాకు తెచ్చుకుంటే కాస్తంత ఉపశమనం కలిగేది. కానీ గత ప్రభుత్వ అలవిమాలిన నిర్లక్ష్యం శాపంగా మారింది. దాదాపు పాతికేళ్లుగా సాగుతున్న వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో కీలకమైన పనులు కొలిక్కి వచ్చాయి. తాజా అంచనాల ప్రకారం ప్రాజెక్టు వ్యయం రూ.8,400 కోట్లు కాగా సుమారు రూ.5,600కోట్లు ఖర్చు చేశారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చేనాటికి రూ.2,200 కోట్లు వెచ్చించగా.. టీడీపీ ఐదేళ్ల కాలంలో దాదాపు రూ.1,500కోట్లు ఖర్చు చేసింది. అంతేకాక అప్పటికి పూర్తిగా నిలిచిపోయిన టన్నెల్ (సొరంగం) తవ్వకాల పనులు పునఃప్రారంభించడంతోపాటు అత్యంత క్లిష్టమైన శ్రీశైలం ఎగువప్రాంతం నుంచి టన్నెళ్లకు నీరు తీసుకునే కొల్లంవాగు ప్రాంతం వద్ద హెడ్ రెగ్యులేటరీల నిర్మాణం చేపట్టింది.

**ఎన్నికల కోసం హడావుడిగా ప్రారంభం**

ఐదేళ్ల వైసీపీ కాలంలో కేవలం రూ.900 కోట్లు మాత్రమే ఈ ప్రాజెక్టుకు వెచ్చించగా అత్యంత కీలకమైన 2023-24 బడ్జెట్‌లో కేవలం రూ.101 కోట్లు కేటాయించి రూ.30కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అలా ప్రాజెక్టు విషయంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించింది. 2024 ఎన్నికల్లో లబ్ధికోసం నీరు లేకుండానే టన్నెళ్లను జాతికి అంకితం పేరుతో శిలాఫలకాన్ని మాత్రం నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆవిష్కరించి వెళ్లారు. నిజానికి టన్నెళ్ల తవ్వకాలు పూర్తినాటికి నిర్వాసితుల తరలింపు జరిగి ఉంటే ప్రస్తుతం శ్రీశైలం నుంచి వెలిగొండకు నీరు తీసుకునే వీలుండేది. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా 843 నుంచే వెలిగొండకు నీరు తీసుకోవచ్చు. ప్రస్తుతం పది రోజులుగా శ్రీశైలం మట్టం 843పైనే ఉంది. అంటే రోజుకు ఒక టీఎంసీకి పైగా నీటిని వెలిగొండకు తీసుకునే అవకాశం ఉండేది.

**గుండ్లకమ్మను గాలికొదిలేశారు**

మరోవైపు సాగర్ డ్యాం నుంచి గేట్లు ఎత్తి సముద్రానికి వదులుతున్న ప్రస్తుత తరుణంలో కుడి కాలువ ద్వారా నీటిని తీసుకొని గుండ్లకమ్మను నింపుకొనే అవకాశం ఉంది. అయితే ప్రాజెక్టు గేట్ల మరమ్మతుల విషయంలో గత వైసీపీ ప్రభుత్వ అలసత్వంతో అవి దెబ్బతిని ప్రస్తుతం నీటిని పెడితే కొట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉంది. మొత్తం 15గేట్లు ఉండగా రెండేళ్ల క్రితం ఒకటి, ఏడాది క్రితం మరొకటి కొట్టుకుపోయాయి. 6, 7 నెంబరు గేట్లు తక్షణం మరమ్మతుల కోసం నిధులు కావాలని 2022 జూన్‌లోనే ఇరిగేషన్ అధికారులు కోరినా నాటి వైసీపీ ప్రభుత్వం స్పందించ లేదు. ఆ ఏడాది ఆగస్టు 31న మూడో నంబరు గేటు కొట్టుకుపోయింది. తర్వాత కదలిక వచ్చి 6,7 గేట్లు మరమ్మతులు చేపట్టినా ఇంకా రూ.60లక్షలు బకాయి కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. ఆ సమయంలో మొత్తం గేట్లకు మరమ్మతులు అవసరంగా నిపుణులు సూచించగా రూ.9.4 కోట్లతో అధికారులు అంచనా వేశారు. వాటి మంజూరులోనూ జాప్యం జరగ్గా ఈలోపు గతేడాది జనవరిలో మరోగేటు కొట్టుకుపోయింది. ఫలితంగా రెండేళ్లు ఆయకట్టుకు నీరు రాక రైతులు నష్టపోయారు.

**టీడీపీ హయాంలోనే దాదాపు పూర్తి**

తెలుగుదేశం ప్రభుత్వం 2019లో దిగిపోయే నాటికి టన్నెల్-1 పనులు, తొలిహెడ్ రెగ్యులేటరీ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. అలాగే రెండో టన్నెల్‌ను కొల్లంవాగు ప్రాంతం నుంచి తవ్వి తీసుకుంటే 45 రోజుల వ్యవధిలో 45 టీఎంసీల నీరు వెలిగొండకు చేరుతుంది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఏడాదిలోనే తొలి టన్నెల్, హెడ్ రెగ్యులేటరీ పూర్తికాగా కృష్ణానది నుంచి నీరు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ నిర్వాసితులను తరలించడం పట్టించుకోక వీలుకాలేదు. దానిని పక్కనపెట్టి రెండో టన్నెల్ కూడా పూర్తిచేసి నీరిస్తామని ఏడాదికి రెండు, మూడు ముహూర్తాలు పెడుతూ వచ్చారు తప్ప నిర్వాసితులకు పరిహారం ఇచ్చి పునరావాస చర్యలు పూర్తి చేయడంపై దృష్టిపెట్టలేదు. చివరకు రెండో టన్నెల్ కూడా 2024 జనవరి 23న పూర్తయ్యింది. అప్పటికీ నిర్వాసితుల తరలింపు జరగలేదు. దాదాపు 11 గ్రామాలలో 7,500 మందిని గుర్తించినా కేవలం 100 కుటుంబాలను మాత్రమే తరలించారు. మిగిలిన వారికి సంబంధించి పరిహారం చెల్లింపు, పునరావాస చర్యలకు రూ.1,300 కోట్లు మంజూరు చేస్తూ 2021 ఫిబ్రవరిలో జీవో ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం 2024లో దిగిపోయే వరకు చిల్లిగవ్వ కూడా ఇవ్వక తరలింపు నిలిచిపోయింది.

**తక్షణం రూ.600కోట్లు కావాలి**

వెలిగొండకు సంబంధించి చూస్తే తొలిదశ నీరు నిల్వ చేయాలంటే సగం మంది నిర్వాసితులను తరలించాలి. అందుకోసం రూ.500 కోట్లు, అలాగే పెండింగ్ పనులకు మరో రూ.100 కోట్లు వెరసి రూ.600 కోట్లు తక్షణం ఇస్తే కృష్ణానదిలో వరద ప్రవాహాలు తగ్గేలోపు ప్రాజెక్టుకు నీటిని తీసుకునే అవకాశం ఉంది. వాస్తవ పరిస్థితిని గుర్తించి వెలిగొండ, గుండ్లకమ్మలను నీటితో నింపే వైపు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజానీకం కోరుతోంది. ఇదిలాఉండగా జిల్లాలో సాగర్ కాలువల పరిస్థితి దారుణంగా ఉంది. సాగర్ డ్యాం నుంచి నీరు ఇచ్చినా పొలాలకు సక్రమంగా అందే వీలు లేదు. వైసీపీ పాలనలో సాగర్ కాలువలపైనా అలవిమాలిన నిర్లక్ష్యమే కొనసాగడంతో ఈ పరిస్థితి నెలకొంది. అత్యవసర మరమ్మతులైనా ఆ కాలువలకు చేయాలని రైతులు కోరుతున్నారు.

# డీసీఎంఎస్‌లో రూ.52.95 లక్షలు గోల్‌మాల్

- ముగ్గురు బాధ్యులుగా గుర్తింపు
- డీసీవోకు విచారణాధికారి నివేదిక
- వారిపై సివిల్, క్రిమినల్ చర్యలకు సిఫార్సు


ఒంగోలులోని డీసీఎంఎస్ కార్యాలయం

ఒంగోలు (విద్య), ఆగస్టు 6 : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో రూ.52.95 లక్షలు గోల్‌మాల్ అయ్యాయి. విచారణలో ఈ విషయం వెల్లడైంది. డీసీఎంఎస్‌లో నిధుల దుర్వినియోగంపై అసిస్టెంట్ రిజిస్ట్రార్ బీవీ మాలకొండయ్య విచారణ నిర్వహించి సమగ్ర నివేదికను డీసీవో శ్రీనివాసరెడ్డికి అందజేశారు. నిధుల గోల్‌మాల్‌కు సంబంధించి డీసీఎంఎస్ చైర్‌పర్సన్ రావి పద్మావతి, బిజినెస్ మేనేజర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ చుండూరి సతీష్, అకౌంటెంట్ బొమ్మరాజు రామచంద్రరావును బాధ్యులుగా గుర్తించారు. సొసైటీలో అకౌంటెంట్ వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు మళ్లించి మింగేసిన రూ.52.95లక్షలను పద్మావతి, సతీష్, రామచంద్రరావుల నుంచి 18శాతం వడ్డీతో వ్యక్తిగతంగా, సమష్టిగా వసూలు చేయాలని విచారణాధికారి సిఫార్సు చేశారు. ఈ ముగ్గురిపై సివిల్, క్రిమినల్ చర్యలు చేపట్టాలని తన నివేదికలో కోరారు. దీన్ని కలెక్టర్‌కు సమర్పించి తర్వాత తగు చర్యల నిమిత్తం డీసీఎంఎస్ పాలకవర్గానికి పంపించారు. దీనిపై 30రోజుల లోపు పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేసి తగు తీర్మానాలు చేస్తారు. ఆతర్వాత వారిపై సివిల్, క్రిమినల్ చర్యలకు ఉపక్రమిస్తామని డీసీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు.

**ఒప్పందం ఉల్లంఘన**

పొగాకు రైతులకు ఎరువులు సరఫరా చేసేందుకు ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపీఎల్) పొగాకు బోర్డు, రైతు కమిటీకి డీసీఎంఎస్‌ల మధ్య ఒప్పందం ఉంది. దానిని డీసీఎంఎస్ ఉల్లంఘించింది. ఆ ఒప్పందం ప్రకారం ఇండియన్ పొటాష్ లిమిటెడ్, డీసీఎంఎస్‌కు ఎరువులు సరఫరా చేస్తుంది. వాటిని డీసీఎంఎస్ పొగాకు రైతులకు పంపిణీ చేస్తుంది. రైతులకు అందించిన ఎరువులకు సంబంధించి నిధులను పొగాకు బోర్డు డీసీఎంఎస్ బ్యాంకు ఖాతాకు జమచేస్తుంది. నిధులు జమ చేసిన రోజు లేదా ఆ మరుసటి రోజు డీసీఎంఎస్ తన కమీషన్‌ను మినహాయించుకొని మిగిలిన మొత్తాన్ని ఇండియన్ పొటాష్ లిమిటెడ్‌కు జమచేయాలి. అయితే బోర్డు నుంచి వచ్చిన నిధులను ఐపీఎల్‌కు జమచేయ కుండా అకౌంటెంట్ రామచంద్రరావు తన వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు రూ.3,21,35,000 మళ్లించారు. అప్పటి డీసీవో పి.రాజశేఖర్ చొరవతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆయన కలెక్టర్‌కు, డీసీఎంఎస్ పాలకవర్గానికి లేఖలు రాసి ఒత్తిడి పెంచడంతో అకౌంటెంట్ రామచంద్రరావు 11 దఫాలుగా మొత్తం రూ.2,98,40,000 ఐపీఎల్‌కు జమచేయగా, ఇంకా రూ.52,95,000 చెల్లించలేదు.

**ఖాళీ చెక్కులపై సంతకాలు**

చైర్మన్ రావి పద్మావతి, బిజినెస్ మేనేజర్ చుండూరి సతీష్‌లు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి ఖాళీ చెక్కుల మీద సంతకాలు చేయడం వల్లనే సొసైటీలో ఇంత భారీ మొత్తంలో నిధుల స్వాహాకు దారితీసిందని విచారణాధికారి నివేదికలో పేర్కొన్నారు. ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించుకున్న అకౌంటెంట్ ఐపీఎల్ బ్యాంకు ఖాతాకు నిధులు జమ కాకుండా తప్పుడు ఆర్టీజీఎస్‌తో ఆ మొత్తాలను తన వ్యక్తిగత ఖాతాకు మళ్లించుకున్నారు. ఐపీఎల్‌కు చెల్లింపులు జరుగుతున్నాయా; లేదా? అన్నది కూడా సొసైటీ చైర్మన్, బిజినెస్ మేనేజర్లు పట్టించుకోలేదు. నిబంధనల ప్రకారం ప్రతి చెల్లింపునకు సంబంధించి నోట్‌ఫైల్ రాసి ఏబ్యాంకు ఖాతాకు ఎంత మొత్తం జమచేస్తుంది రాసి చెక్కు మీద ఆ వివరాలు నమోదు చేయాలి. కానీ అందుకుభిన్నంగా నిధులు మింగేసినా పట్టించుకోలేదు. అక్రమాలపై విచారణ నివేదిక రావడంతో చర్యలకు డీసీవో ఉపక్రమించారు.

# జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు

- అధికారులతో సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా
- స్వాతంత్ర్య వేడుకలకు పక్కా ఏర్పాట్లు చేయాలని ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 6 : జిల్లా సమగ్రాభివృద్ధికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో మంగళవారం ప్రకృతి విపత్తులు, స్వాతంత్ర్య దిన వేడుకల నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అక్టోబరు 2న రాష్ట్ర విజన్ డాక్యుమెంటరీ విడుదల చేస్తామని ప్రకటించినందున అదేక్రమంలో జిల్లా అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను కూడా రూపొందించాలన్నారు. జిల్లాలోని పరిస్థితులు, ప్రత్యేకతలను పరిగణనలోకి తీసుకొని 2047నాటికి సాధించాల్సిన అభివృద్ధిని తెలియజేసేలా ఈ ప్రణాళిక ఉండాలన్నారు. ముందుగా వంద రోజులు, తర్వాత ఏడాది ప్రణాళికలను రూపొందించాలన్నారు. అందుకు తగినట్లుగా అన్నిశాఖల ఉన్నతాధికారులు కూడా తమశాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. జిల్లాస్థాయి అధికారులు, క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, క్షేత్రస్థాయి సిబ్బందికి ఇస్తున్న ఆదేశాలను కూడా తనకు తెలియజేయాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పాల్గొన్న అధికారులు

**పకడ్బందీగా ఏర్పాట్లు**

78వ స్వాతంత్ర్య వేడుకలను ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శకటాలు, స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, వీఐపీలకు ఆహ్వానం, ఇన్‌చార్జి మంత్రి ప్రసంగాల ప్రతుల తయారీపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ప్రకృతి విపత్తులు ఎదురైనా ఎదుర్కొనేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని తుఫాన్ షెల్టర్లకు మరమ్మతుల కోసం అవసరమైన అంచనాలు రూపొందించాలని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో విశ్వేశ్వరరావు, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనాతోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రేషన్ దొంగలు

- పాత, కొత్త వ్యాపారులు కలిసి రాత్రికిరాత్రే తరలింపు
- ఆరు రోజుల వ్యవధిలో జిల్లాలో వెయ్యికిపైగా బియ్యం బస్తాల పట్టివేత

**భారీగా పట్టుబడుతున్నాయి**

గత ఆరురోజుల వ్యవధిలోనే చీమకుర్తి, ఎన్జీపాడు, కనిగిరి, కంభం మండలంతోపాటు పలుప్రాంతాల నుంచి వాహనాల్లో బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో రేషన్ షాపుల నుంచి మరో ప్రాంతానికి తరలించి నిల్వ చేస్తున్నారు. రేషన్ బియ్యానికి మంచి ధరలు లభిస్తుండటంతో వాటిని తక్కువకు కొనుగోలు చేసి అధిక రేట్లకు విక్రయిస్తూ కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. జిల్లాకేంద్రమైన ఒంగోలులో వైసీపీ నుంచి ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీలో చేరిన ఇరువురు నేతలు ఇప్పుడు పాత వ్యాపారులతో కలిసి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. వైసీపీలో భారీస్థాయిలో వ్యాపారం చేసిన వ్యక్తులు ఇప్పుడు అధికారపార్టీ నేతలను కలుపుకొని వ్యాపారం ప్రారంభించడంతో విజిలెన్స్ అధికారులకు కూడా అర్థం కాని పరిస్థితి నెలకొంది.

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 6 : జిల్లాలో రేషన్ మాఫియా మరింత రెచ్చిపోతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏవిధంగా అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలించారో ఇప్పుడు కూడా అదేరీతిలో రాత్రికి రాత్రే ఎత్తుకుపోతున్నారు. ఒకవైపు పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేస్తున్నా అవేమీ పట్టించుకోవడం లేదు. ఏకంగా కార్డుదారులు వేలిముద్రలు వేయకుండానే నేరుగా బస్తాలను తరలిస్తున్నారు. నెల ప్రారంభమైన ఆరు రోజుల్లోనే జిల్లావ్యాప్తంగా వెయ్యికిపైగా బస్తాలు పట్టుబడ్డాయంటే రేషన్ అమ్మకాలు ఏవిధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి నాయకుల అండదండలతో ఎవరైతే రేషన్ అక్రమ వ్యాపారం చేశారో ఇప్పుడు కూడా వారే చక్రం తిప్పుతున్నారు. ప్రస్తుత అధికార పార్టీలోని కొంతమంది నాయకులను మంచి చేసుకొని వారి అండదండలతో రాత్రికిరాత్రే రేషన్ బియ్యాన్ని వాహనాల్లో తరలిస్తున్నారు. పట్టణ, మండల స్థాయిలో కీలక నేతలుగా ఉండేవారిని అక్రమ బియ్యం వ్యాపారంలో భాగస్వాములను చేసుకొని మరింత రెచ్చిపోతున్నారు.

**పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ**

కొంతమంది వ్యాపారులు మిల్లులను అద్దెకు తీసుకొని వాటిల్లోకి స్టాకు తరలించి అక్కడ గోతాలు మార్చుకొని నెల్లూరు, కాకినాడకు తరలిస్తున్నారు. మరికొంతమంది వ్యాపారులు రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టి బ్రాండెడ్ గోతాల్లో నింపి తరలిస్తున్నారు. ఇంకొంతమంది దళారులను ఏర్పాటు చేసుకొని లగేజీ ఆటోల్లో యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా పక్షంరోజుల్లోనే కోట్లలో వ్యాపారం చేస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా 1వ తేదీన రేషన్ పంపిణీ ప్రారంభమై 15వతేదీ నాటికి పూర్తికావాల్సి ఉంది. మొబైల్ వాహనాల ఆపరేటర్లు కూడా రేషన్ మాఫియాకు అండగా నిలుస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రాంతంలో బియ్యం విక్రయాలు జరుగుతాయో ముందుగానే తెలుస్తుండటంతో వ్యాపారులు సులువుగా బియ్యం కొనుగోలు చేస్తున్నారు. కార్డుదారుల నుంచి రూ.10కి కొనుగోలు చేస్తున్న డీలర్లు అక్రమ వ్యాపారులకు రూ.16 నుంచి రూ.18కి విక్రయిస్తున్నారు. పేదల బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి కిలో రూ.40నుంచి రూ.45 వరకూ అమ్ముకొని కోట్లలో సంపాదిస్తున్నారు. పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువ కావడంతో ఈ వ్యాపారంలోకి కొత్తకొత్త వ్యక్తులు వస్తున్నారు. దీంతో ఇప్పుడు బియ్యం వ్యాపారుల సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతోంది.


చీమకుర్తిలో రేషన్ బియ్యంతో పట్టుబడిన లారీ వద్ద అధికారులు


వివరాలు లోపలి పేజీల్లో..


## బోడపాడు సర్పంచ్ భూ కబ్జాలపై విచారణ

- సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు రంగంలోకి అధికారులు


వైసీపీ సర్పంచ్ భూఆక్రమణలను క్షేత్రస్థాయిలో విచారిస్తున్న అధికారులు

## ఎమ్మెల్యే దామచర్లకు మెప్మా సిబ్బంది శుభాకాంక్షలు



ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 6 : విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌కు మెప్మా సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఒంగోలులోని ఎన్టీఆర్‌భవన్‌లో ఎమ్మెల్యేని కలిశారు. ఈ సందర్భంగా వారు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ పొదుపు సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గ్రూపు మహిళలకు అవసరమైన రుణాల మంజూరు చేసి, ఆర్థికంగా అండగా ఉంటుందని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో సీఎం కొండయ్య, ఆర్పీల సంఘం అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, సీవోలు, ఆర్పీలు, పలువురు పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## జిల్లాలో పశుగణనను సమగ్రంగా నిర్వహించాలి : కలెక్టర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా, జేసీ, జేడీఏ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 6: జిల్లాలో ఈనెల 1వతేదీ నుంచి ప్రారంభమైన పశుగణనను సమగ్రంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం పశుగణన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. పశుసంవర్ధకశాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్ళి పశువులు, కోళ్ళు, గొర్రెలు, మేకలు, పందులు, పెరటి కోళ్ళు, పాలిచ్చే పశువులు, కుక్కలు, పెంపుడు కుక్కలు తదితర 15 అంశాలపై వివరాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, జేడీఏ బేబీరాణి పాల్గొన్నారు.

## తహసీల్దార్ వాసుకు అభినందన



తహసీల్దార్ వాసును సత్కరిస్తున్న వీఆర్వోలు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 6 : ఒంగోలు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నెలబోట్ల వాసును జిల్లా వీఆర్వోల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఏసీ.ఆదిరెడ్డి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో రాంబాబు, రమణి, సురేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వన్‌టౌన్ సీఐ నాగరాజు బాధ్యతల స్వీకరణ



సీఐ నాగరాజు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 6: ఒంగోలు వన్‌టౌన్ సీఐగా వై.నాగరాజు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు గుంటూరు రేంజి వీఆర్‌లో ఉన్న నాగరాజును వన్‌టౌన్ సీఐగా నియమిస్తూ గత నెల 31న ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఎస్సైగా పనిచేసిన అనుభవం ఉంది. బాధ్యతలు చేపట్టిన సీఐ అనంతరం మీడియాతో మాట్లాడుతూ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. గంజాయి నిర్మూలనే ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోకిరీల పనిపడతానని ఆయన తెలిపారు.

## 129బస్తాల రేషన్‌బియ్యం పట్టివేత

చీమకుర్తి, ఆగస్టు 6 : పేదప్రజలకు అందాల్సిన రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని రెవెన్యూ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం వేకువజామున స్వాధీనం పరుచుకున్నారు. పక్కా సమాచారంతో అధికారులు మాటు వేసి చీమకుర్తి పట్టణంలో మెయిన్‌రోడ్ నుంచి తరలివెళ్తున్న బియ్యం లారీని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 129బస్తాల బియ్యాన్ని స్వాధీనపరచుకొని గోడౌన్‌కి తరలించారు. రవాణాదారున్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజాపంపిణీకి చెందిన బియ్యాన్ని అక్రమంగా తరలించటం చట్టరీత్యా నేరం అన్నారు. ఇటువంటి చర్యలుకు పాల్పడితే కఠినచర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఆర్‌వీఎస్.కృష్ణమోహన్, డేవిడ్‌రాజు, సీహెచ్. కృష్ణమోహన్, రామనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలకు సత్వరమే పరిష్కారం



తహసీల్దార్‌కు బొకే అందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

చీమకుర్తి, ఆగస్టు 6 : రెవెన్యూ పరమైన సమస్యలకు సత్వరమే పరిష్కారం లభించే విధంగా విధులు నిర్వర్తిస్తానని కొత్తగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. మండలపరిధిలోని రెవెన్యూ పరమైన అంశాలను చర్చించారు. ప్రజల అర్జీలను పరిష్కరించాలని సిబ్బందికి బ్రహ్మయ్య సూచించారు.

## ఘనంగా శ్రావణ మంగళవార పూజలు



మహిషాసురమర్ధిని అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 6: శ్రావణమాసం తొలి మంగళవారం పూజలు ఒంగోలు నగరంలోని పలు దేవాలయాలలో వైభవంగా జరిగాయి. మహిళలు అమ్మవారి దేవస్థానాలకు వెళ్లి పూజా కార్యక్రమాలలో పాల్గొనటమే కాకుండా తమ ఇళ్లవద్ద సైతం మంగళగౌరీ వ్రతాలను ఆచరించారు. నగరంలోని కేశవస్వామిపేట శ్రీ విజయదుర్గ దేవి దేవస్థానం, రంగారాయుడు చెరువు దగ్గర ఉన్న శ్రీకామాక్షి అమ్మవారి దేవస్థానం, శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం, శ్రీ గాయత్రి మందిరం, శ్రీఅచలానంద ఆశ్రమం, సంతపేట సాయిబాబా మందిరంలోని నాగలక్ష్మి అమ్మవారి దేవస్థానం, లాయర్‌పేట సాయిబాబా దేవస్థానం శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం, బీవీఎస్ హాలు దగ్గర ఉన్న మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం, బాలాజీరావుపేట శ్రీపార్వతీదేవి ఆలయం మొదలైన పలు చోట్ల శ్రావణ మంగళవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు జరిగాయి.

# కాలువ ఇలా..నీరు పారేదెలా..?

- సాగర్ కాలువలో పేరుకున్న పూడిక
- వ్యర్థాలు, పిచ్చి మొక్కలతో అధ్వానం



ముళ్లచెట్లు, వ్యర్థాలతో ఉన్న సమతానగర్ సమీపంలో ఉన్న సాగర్ కాలువ

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 6 : ఒంగోలులో తాగునీటి సరఫరాపై అధికారులకు చిత్తశుద్ధి కొరవడింది. నిన్నా మొన్నటి వరకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీరు పుష్కలంగా ఉన్నా, అవి ఇళ్లలోని కొళాయిల్లోకి చేరడం గగనమైంది. ఒకరోజు విద్యుత్ సరఫరా అంతరాయం, మరోరోజు మోటార్ల సమస్య, ఇంకోరోజు లీకుల మోత.. ఇలా రోజుకో సమస్యతో ప్రజలు తాగునీటికి నానా అగచాట్లు పడుతున్నారు. కొత్తపైపులు వేయాలంటే కోట్లు రూపాయల ఖర్చు పేరుతో ఏళ్ళనాటి పైపులైనులతోనే ఎలాగోలా నెట్టుకొస్తున్నారు. అయితే మంగళవారం నుంచి ఒంగోలులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు సాగర్ నీరు విడుదల అయ్యింది. అందుకోసం కార్పొరేషన్ కార్యాలయంలోని ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేసే వాటర్ వర్క్స్ విభాగంలోని కొందరిని కాలువ కట్టలపై డ్యూటీలు వేశారు. సాగర్ నీటిని రైతులు పొలాలకు దారి మళ్ళించకుండా ఉండేందుకు వీరిని రోజుకు మూడు షిఫ్ట్‌ల పద్ధతిన చీమకుర్తి వద్ద నుంచి ఒంగోలు వరకు సాగర్ కాలువ మార్గంలోని కట్టపై డ్యూటీలు వేశారు. అయితే నీరు పారే కాలువపై యంత్రాంగం పెద్దగా దృష్టి సారించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాగర్ కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చిల్ల చెట్లు ఏపుగా పెరిగాయి. మరి కొన్ని ప్రాంతాల్లో కాలువ కనీసం రెండు మూడు అడుగులు కూడా వెడల్పు కూడా లేకుండా మట్టి దిబ్బలతో మూసుకుపోయాయి. దీంతో సాగర్ నీరు విడుదలయినా, వ్యర్థాలతో కూడిన నీరు వేసవి చెరువుల్లోకి చేరడమే కాకుండా పలు ప్రాంతాల్లో ఆ చెత్తా చెదారం పైపులైనుల్లో అడ్డుపడి సరఫరాకు అటంకాలు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. వాస్తవానికి ఏటా సాగర్ నీరు విడుదలయ్యే సమయాల్లో ఎక్స్‌కవేటర్‌లతో కాలువలో పూడిక తీత పనులు చేపట్టాలి. కాలువల్లోని వ్యర్థాలను తొలగించి, నీరు సక్రమంగా పారే ఏర్పాట్లు చేయాలి. అయితే ఒంగోలు నగరపాలక సంస్థలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సాగర్ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి ఆటంకాలు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

# తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తొలగించాలి

- ఎమ్మెల్యే దామచర్ల ఆదేశం
- కార్పొరేషన్ ఇంజనీర్లతో సమీక్ష



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 6 : నగరంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, అలాగే లీకులు, మోటార్ల సమస్యపై వెంటనే దృష్టి సారించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కార్పొరేషన్ ఇంజనీర్లను ఆదేశించారు. మంగళవారం ఒంగోలులోని ఎన్టీఆర్ భవనంలో జరిగిన సమావేశంలో నగరంలో తాగునీటి సరఫరా విధానంపై చర్చించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ నగరంలో పదేపదే పైపులైన్ల లీకుల సమస్యలు, మోటార్ల మరమ్మతులు ఎందుకు వస్తున్నాయని అడిగారు. తక్షణమే తాగునీటి సరఫరాలో లోపాలను సరిచేయాలని చెప్పారు. సాగర్ నీరు విడుదలవుతున్న నేపథ్యంలో సక్రమంగా చెరువులకు చేరేలా చూడాలని, ఇబ్బందులు రాకుండా చేయాలని కోరారు. పైపులైను లేని ప్రాంతాలైన శివారుకాలనీలకు ట్యాంకర్ల ద్వారా సక్రమంగా అందించాలన్నారు. ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకూడదని, ఏదైనా సమస్య ఉన్న ప్రాంతాల ప్రజలకు ముందుగానే సమాచారం ఇవ్వాలని తెలిపారు. నగరంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఇంజనీర్లపై ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అలాగే నీటి సరఫరాల ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధుల రాబట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఎప్పటికపుడు నగరంలో పర్యటించి, ఏ డివిజన్‌లో కూడా తాగునీటికి ఇక్కట్లు రాకుండా చూడాలని ఇంజనీర్లను ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ ఎం.జశ్వంత్‌రావు, ఎంఈ జానీబాషా, డీఈలు గణపతి, పద్మజ, ట్యాప్‌ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై ఫిర్యాదులొస్తే చర్యలు

- కమిషనర్ జశ్వంత్‌రావు



పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ జశ్వంత్‌రావు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 6 : నగరంలో పారిశుధ్యంపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని, ప్రతి కార్మికుడు తప్పనిసరిగా మస్టర్ పాయింట్‌క వచ్చి హాజరు వేయించుకోవాలని, విధిగా విధుల్లో ఉండాలని నగర కమిషనరు ఎం.జశ్వంత్‌రావు సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం తెల్లవారుజామున నగరంలోని పలు మస్టర్ పాయింట్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసిన వారి హాజు పట్టిని పరిశీలించారు. కాగా కొందరు విధులకు రాకుండా గైర్హాజరు కావడంపై ఆయన సీరియస్ అయ్యారు. అనంతరం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పలు ప్రాంతాల్లో చెత్త దిబ్బలు, ప్లాస్టిక్ కవర్లు ఉండటంతోపాటు, కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సదర్భంగా పారిశుధ్య విభాగం కార్మికులు, అధికారులతో మాట్లాడుతూ ఇకపై ఎవరిని ఉపేక్షించేది లేదన్నారు. ఖచ్చితంగా మస్టర్ పాయింట్‌కు వచ్చి, వారికి కేటాయించిన విధులు పూర్తి చేయలన్నారు. నగరంలో ఎక్కడ రోడ్లపై చెత్త కనిపించకూడదని, ప్రతి రెండు, మూడు రోజుల కొకసారి కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలని అన్నారు. విధిగా అప్రాన్, గ్లౌజులు ధరించాలన్నారు. అంతే కాకుండా సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షించాలన్నారు. క్షేత్రస్థాయి నుంచే పనిలో బాధ్యత పెరగాలన్నారు. ఇదిలా ఉండగా, వర్షాకాలం కావడం వలన నీరు రోడ్లపై నిలిచే అవకాశం ఉందని, తద్వారా ప్రజలు వ్యాధుల బారిన పడతారన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రతి కార్మికుడు, ఉద్యోగి, ఇన్‌స్పెక్టర్లు బాధ్యత కలిగి పనిచేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సంబంధిత డివిజన్ సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్ వైజర్ ఎస్.పిచ్చయ్యతోపాటు, పలువురు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# స్కీం వర్కర్లందరికీ పెన్షన్ ఇవ్వాలి

**ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ డిమాండ్**



ధర్నా చేస్తున్న అసోసియేషన్ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 6 : వివిధ శాఖల్లో 25నుంచి 30 ఏళ్ళ పాటు పని చేసిన స్కీం వర్కర్లకు పెన్షన్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట అధ్యక్షుడు జి.శేషయ్య అధ్యక్షతన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడు ఏవీ.పుల్లారావు మాట్లాడుతూ ఈపీఎస్-95 పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు డీఏతో కలిపి ఇవ్వాలన్నారు. హయ్యర్ పెన్షన్ కోసం ఆప్షన్ అందరికీ అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు రావాల్సిన పీఆర్సీ, డీఏ, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈపీఎస్ పెన్షనర్లకు ఉచిత వైద్యసదుపాయం కల్పించాలని, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ పరిమితిని రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి పేరయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు, సమగ్రశిక్ష, ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు సిబ్బంది, వీఆర్‌ఏలు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస పెన్షన్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సీహెచ్.రాంబాబు, ఎస్.రాబిన్ రవికుమార్, డి.శ్రీనివాసులు, ఎం.వెంకటేశ్వరరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బిడ్డ పుట్టిన అరగంటలోపే తల్లిపాలు ఇవ్వాలి

- ప్రొఫెసర్ భాస్కరి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 6 : బిడ్డ పుట్టిన అరగంటలోనే తల్లిపాలు పట్టించడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉంటారని వైద్యకళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.భాస్కరి తెలిపారు. ఒంగోలు నగరం బాలాజీనగర్‌లో మంగళవారం తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరి మాట్లాడుతూ తల్లిపాలు తాగడం వల్ల బిడ్డల్లో శారీరక, మానసిక పెరుగుదలకు దోహదపడుతుందన్నారు. డాక్టర్ అశ్విణ్ మాట్లాడుతూ తల్లిపాలు ఆరు నెలల వరకు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జి.సాయిసంతోష్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ నిర్మలజ్యోతి, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రసన్న, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

**పిల్లలకు తల్లిపాలు శ్రేష్ఠం**

ఒంగోలు(కల్చరల్): చిన్నపిల్లలకు తల్లిపాలు శ్రేష్టమని ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ సీహెచ్.మాలతి పేర్కొన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల విశిష్టత గురించి ఒంగోలులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ సెక్రటరీ డాక్టర్ సీహెచ్.హిమశిల్ప మాట్లాడుతూ గర్భిణులు తగిన పౌష్టికాహారం తీసుకోవాలని, దీని వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా జన్మిస్తారన్నారు. కార్యక్రమంలో సునీత, హైమ, విజయ, సుజాత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 30మందికి రూ.15వేల విలువైన టవల్స్, పండ్లు పంపిణీ చేశారు.

## గద్దర్, చుండూరు మృతవీరులకు నివాళి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 6 : చుండూరుమృతవీరుల 33వ వర్ధంతి, ప్రజాయుద్ధ నౌక గద్దర్ ప్రథమ వర్ధంతిని మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మంచిపుస్తకం కార్యాలయం వద్ద ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్, నాయకులు బి.సుబ్బారావు, చుండూరి రంగారావు, కొంగర నరసింహం, ధరణికోట లక్ష్మీనారాయణ, కరవది సుబ్బారావు, దాసరి సుందరం, కొత్తకోట వెంకటేశ్వర్లు, పీవీ.రమణారెడ్డి, పీవీఆర్.చౌదరి, బొట్లా సుబ్బారావు, కాళ్ళ హరిప్రసాద్, ఆవుల సుబ్రహ్మణ్యం, శివరావు, పిన్నిక శ్రీను, సత్యం తదితరులు పాల్గొన్నారు.

- దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో చుండూరు మృతవీరులకు నివాళులర్పించారు. సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు, దారా అంజయ్య, వేలూరి శ్రీనివాస్, కాకుమాను రవి తదితరులు పాల్గొన్నారు.

- చుండూరు మృతుల వర్ధంతిని పురస్కరించుకుని నివాళి గీతాన్ని స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు విజేంద్రబహుజన్, బీటీపీ రాష్ట్ర అధ్యక్షుడు పర్రె వెంకట్రావు ఆవిష్కరించారు. కవి కలేకూరి ప్రసాద్ పాటను రాయగా, నూకతోటి శరత్‌బాబు సంగీతం సమకూర్చారు. కార్యక్రమంలో కరవది సుబ్బారావు, చప్పిడి కోటేశ్వరరావు, జాలరామయ్య పాల్గొన్నారు.

## బజాజ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 6 : ఒంగోలు నగరంలోని తిరుమల బజాజ్ 18వ వార్షికోత్సవం పురస్కరించుకుని రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో షోరూమ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. తిరుమల గ్రూప్ ఎండీ కోకా శ్రీధర్ అధ్యక్షత వహించగా, ట్రాఫిక్ ఎస్ఐ ఆస్లాంఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా షోరూం ఆవరణంలోనూ, జాతీయ రహదారి పక్కన మొక్కలు నాటారు. రక్తదానం శిబిరం నిర్వహించారు. ఉద్యోగులు, కార్మికులు రక్తదానం చేశారు. ప్రత్యేక స్కీమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో తిరుమల గ్రూప్ చైర్మన్ కోకా ఉషశ్రీ, ఈడీ కోకా సిద్ధు, సేల్స్ మేనేజర్ పవన్ కుమార్, నాగేశ్వరరావు, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## మానసిక దివ్యాంగులను చైతన్యపరచాలి

సంతనూతలపాడు, ఆగస్టు 6: మానసిక దివ్యాంగులను మరింత చైతన్యపరచాలని జిల్లా మానసిక వైద్య విభాగం కౌన్సిలర్ బి.అనీల్‌కుమార్, ఎస్.ఏడుకొండలు కోరారు. జాతీయ అవగాహన మానసిక దినోత్సవంలో భాగంగా మంగళవారం సంతనూతలపాడు ప్రైమరీహెల్త్‌సెంటర్‌లో జరిగిన సదస్సులో అయన మాట్లాడారు. మానసిక రోగులను మరింత చైతన్య పరిచినపుడే కొంత మార్పు అనేది వస్తుందన్నారు. కార్యక్రమంలో మానసిక వైద్యనిపుణులు జి.చంద్రశేఖర్, ఏఎన్ఎమ్‌లు, ఆశాలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# అవీ..ఇవీ..

## పీడీసీసీ బ్యాంకు ఓఎస్‌డీగా ఇందిరాదేవి

ఒంగోలు(విద్య), ఆగస్టు 6 : ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(పీడీసీసీ) ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా ఎన్.ఇందిరాదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇందిరాదేవి గుంటూరు డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ సెలవులో ఉన్నారు. ప్రస్తుతం సెలవు అనంతరం ఆమెను ఇక్కడి పీడీసీసీ బ్యాంకు ఓఎస్‌డీగా నియమించారు. ఇందిరాదేవి గతంలో ఇక్కడ జిల్లా సహకార ఆడిట్ అధికారిగా, ఒంగోలు డివిజనల్ సహకారాధికారిగా పని చేశారు.

## సాఫ్ట్‌బాల్ పోటీలకు త్రోవగుంట విద్యార్థులు



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 6: జిల్లాస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని త్రోవగుంట జిల్లాపరిషత్ హైస్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. శ్రీకాకుళంలో జరిగే జూనియర్ రాష్ట్ర స్థాయిపోటీల్లో వారు పాల్గొంటారు. ఈ పోటీలకు ఇద్దరు బాలికలు, ఒక బాలురు ఎంపికయ్యారు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయలు, డివిజన్ నాయకులు మండవ రాఘవరావు, అంజయ్య, లక్ష్మీనారాయణ, తిరుమలరావు అభినందించారు.

## పీజీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

ఒంగోలు(విద్య), ఆగస్టు 8: ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్శిటీలో 2024-25 విద్యా సంవత్సరంలో పీజీ కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఏపీపీజీ ఉమ్మడి ప్రవేశపరీక్ష ద్వారా అర్హత సాధించిన విద్యార్థలకు ప్రవేశం కల్పిస్తారు. ఈ ప్రవేశాలకు సంబంధించి ఈనెల 7నుంచి 12వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని యూనివర్శిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ జి.సోమశేఖర్ మంగళవారం తెలిపారు. యూనివర్శిటీలో ప్రస్తుతం ఆర్ట్స్ విభాగంలో ఎంఏ ఎకనామిక్స్, హిస్టరీ, సోషల్‌వర్క్, ఇంగ్లీషు, తెలుగు, ఎం.ఈడీ, ఎంకాం, ఎంపీఈడీ కోర్సులతో పాటు సైన్స్ విభాగంలో ఎంఎస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మ్యాథమేటిక్స్, స్టాటిస్టిక్స్, ఆక్వాకల్చర్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, ఆనలిటికల్ కెమిస్ట్రీ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వివరాల కోసం 9949088109 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

## ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు(విద్య), ఆగస్టు 6 : జిల్లాలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి జాతీయ ఉపకార వేతన పరీక్ష (నేషనల్ మిన్స్‌కమ్‌మెరిట్ స్కాలర్‌షిప్-ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, పాఠశాలలు, వసతి సౌకర్యంలేని ఆదర్శ పాఠశాలల్లో చదువుతున్నవారు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలలోపు ఉన్నవారు మాత్రమే ఉండాలి. ఈ ఏడాది డిసెంబరు 8న పరీక్ష జరుగుతుంది. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50, దరఖాస్తు ఆన్‌లైన్‌లో సమర్పించాలి. సెప్టెంబరు6 దరఖాస్తుకు చివరి తేదీ. పరీక్ష రుసుం ఈనెల 10వతేదీలోపు చెల్లించాలని తెలిపారు

## తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు



ప్రవీణ్‌కుమార్‌కు బొకే అందిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 6 : తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కె.ప్రవీణ్ కుమార్‌ను తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎరీక్షు మండల కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తెలగతోటి జాన్సన్, చేకూరపాడు సర్పంచ్ కొమ్మినేని రమేష్‌బాబు, బోయిడి బ్రహ్మరాజు, కనగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

మద్దిపాడు,ఆగస్టు 6: మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో అయన మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలు ఉన్నట్లయితే ప్రజలు తన దృష్టికి తీసుకురావాలన్నారు. తక్షణమే వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

## స్కూటీ అదుపు తప్పి మహిళకు గాయాలు

మద్దిపాడు, ఆగస్టు 6: స్కూటీ అదుపుతప్పి మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం వద్ద జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. అద్దంకికి చెందిన రమాదేవికి ఒంగోలు వైపు వెళ్తున్న కారు ఒక్కసారిగా అడ్డురావటంతో అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ సంఘటనలో ఆమె గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు.

## వెల్లంపల్లిలో పారిశుధ్య పనులు



పనును పర్యవేక్షిస్తున్న కార్యదర్శి, సర్పంచ్

మద్దిపాడు, ఆగస్టు 6: వెల్లంపల్లి గ్రామంలో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామ కార్యదర్శి మాధవి ఆధ్వర్యంలో సిబ్బంది ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలువల్లో మురుగు తొలగించి దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సర్పంచ్ అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం అభినందనీయం




అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 6: జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు నిత్యాన్నదానం చేయడం అభినందనీయమని మున్సిపల్ మాజీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు మంత్రి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కొత్తపేటలోని డొక్కా సీతమ్మ నిత్యాన్నదాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ జనసేన నాయకుడు జడా బాలనాగేంద్రయాదవ్ ఆధ్వర్యంలో ప్రతి రోజు 300 మందికి అన్నదానం చేయటం అభినందనీయమన్నారు. తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో బాలనాగేంద్రయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

## తెలుగుభాషను కాపాడుకోవాలి

నాగులుప్పలపాడు, ఆగస్టు 6: తెలుగుభాషను కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలని చేకూరపాడులోని శ్రీవేణుగోపాలస్వామి ఓరియంటల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అనిత సూచించారు. విశ్రాంత హెచ్‌ఎం మారేపల్లి సూర్యకుమారి ఆధ్వర్యంలో స్థానిక ఓరియంటల్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం తెలుగుభాష ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. తొలుత పాఠశాల వ్యవస్థాపకులు సిరిగిరి పేరయ్య విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ చాటిన శశికుమార్‌కు రూ.2వేలు, లాస్యప్రియ, హేమంత్‌లకు చెరో వెయ్యి నగదు బహుమతులను సూర్యకుమారి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థిని సువర్ణ, నల్లూరి క్రాంతి, కోటూరి జనార్దన్, రహంతుల్లా, పత్రా శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

చీమకుర్తి, ఆగస్టు 6 : చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. పీఎఫ్ సమస్యను పరిష్కరించాలని, పండగ, హెల్త్ అలవెన్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇవ్వటంతో కార్మికులు నిరసన విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పూసపాటి వెంకట్రావు, నాయకులు పద్మ, ఏడుకొండలు, కోటేశ్వరరావు, నాగయ్య పాల్గొన్నారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి


అంజయ్య మృతదేహం

టంగుటూరు, ఆగస్టు 6 : ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన టంగుటూరులోని వాణీనగర్‌లో మంగళవారం ఉదయం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. వాణీనగర్‌లో నివాసం ఉండే కాకి అంజయ్య (60) కూలి పనులకు వెళ్తుంటారు. ఆయన భార్య బస్టాండ్ సెంటర్‌లో జామకాయల వ్యాపారం చేస్తుంది. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం ఊరచెరువు వద్ద ట్రాక్‌పై వాకింగ్ చేస్తున్న వారు చెరువులో మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. దాన్ని చూసి అప్పటికే అక్కడికి చేరుకున్న అంజయ్య కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఎస్సై సూర్యారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రాక్టర్ ఢీకొని జార్ఖండ్ వ్యక్తి మృతి


మృతుడు జార్ఖండ్ వ్యక్తి

సూరారెడ్డిపాలెం (టంగుటూరు), ఆగస్టు 6 : ట్రాక్టర్ ఢీకొని జార్ఖండ్‌కు చెందిన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సూరారెడ్డిపాలెం నుంచి కారుమంచి వెళ్లే రోడ్డు ముఖద్వారం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఓ వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొట్టింది. అది ఆయన నడుముల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా ఆయన జార్ఖండ్ రాష్ట్రంలోని పాలోజోరి జిల్లా సర్సాకు చెందిన కాంచన్ గంధర్వ (41)గా గుర్తించారు. అక్కడే దొరికిన సెల్‌ఫోన్‌తో కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. మావారు అక్కడ ఎవ్వరూ లేరని, ఇతను అక్కడికి ఎందుకొచ్చాడో తెలియదని వారు చెప్పారు. ఎస్సై సూర్యారావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

## బోడపాడు సర్పంచ్ భూఅక్రమాలపై విచారణ

మార్కాపురం రూరల్, ఆగస్టు 6: మండలంలోని బోడపాడు గ్రామంలో వైసీపీ సర్పంచ్ ముక్కమల్ల రమణారెడ్డి భూఆక్రమణలపై అధికారులు మంగళవారం విచారించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సర్పంచ్ భూ ఆక్రమణలపై బోడపాడు గ్రామానికి చెందిన బాధితులు ఆందోళన చేసిన విషయం విదితమే. బోడపాడు గ్రామపరిధిలోని పెద్ద యాచవరం ఇలాకాలోని సర్వేనంబరు 3-5, మార్కాపురం రూరల్ ఇలాకాలోని 168-3ఏ సర్వే నెంబర్‌లలోని భూమిని వీఆర్‌వోలు పోతురాజు, సంజీవరెడ్డి సచివాలయ సర్వేయర్ శివనాయక్, క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించారు. సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు ఆరోపణలు వచ్చిన భూములను పరిశీలించామన్నారు. నివేదికలను ఉన్నత స్థాయి అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

## క్యాంపస్ మార్పునకు 829 మంది దరఖాస్తు

నూజివీడు టౌన్, ఆగస్టు 6: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు 829 మంది తమను వేరే క్యాంపస్‌కు బదిలీ చేయాలని కోరుతూ దరఖాస్తులు చేసుకున్నట్లు ఆర్జీయుకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ డాక్టర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత వివిధ క్యాంపస్‌లలో 753 సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయని వాటికి ఈ నెల 9 నుంచి రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు. యూనివర్సిటీ చరిత్రలో తొలిసారి క్యాంపస్ మార్పునకు అవకాశం ఇవ్వగా ఆర్‌కే వ్యాలీ నుంచి 45 మంది, ఒంగోలు నుంచి 451, శ్రీకాకుళం నుంచి 329 మంది, ఏలూరు జిల్లా నూజివీడు నుంచి కేవలం నలుగురు విద్యార్థులు వేరే క్యాంపస్‌లకు తమను బదిలీ చేయాల్సిందిగా కోరుతూ దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అదే సందర్భంలో మొదటి విడతలో కౌన్సెలింగ్‌కు హాజరు కాలేకపోయిన 37 మంది విద్యార్థులు తమకు మరోసారి కౌన్సెలింగ్‌కు అవకాశం ఇవ్వాల్సిందిగా దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

# వెలిగొండను వెంటనే పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వీరారెడ్డి

కొండపి, ఆగస్టు 6 : పశ్చిమప్రాంత ప్రజల ఆశల సౌధమైన వెలిగొండ ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కె.వీరారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కొచ్చెర్ల మాలకొండయ్య అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన పార్టీ మండల సమావేశంలో వీరారెడ్డి మాట్లాడారు. కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా బడ్జెట్ కేటాయింపులు ఆశించిన స్థాయిలో లేవన్నారు. జిల్లాలోని సమస్యలను పాలకులు పరిష్కరించాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలని ఆయన డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని పోతుల చెంచయ్య సంగమేశ్వరం ప్రాజెక్టు పనులు ప్రారంభించి త్వరగా పూర్తిచేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి గద్దల బాలకోటయ్య, ఆ పార్టీ మండల కార్యదర్శి ఆర్.లక్ష్మి, సభ్యులు ప్రసాద్, చంద్రయ్య, ఖాసిం, బ్రహ్మయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ షాపుల పునర్విభజన ఎప్పుడో..?

### పలు కాలనీల కార్డుదారులకు అందుబాటులో లేక ఇక్కట్లు


ప్రజా పంపిణీ వ్యవస్థ (ఫైల్)

అద్దంకి, ఆగస్టు 6 : అద్దంకి పట్టణంలో ఎక్కువ శాతం రేషన్ షాపులు కొన్ని ప్రాంతాలలో మాత్రమే కేంద్రీకృతమై ఉండగా, పలు కాలనీలలో అందుబాటులో రేషన్ షాపులు లేకుండా పోయాయి. సుమారు దశాబ్ద కాలం కిందట కార్డుల ఆధారంగా రేషన్ షాపులు ఏర్పాటు జరగగా అనంతరం కార్డుదారులు పెరిగినప్పటికి అదనంగా రేషన్ షాపులు పెరగలేదు. అద్దంకి పట్టణంలో సుమారు 10 వేల కుటుంబాలకు తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఆయా కుటుంబాలకు 18 రేషన్‌షాపుల నుంచి సరుకుల పంపిణీ జరుగుతుంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ షాపుల నుంచి సరుకులు తీసుకొని ఆటోలలో ఆయా కాలనీలకు వెళ్లి పంపిణీ చేస్తున్నారు. రేషన్ పంపిణీ ఆటోలు నిర్దిష్ట సమయం పాటించకపోవడం, ఎప్పుడో తమకు ఇష్టమైనప్పుడు వెళ్లి వీధిలో ఎక్కడో ఒక చోట నిలిపి పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆశించిన ప్రయోజనం లేదన్న అభిప్రాయం కార్డుదారులలో ఉంది. దీనికి తోడు ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రేషన్ పంపిణీ వాహన వ్యవస్థను రద్దు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాతపద్ధతిలో రేషన్ షాపుల వద్ద నే సరుకుల పంపిణీ జరిగే అవకాశం ఉంది. దీంతో అద్దంకి పట్టణంలో రేషన్ షాపుల కేటాయింపు ఆయా వార్డుల వారీగా కేటాయించి, ఆ పరిధిలో కార్డుదారులు ఆ రేషన్ షాపులో ఉండే విధంగా కేటాయింపు చేయాలని పలువురు కార్డుదారులు కోరుతున్నారు. అద్దంకి పట్టణంలో అత్యధిక శాతం పేద ప్రజలు నివాసం ఉండే రాజీవ్‌నగర్, శ్రీరామ్‌నగర్ కాలనీ, గుంజివారి పాలెం, గరటయ్య కాలనీ, నంబూరి పాలెం తదితర ప్రాంతాలలో అసలు రేషన్ షాపులు లేవు. కొన్ని ప్రాంతాలలో అయితే పక్క పక్కనే రెండు, మూడు రేషన్ షాపులు ఉన్నా యి. కార్డుదారులు ఏ షాప్‌లోనైనా రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు ఉన్నా ఆచరణలో మాత్రం అమలు జరగటం లేదు. సరుకులు లేవనే లేదా ఏదో ఒక సాకుతో తమ షాపు పరిధిలో లేని కార్డుదారులకు రేషన్ సరుకులు ఇవ్వకుండా ఎగనామం పెడుతున్నారు. అదే సమయంలో కార్డుదారుల సంఖ్య పెరిగినందున కొత్త షాపులు కూడా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. కొత్త షాపులు ఏర్పాటు సమయంలోనే అన్ని ప్రాంతాలలో రేషన్ షాపులు ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం 18 రేషన్ షాపులు ఉండగా, కనీసం మరో రెండు రేషన్ దుకాణాలను కొత్తవి ఏర్పాటు చేయడం ద్వారా అద్దంకి పట్టణంలోని 20 వార్డులలో ఒక్కో షాపును ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# సీఎం చంద్రబాబు పర్యటన..
# పోలీసులు నిబద్ధతతో పనిచేయాలి

### ఎస్పీ తుషార్ డూడీ దిశానిర్దేశం
### బందోబస్తులో 700 మంది అధికారులు, సిబ్బంది


పోలీసులకు దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

చీరాల, ఆగస్టు 6 : సీఎం చంద్రబాబు రేపు మధ్యాహ్నం సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని హెలిప్యాడ్ వద్దకు హెలికాప్టర్‌లో చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన చీరాల మండలం జాండ్రపేట బీవీ అండ్ బీఎన్ హైస్కూల్ ప్రాంగణంలో అధికారికంగా జరిగే అంతర్జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. పోలీసులు ఎవరెవరు ఏఏ విధులు నిర్వహించాలనే విషయమై సెయింట్ ఆన్స్ కళాశాలలో ఎస్పీ తుషార్ డూడీ మంగళవారం సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో పాటించాల్సిన నిబద్ధతపై దిశానిర్దేశం చేశారు. మొత్తం 700 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విధులలో ఎవరైనా అలక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. హెలిప్యాడ్ వద్ద, రూఫ్‌టాప్‌లలో, కాన్వాయ్ పార్టీలో, ట్రాఫిక్ మళ్లింపు, సభా వేదిక వద్ద ఇలా ఎక్కడెక్కడ ఎవరెవరు ఎలా విధులు నిర్వహించాలనే అంశంపై విపులంగా ఆదేశాలు ఇచ్చారు. సామాన్య ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఏదన్నా అత్యవసర పరిస్థితులు ఎదురయితే వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. అందులో తాత్సారం వద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్, రేపల్లె, చీరాల, బాపట్ల డీఎస్పీలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల అరెస్ట్

### రూ.4లక్షల సొత్తు స్వాధీనం
### ఐదుగురిలో ముగ్గురు మైనర్‌లు, మరో ఇద్దరు యువకులు
### పగలు సుబాబుల్ కర్ర కొట్టేపని.. రాత్రిపూట ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీ


పోలీసులు స్వాధీనం చేసుకున్న రాగి, అల్యూమినియం వైరు, నిందితులు

అద్దంకి, ఆగస్టు 6 : పగలు సుబాబుల్ కర్ర కొట్టే పనులు, చేపలు వేటకు వెళ్లడం.. రాత్రి అయితే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు పగులగొట్టి రాగి, అల్యూమినియం వైరు చోరీలకు పాల్పడే ముఠాను అద్దంకి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఆ వివరాలను మంగళవారం సీఐ కృష్ణయ్య వివరించారు. పోలీసుల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని శ్రీరామ్‌నగర్ ఎస్టీ కాలనీకి చెందిన యువకులు పొట్లూరి చెంచురామయ్య, యాటగిరి రామయ్యతో పాటు మరో ముగ్గురు మైనర్లు పగలు సమయంలో సుబాబుల్ తోటలను కొట్టేందుకు వెళ్లి ఆయా ప్రాంతాలలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను పరిశీలించి, రాత్రి వేళలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి ట్రాన్స్‌ఫార్మర్‌లు పగులగొట్టి అందులో ఉన్న కాపర్, అల్యూమినియం వైర్లను చోరీ చేసి అమ్మకాలు చేస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలోని 5 మండలాలతో పాటు మార్టూరు, చినగంజాం, వేటపాలెం మండలాలల పరిధిలో 39 కేసులకు సంబంధించి 66 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లలో రాగి, అల్యూమినియం వైర్లు చోరీ చేశారు. సుమారు 6,16,750 రూపాయలు విలువైన సొత్తు అపహరణకు గురి కాగా, మంగళవారం నిందితుల వద్ద నుంచి 4.05లక్షల రూపాయల విలువైన రాగి, అల్యూమినియం వైరును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కృష్ణయ్య వివరించారు. ఇద్దరు యువకులను అరెస్ట్ చేశామని, మరో ముగ్గురు మైనర్లు ఉన్నట్లు తెలిపారు. చోరీ కేసు ఛేదించిన ఎస్సై నాగరాజు, సిబ్బంది అంకమ్మరావు, సాయి కృష్ణారెడ్డి, గోపి, బ్రహ్మయ్యను సీఐ అభినందించారు. తమ పిల్లలకు దొంగతనాలు చేయడం ఎప్పుడూ లేదని, అన్యాయంగా అరెస్టు చేశారంటూ నిందితుల తల్లిదండ్రులతోపాటు కాలనీవాసులు, మహిళలు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి నిరసన తెలిపారు.

# మధ్యాహ్నానికే సచివాలయానికి తాళం

### వెనుతిరిగిన ప్రజలు


దొనకొండ-2 సచివాలయానికి వేసిన తాళం

దొనకొండ, ఆగస్టు 6 : ప్రజల సమస్యలు వారి గ్రామాల్లోనే పరిష్కరించేలా ఏర్పాటైన గ్రామ సచివాలయ వ్యవస్థ ఆచరణలో ఉద్యోగుల తీరుతో అభాసుపాలవుతోంది. అధికారుల పర్యవేక్షణా లోపంతో సిబ్బంది ఎప్పుడు వస్తున్నారో, ఎంతసేపు ఉంటున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. మంగళవారం దొనకొండ-2 సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది మధ్యాహ్నం నుంచి సచివాలయంకు తాళం వేసి వెళ్లిపోయారు. వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు కొంతసేపు అక్కడ కూర్చుని వెనుదిరిగి వెళ్లారు. కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్, వీఆర్వో, ఏఎన్ఎం, సర్వేయర్, ఎనర్జీ అసిస్టెంట్, మహిళా పోలీసు తదితర శాఖలకు చెందిన సిబ్బంది విధులు నిర్వహించాలి. మధ్యాహ్నానికే సచివాలయానికి తాళం వేశారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. దొనకొండ-2 సచివాలయం తాళం వేసిన విషయాన్ని ఎంపీడీవో వసంతరావునాయక్‌ను వివరణ కోరగా సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీచేస్తామన్నారు. ఇందుకు సంబంధించి వివరణ కోరుతూ తగిన చర్యలు చేపడతామని చెప్పారు.

## జామాయిల్ కర్ర అక్రమంగా తరలింపు

పామూరు, ఆగస్టు 6: అగ్రి గోల్డ్ భూముల్లోని జామాయిల్ కర్రను అక్రమంగా తరలించుకుపోతున్నారు. మండలంలోని పలుగ్రామాల్లో అగ్రిగోల్డ్ భూ ములు ఉన్నాయి. వీటిల్లో గల జామాయిల్ చెట్లను అక్రమంగా నరికి సొమ్ము చేసుకొంటున్నారు. సంస్థకు సంబంధించి కోర్టు కేసుల పెండింగ్‌లో ఉండటంతో కలిసివచ్చింది. రాత్రుళ్లు అక్రమంగా జామాయిల్‌ను నరికి లోడ్ చేసుకొని జేబులు నింపుకొంటున్నారు. మండలంలోని గుమ్మలంపాడు, పడమట కట్టకిందపల్లి గ్రామాలకు సరిహద్దులో అగ్రి గోల్డ్ సంస్థ సాగుచేసిన జామాయిల్ చెట్లను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రిపూట యంత్రాలతో అక్రమంగా నరికి లారీల్లో చెక్ పోస్టులను దాటిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. సోమవారం రాత్రి ఎస్ఐ సైదుబాబుకు జామాయిల్ కర్రను కొడుతున్నారని సమాచారం అందింది. దీంతో ఎస్ఐ తన సిబ్బందితో బయలుదేరగా, సమాచారం ముందే తెలుసుకున్న అక్రమార్కులు అక్కడ నుంచి ఉడాయించారు. అక్కడ లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉన్న జామాయిల్ దుంగలు ఉన్నాయి. సుమారు అర ఎకరా భూమిలో జామాయిల్‌ను నరికినట్లు రెవెన్యూ వర్గాలు తెలిపారు. మండలంలోని మిగతా గ్రామాల్లో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ కర్ర అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## అనుమతులు లేకుండా బ్యారన్‌లు నిర్మించొద్దు

### రైతులకు పొగాకు బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు సూచన


రైతులతో మాట్లాడుతున్న ఆర్ఎం లక్ష్మణరావు

కొండపి, ఆగస్టు 6 : పొగాకు బోర్డు అనుమతి లేకుండా రైతులు బ్యారన్‌లు నిర్మించవద్దని ఆర్ఎం ఎం.లక్ష్మణరావు కోరారు. అలా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రస్తుత సీజన్‌లో లభిస్తున్న ధరలను చూసి రైతులు ఆశకుపోతే నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించారు, కొనుగోళ్ల తీరును పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు. అధిక రేట్లకు బ్యారన్‌లు, పొలాలు కౌలుకు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. పొగాకు సాగు చేసే పొలాల్లో ముందుగా పచ్చిరొట్ట ఎరువు పంటలైన జీలుగ, జనుము, నువ్వు సాగు చేసుకుని 40 రోజుల తర్వాత భూమిలో కలియ దున్నుకోవాలని సూచించారు. బోర్డు అనుమతించిన మేరకే వచ్చే సీజన్‌లో పంటను పండించాలన్నారు. సమావేశంలో వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్, బోర్డు సభ్యుడు బొడ్డపాటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం


గర్భిణులకు సీమంతాలు చేస్తున్న ఎంపీడీవో, సీడీపీవో, అధికారులు

కొండపి, ఆగస్టు 6 : తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని ఎంపీడీవో నాగమణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక సీడీపీవో కార్యాలయంలో మంగళవారం తల్లులు, బాలింతలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తల్లిపాలు తప్పని సరిగా బిడ్డకు ఇవ్వాలని సూచించారు. పెట్లూరు పీహెచ్‌సీ డాక్టర్ అనూష మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. సీడీపీవో మాధవీలత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం పొందాలన్నారు. ఈసందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-1 కె.సురేఖ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విక్టోరియారాణి పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట పైర్ల పరిశీలన


పచ్చిరొట్ట పంటలను పరిశీలిస్తున్న ఏవో, వ్యవసాయ సిబ్బంది

అలకూరపాడు (టంగుటూరు), ఆగస్టు 6 : మండలంలోని అలకూరపాడు పొలాల్లో సాగులో ఉన్న పచ్చిరొట్ట పైర్లను మండల వ్యవసాయాధికారి జి.స్వర్ణలత, వ్యవసాయ సిబ్బంది మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా స్వర్ణలత రైతులకు పలు సూచనలు చేశారు. పచ్చిరొట్ట వలన భూసారం పెంపొందుతుందన్నారు. ప్రతి రైతు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను విధిగా ఈక్రాప్ చేయించుకోవాలన్నారు. అలా అయితేనే పంటల బీమా, నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ లాంటి పలు పథకాలకు అర్హులవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆలకూరపాడు గ్రామ రైతులు ఆలం రామారావు, చిడిపోతు కృష్ణయ్య, బి.వేణు, నార్నె వెంకటేశ్వర్లు, వాకా అంజిరెడ్డి పాల్గొన్నారు.

## గద్దర్‌తోపాటు చుండూరు మృతులకు నివాళి


కొవ్వొత్తులను వెలిగించి గద్దర్‌కు, చుండూరు మృతులకు నివాళులర్పిస్తున్న దళితులు

టంగుటూరు, ఆగస్టు 6 : చుండూరు మృతవీరులు, ప్రజా గాయకుడు గద్దర్‌కు దళిత సంఘాల నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో దళిత రైట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్, చప్పిడి వెంగళరావు, పాలేటి కోటేశ్వరరావు, వై.క్రాంతి, కొండలరావు, బొడ్డు సతీష్, వై.ఉజ్వల్, పేర్రాజు, పున్నారావు, చల్లాపల్లి గోపాల్ పాల్గొన్నారు.

## మనస్తాపంతో భర్త ఆత్మహత్య


పరమేశ్వర్ (ఫైల్)

చీరాలటౌన్, ఆగస్టు 6 : ప్రేమించి పెళ్లాడాడు. అన్యోన్య దాంపత్యంలో బాబుకు జన్మనిచ్చారు. అనుకోని విభేదాలతో భర్త బలవన్మరణం చెందిన ఘటన సోమవారం రాత్రి పట్టణ పరిధిలోని తెల్లగాంధీ బొమ్మ సమీపంలో జరిగింది. అందిన వివరాల ప్రకారం.. కనక పరమేశ్వర్(38), కీర్తి పదేళ్ల కిందట ప్రేమిం చి, పెద్దలను ఎదురించి పెళ్లి చేసుకున్నారు. వీరికి బాబు పుట్టాడు. కారు డ్రైవర్‌గా పనిచేస్తూ పరమేశ్వర్ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మద్యానికి బానిసై అలాగే అనారోగ్యానికి గురయ్యారు. ఈ క్రమంలో అప్పులు కూడా చేశారు. దీంతో భార్యతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. గతంలో ఆమె స్థానిక రోశయ్య కాలనీలోని పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే పెద్దల జోక్యంతో తిరిగి కాపురానికి వచ్చింది. కొద్ది కాలం పరిస్థితులు చక్కబడ్డాయి. కానీ మళ్లీ కొద్ది రోజులుగా విభేదాలు పెరిగాయి. సోమవారం మధ్యాహ్నం భార్య గొడవపడి తల్లితో విషయాన్ని చెప్పేందుకు వెళ్లింది. మనస్తాపం చెందిన పరమేశ్వర్ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. రాత్రి ఇంటికి వచ్చి భర్తను విగతజీవిగా చూసిన భార్య లబోదిబోమంది. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# విస్తారంగా కంది సాగు



మొక్కదశలో ఉన్న కంది

- ఆశాజనకంగా ఉన్న ధరలు
- మరోవైపు బర్లీ పొగాకు నాట్లు
- గతేడాది లాభాలతోనే మొగ్గు

పెద్ద దోర్నాల, ఆగస్టు 6: జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆరుతడి పంటలైన మిర్చి, పత్తికి ప్రత్యామ్నాయంగా రైతులు కంది సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఆగస్టు మాసం వచ్చినా పశ్చిమ ప్రకాశంలో సరైన వర్షపాతం లేకపోవడం, వ్యవసాయశాఖ అధికారులు కూడా కందిసాగుకు ఊతం ఇస్తుండడంతో రైతులు కందిసాగుకు ముందుకు సాగుతున్నారు.

ఏటా రెండు పంటలు పండిస్తే రైతులకు అదనపు ఆదాయం వస్తుంది. అయితే ప్రస్తుత పరిస్థిత పరిస్థితులు అందకు అనుకూలంగా లేవు. రబీలో పైర్లు సాగుచేస్తే ఖరీఫ్ సీజన్‌మొత్తం పొలాలు అంతరసేద్యం చేస్తూ ఉండాలి. తద్వారా ఖర్చు తడిచి మోపెడుతుంది. దీంతో రైతులు ప్రత్యామ్నాయంగా కంది, పొగాకు సాగుకు మొగ్గు చూపుతున్నారు. మరోవైపు ప్రభుత్వం 30శాతం రాయితీతో కంది విత్తనాలు మంజూరు చేస్తోంది. వ్యవసాయశాఖ అధికారుల ప్రోత్సాహం కూడా కంది సాగుకు ఊతం ఇస్తోంది. కందిలో సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పంట కాలం నాలుగున్నర నుంచి ఐదునెలలు ఉంటున్నప్పటికీ, ఖర్చు తక్కువగా ఉంటుంది.

**ఖర్చులు ఇలా..**

ఎకరానికి రెండు నుంచి మూడు కిలోల విత్తనాలు అవసరమవుతాయి. ఎకరం సాగుకు దుక్కి ఖర్చు రూ.2,000లు, గొర్రుగుంటక రూ.1600లు, విత్తినందులకు రూ.2,000లు, పశువుల ఎరువు ఖర్చు 20,000లు, కలుపు రూ. 1,200, మందులు ఖర్చు రూ. 1,500లు, కోత కూలీలు నూర్పిడి ఖర్చు రూ. 5,000లు మొత్తం రూ.35,000లు ఖర్చు అవుతుంది. ఎకరానికి 10 నుండి 12క్వింటాళ్ల దిగుబడులు వస్తాయి. ప్రస్తుతం క్వింటాలు ధర రూ. 8నుండి 10వేల వరకు పలుకుతోంది. ఆ ప్రకారం చూసినా ఎకరంపై రూ.35వేలకు పైగా ఆదాయం వచ్చే అవకాశముందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**ముమ్మరంగా ఖరీఫ్ సాగు**

తర్లుపాడు, : మండలంలో వారం రోజుల క్రితం కురిసిన వర్షానికి పొలం పదును కృడంతో ఖరీఫ్ సాగు ముమ్మరంగా సాగుతోంది. ఎక్కువగా కంది, బర్లీ పొగాకును సాగు చేస్తున్నారు. కందుల ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఎక్కువ మంది రైతులు కంది పంట ను విస్తారంగా సాగు చేస్తున్నారు. బర్లీ పొగాకు ఈ ఏడాది ఆశాజనకంగా ధరలు ఉండడంతో ఎన్నడూ పొగాకు సాగు చేయని రైతులు కూడా బర్లీ పొగాకు సాగు చేస్తున్నారు. బర్లీ పొగాకు మొక్క రూ.50 పైసల చొప్పున కొనుగోలు చేసి సుదూర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి నాటుతున్నారు. ఎకరాకు దాదాపుగా 15 వేల మొక్కలు నాటుతున్నారు. నాటు, వ్యవసాయంతో దాదాపుగా ఎకరాకు రూ.25వేలు ఖర్చు చేస్తున్నారు. ఈ ఏడాది బర్లీ పొగాకు క్వింటా రూ.16వేలు పలకడంతో రైతులు రానున్న కాలంలో కూడా అదే ధరలు వస్తాయని ఉత్సాహంతో సాగు చేస్తున్నారు. విపరీతంగా పొగాకు సాగు చేయటంతో ధరలు లేకపోతే రైతులకు కష్టాలు తప్పవు అంటూ పలువురు రైతుల ప్రతినిధులు చర్చించుకుంటున్నారు. రానున్న కాలంలో ధరలు లేకపోతే నష్టాలు తప్పవు. ప్రస్తుతం మండలంలో ఇప్పటికే 700 ఎకరాల్లో బర్లీ పొగాకును సాగు చేశారు. కంది పంటను కూడా ఇప్పటికే 1200 ఎకరాల్లో సాగు చేయగా మరింత ఎక్కువ మంది రైతులు కంది పంటను సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు.



సాగులో ఉన్న పొగాకు మొక్కలు

## కంచె తొలగించిన వారిపై ఫిర్యాదు



సచివాలయం వెంబడి పడగొట్టిన కంచె

కంభం, ఆగస్టు 6 : కంభం మండలం చిన్న కంభం పంచాయతీ సచివాలయ స్థలాన్ని ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన శిలాఫలకాన్ని కొందరు వ్యక్తులు ధ్వంసం చేసి ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సచివాలయ కార్యదర్శి సుధాకర్ తెలిపారు. చిన్నకంభానికి చెందిన నక్కా ప్రసాద్, లడ్డుప్రసాద్, నక్కా రంగయ్యలు మద్యంసేవించి సచివాలయానికి వచ్చారు. తాము రంగస్వామిగుడి పెద్దమనుషులమని, ఈ స్థలం దేవాలయానికి చెందినదని చెబుతూ కంచెను, శిలాఫలకాన్ని దౌర్జన్యంగా ధ్వంసం చేశారు. అంతేకాకుండా తమపై కూడా దాడికి వచ్చారని సచివాలయ సిబ్బంది తెలిపారు. గ్రామస్థులు వచ్చి వారించి వారిని వెనక్కు పంపించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించడంతోపాటు మా విధులకు ఆటంకం కల్పించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి సుధాకర్ తెలిపారు.

## పారిశుధ్య కార్మికుల ధర్నా

గిద్దలూరు, ఆగస్టు 6 : పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఏడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు అర్థాకలితో అలమటిస్తున్నారన్నారు. మండలంలోని 75 మంది పాఠశాల పారిశుధ్య కార్మికులకు 7 నెలలుగా గౌరవ వేతనం అందడంలేదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించి కనీస వేతన చట్టం అమలు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పారిశుధ్య కార్మికుల ప్రతినిధులు సమీర, పుష్ప, రాధ, తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో ఇద్దరు అరెస్ట్

మార్కాపురం, ఆగస్టు 6: తన కుమార్తెను వెంటపడి వేధించవద్దని వారించిన వ్యక్తిపై కత్తితో దాడిచేసిన నిందితులను ఎట్టకేలకు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. సీఐ ఆవుల వెంకటేశ్వర్లు కథనం మేరకు ఈ నెల 2న రాత్రి నెహ్రూబజార్‌లో నాలి సత్యనారాయణను ఆకుల భవాని, దుర్గాసాయిలు కత్తితో దాడి చేశారు. దాడి అనంతరం వారిరువురు కొండపి పారిపోయారు. పోలీసులు ప్రత్యేక బృందాలతో నిందితులను గాలించారు. పట్టణంలో తిరుగుతున్న వారిని మంగళవారం అరెస్ట్ చేశారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సిబ్బందిని సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.

## రేషన్ సరుకులు అందరికీ అందాలి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 6 : రేషన్ సరుకులు అందరికీ అందాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి అనీల్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు రేషన్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలోని బియ్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వం అందించిన స్టాక్ వివరాలను సంబంధిత డీలర్ల వద్ద రిజిష్టర్‌లో పరిశీలించారు. వినియోగదారులకు అందుబాటులో దుకాణాలను నిత్యం తెరిచి ఉంచాలని తెలిపారు. తూకంలో సరుకులు తేడా లేకుండా ఇవ్వాలన్నారు. బియ్యం పంపిణీ చేయకుండా అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎంఎల్ఎస్ పాయింట్ నందు డీలర్ వెళ్ళి తూకం వేసుకుని సరుకులు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు



వినతిపత్రం అందజేస్తున్న సావిత్రి

ఎర్రగొండపాలెం, ఆగస్టు 6: దోర్నాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలం మంజూరు చేయించి, నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మంగళవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సావిత్రి, అధ్యాపకులు ఎరిక్షన్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషిచేస్తానన్నారు.

## బోడపాడు సర్పంచ్ భూఅక్రమాలపై విచారణ

మార్కాపురం రూరల్, ఆగస్టు 6: మండలంలోని బోడపాడు గ్రామంలో వైసీపీ సర్పంచ్ ముక్కమల్ల రమణారెడ్డి భూఆక్రమణలపై అధికారులు మంగళవారం విచారించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సర్పంచ్ భూ ఆక్రమణలపై బోడపాడు గ్రామానికి చెందిన బాధితులు ఆందోళన చేసిన విషయం విదితమే. బోడపాడు గ్రామపరిధిలోని పెద్ద యాచవరం ఇలాకాలోని సర్వేనంబరు 3-5, మార్కాపురం రూరల్ ఇలాకాలోని 168-3ఏ సర్వే నెంబర్‌లలోని భూమిని వీఆర్‌వోలు పోతురాజు, సంజీవరెడ్డి సచివాలయ సర్వేయర్ శివనాయక్, క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించారు. సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు ఆరోపణలు వచ్చిన భూములను పరిశీలించామన్నారు. నివేదికలను ఉన్నత స్థాయి అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

## కంభంలో హర్ గర్ తిరంగా కార్యక్రమం

కంభం, ఆగస్టు 6 : రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడం శుభ పరిణామమని బీజేపీ జిల్లా అధ్యక్షులు టీవీ.శివారెడ్డి తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం కంభంకు వచ్చిన ఆయన జిల్లా ఇన్‌చార్జ్ రవిశంకర్, జిల్లా జనరల్ సెక్రటరీ నరాల శ్రీనివాసరెడ్డి, తదితరులతో కలిసి కందులాపురం కూడలిలో హర్‌గర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకు 13 నుండి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఏర్పాటుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో పార్టీ మరింత అభివృద్ధి చెందడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట రామాంజనేయులు, అసెంబ్లీ కోకన్వీనర్ రాముడు, జిల్లా మోర్చ ప్రధాన కార్యదర్శి పుల్లయ్య, మైనారిటీ అధ్యక్షులు షేక్ ఖాదర్‌వలి, రఫీ, గిద్దలూరు పట్టణ అధ్యక్షులు ఉదయ్‌శంకర్, రూరల్ మండల అధ్యక్షులు తిరుపాల్‌రెడ్డి, జిల్లా ఓబీసీ కార్యవర్గ సభ్యులు వీరచక్రం, తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రరాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి లక్ష్యం

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



విలేకర్లతో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

మార్కాపురం, ఆగస్టు 6: రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పాలన అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. బ్రిటీష్ వాళ్ల నాడు దేశాన్ని కొల్లగొట్టుకుని పోయినట్లు వైసీపీ నాయకత్వం రాష్ట్రాన్ని లూటి చేసిందన్నారు. సుమారు రూ.7లక్షల కోట్లు ఏమయ్యాయో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రాన్ని లూటీచేసి వైసీసీ నేతలు జేబులు నింపుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కూడా కాకముందే వైసీపీ నేతలు ఢిల్లీ వెళ్లి ధర్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రాజకీయ హత్యలు జరిగాయని ఒకే అబద్ధాని పదేపదే ప్రచారం చేస్తూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వారి పేర్లు ఇవ్వమంటే నేటికీ ఇవ్వలేదన్నారు. దగాకోరు వైసీపీకి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ప్రజల తీర్పును గౌరవించి వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని హితవుపలికారు. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన సూచనలు చేస్తే స్వాగతిస్తామన్నారు. భవిష్యత్తులో వైసీపీకి అధికారం వచ్చే పరిస్థితులు కనుచూపుమేర లేవన్నారు. దీంతో కేడర్‌ను నిలుపుకోవడంతో కూటమి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. మార్కాపురంలో జరిగిన భూబాగోతాలను కూడా త్వరలో వెలికితీస్తామన్నారు. బాధితులు అర్జీల రూపంలో తమకు అందజేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆగస్టు 15 నుంచి తానే స్వయంగా అర్జీల స్వీకరించనున్నట్లు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడానికి మార్కాపురం జిల్లా ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. సమావేశంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, పట్టణ, మండల, తర్లుపాడు మండల పార్టీల అధ్యక్షులు షేక్ మౌలాలి, జవ్వాజి రామానుజులరెడ్డి, చిన్నపరెడ్డిలు పాల్గొన్నారు.

మార్కాపురం : నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా బీజేపీ నాయకులు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని కోరారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ రవిశంకర్‌లు నియోజకవర్గ నాయకులతో కలిసి వెళ్లి ఎమ్మెల్యే నారాయణరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్టు, మార్కాపురం జిల్లా, ప్రధాన సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశాన్ని చేర్చడం మార్కాపురం డివిజన్‌కు వరమని తెలిపారు. జిల్లాకు వచ్చే నిధుల్లో సింహభాగం మార్కాపురం డివిజన్‌కే కేటాయించేలా తాము కూడా కృషి చేస్తామని బీజేపీ నాయకులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఐటీ వింగ్ రాష్ట్ర నాయకులు జీవీ రెడ్డి, నియోజకరవ్గ ఇన్‌ఛార్జి పీవీ కృష్ణారావు, దేవిశెట్టి చంద్రశేఖర్, అమరసింహం, నరాల శ్రీనివాసరెడ్డి, షేక్ కరీంబాష, శ్యాంబాబు, రామకృష్ణ, ఎం.వాసవీప్రియ తదితరులు పాల్గొన్నారు.

# భూసార పరీక్షలతో పెట్టుబడుల తగ్గింపు



జమ్మిదోర్నాలలో అవగాహన కల్పిస్తున్న ఏవో

పెద్ద దోర్నాల, ఆగస్టు 6: భూసార పరీక్షలతో రైతులు తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు పొందాలని వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మండలంలోని జమ్మిదోర్నాల గ్రామంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పొలాలను పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా భూమిలో లోపాలను గుర్తించి సరిచేసుకోవచ్చన్నారు. తద్వారా ఏ పంటను సాగు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందో తెలుస్తుందన్నారు. పొలాల్లో మట్టినమూనా సేకరించడంపై రైతులకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. వర్షాభావ పరిస్థితుల్లో పత్తికి బదులు కంది, మినుము పైర్లు సాగు చేసుకోవాలన్నారు. 30 శాతం రాయితీతో కంది విత్తనాలు మంజూరయ్యాయని తెలిపారు. విత్తనాలు కావలసినవారు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అదే సమయంలో సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసా య సహాయకులు రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

గిద్దలూరు : రైతులు తాము పండించిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంబవరం, వెల్లుపల్లి రైతుసేవా కేంద్రాల పరిధిలో రైతులకు ఈ-క్రాప్‌పై అవగాహన కల్పించారు. పంట నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సెప్టెంబరు 15లోగా పంట నమోదు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల పరిధిలో సాగైన ఆముదం, కొర్రలు, నువ్వు పంటలను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు శేఖర్, మహమ్మద్‌నూర్, గ్రామ రెవెన్యూ అధికారి ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# క్రీడలతో విద్యార్థులలో శారీరక మానసిక ఎదుగుదల

- ఎంఈవో ఆంజనేయులు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 6 : విద్యార్థులు ఆటలపోటీలలో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఎదుగుదల ఉంటుందని ఎంఈవో పి.ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గురుకుల పాఠశాల ప్రాంగణంలో ఆర్‌డీటీ సంస్థ ఆధ్వర్యంలో ఎంఈవోలు ఆటల పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., విద్యార్థిదశలో ప్రతి విద్యార్థి ఆటలు, క్రీడా పోటీలలో విధిగా పాల్గొనాలన్నారు. వై.పాలెం నియోజకవర్గం, మాచర్ల నియోజకవర్గంలోని ఆశ్ర మ పాఠశాలలు, గిరిజన విద్యార్థునులు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీవాణి, అధ్యాపకులు దయాకర్, ఆర్‌డీటీ ఎర్రగొండపాలెం టీం లీడర్ గిరిజ, పీడీ బ్రహ్మయ్యనాయక్, అన్ని మండలాల గిరిజన ఆశ్రమపాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



పరుగు పెడుతున్న విద్యార్థులు



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈవో ఆంజనేయులు

## మానవత్వం చాటుకున్న పోలీసులు



పోలీసుల సంరక్షణలో ఉన్న వృద్ధులు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 6 : దిక్కుతోచని స్థితిలో చెత్తకుప్ప వద్ద ఉన్న ఓ వృద్ధుడిని వృద్ధాశ్రమానికి చేర్చి పోలీసులు మానవత్వం చాటుకున్నాడు. మూగవాడైన ఓ వృద్ధుడు చెత్తకుప్పలో పడి ఉన్నాడు. విషయాన్ని తెలుసుకున్న అర్బన్ సీఐ సోమయ్య సిబ్బందిని పంపి అతడికి స్నానం చేయించి బట్టలు ఇప్పించారు. అతడు ఎక్కడి నుంచి వచ్చాడో, ఎందుకు అక్కడ ఉన్నాడో చెప్పలేని పరిస్థితిని గుర్తించారు. వెంటనే స్థానికంగా ఉన్న సంజీవిని వృద్ధాశ్రమానికి తరలించి ఆశ్రయం కల్పించారు. వృద్ధుడి బంధువుల వివరాలు సేకరించేందుకు సీఐ సోమయ్య ప్రయత్నించగా ఫలితం లేకపోయింది. అయితే తన కుటుంబసభ్యులు ఎవరూ పట్టించుకోవడం లేదని, తాను వృద్ధాశ్రమంలోనే ఉంటానని సైగల ద్వారా పోలీసులకు తెలి పాడు. దిక్కుతోచని స్థితిలో ఉన్న వృద్ధుడిని సీఐ సోమయ్య, పోలీసు సిబ్బంది అనాథాశ్రమంలో చేర్పించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## యోగా పోటీలలో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపికైన విద్యార్థులు

త్రిపురాంతకం, ఆగస్టు 6: జిల్లా స్థాయి యోగా పోటీలలో మండలంలోని గొల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఒంగోలులోని పీవీఆర్ హైస్కూల్‌లో జరిగిన 49వ జిల్లా స్థాయి పోటీలలో పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-10 బాలుర విభాగంలో టి.వెంకటచైతన్య, అండర్-14 బాలికల విభాగంలో ఓ.వెంకటరేణుక, అండర్-45 విభాగంలో పీడీ రాధ ప్రథమ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులతోపాటు పీడీ రాధను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.దీప్తి ఆధ్వర్యంలో సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

**రాష్ట్ర స్థాయి పోటీలకు దోర్నాల విద్యార్థులు**

పెద్దదోర్నాల, ఆగస్టు 6: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు దోర్నాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న ఒంగోలు పీవీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పీవీ వీరాంజనేయులు, కే.క్రాంతి ప్రసన్నలు పాల్గొని తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను వారిని తీర్చిదిద్దిన యోగా మాస్టారు మహేశ్వరరెడ్డి, ప్రేమచంద్, వ్యాయామ ఉపాధ్యాయులు పీ రామానాయక్, హెచ్ రామానాయక్‌లను అభినందించారు.

## అవీ..ఇవీ..

### వ్యవసాయ రుణాలపై వర్క్‌షాప్

గిద్దలూరు, ఆగస్టు 6 : గిద్దలూరులో వ్యవసాయ రుణాలపై యూపీఐసీవో ఆధ్వర్యంలో అధికారులు వర్క్‌షాపు నిర్వహించారు. అర్హత ప్రమాణాలు, దరఖాస్తు ప్రక్రియ, రీపేమెంట్ ప్లాన్లతో సహా వ్యవసాయ రుణపథకాల యొక్క వివరాలను వివరించారు. వ్యవసాయ సంస్థలకు మద్దతు ఇవ్వడంలో, ఉత్పాదకతను పెంచడంలో ఈ రుణాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. వ్యవసాయ రుణాల ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో యూపీఐసీవో ప్రతినిధులు సికిందర్, గురువయ్య, రైతులు, వ్యాపారులు, ఆర్‌బీకే సిబ్బంది హాజరయ్యారు.

### వెలిగొండకు వరద జలాలను మళ్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

గిద్దలూరు, ఆగస్టు 6 : వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి శ్రీశైలం వరద జలాలను మళ్లించాలని బీజేపీ కిసాన్‌మోర్చ నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలలోని ప్రజలకు, రైతులకు తాగు, సాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టుకు టన్నెల్స్ పూర్తయినప్పటికీ నీరు అందించడం లేదన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకుని శ్రీశైలం వరద జలాలను మళ్లించే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు యు.శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ, తదితరులు ఉన్నారు.

### రైతులు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



పంట నమోదులో పాల్గొన్న అధికారులు

మార్కాపురం రూరల్, ఆగస్టు 6: పంటలు సాగుచేసిన ప్రతిరైతు తప్పని సరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని టీడీపీ మండల అధ్యక్షులు జవాజి రామాంజులరెడ్డి కోరారు. మండలంలోని దరిమడుగు గ్రామంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను వ్యవసాయశాఖ అధికారులతో కలిసి మంగళవారం ఈ క్రాప్ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ చేయించడం వలన ప్రభుత్వం నుంచి అందాల్సిన రాయితీ, బీమా అందుతుందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో బడేసాహెబ్, ఉద్యానవన శాఖ సహాయకుడు సాయి, రైతులు పాల్గొన్నారు.

### ఎస్ఎంసీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- ఎంఈవో మస్తాన్‌నాయక్



మాట్లాడుతున్న ఎంఈవో మస్తాన్ నాయక్

పెద్దదోర్నాల, ఆగస్టు 6: పాఠశాలల అభివృద్ధి కమిటీ(ఎస్ఎంసీ)ఎన్నికలు ఈ నెల 8న సజావుగా నిర్వహించా లని ఎంఈవో మస్తాన్ నాయక్ అన్నారు. స్థానిక మానవ వనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ఆధారంగా ఎటువంటి పొరపాట్లు లేకుండా ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బొమ్మలాపురం ప్రధానోపాధ్యాయురాలు జే.ఝాన్సీలక్ష్మీబాయి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

### ప్రత్యేక నిధుల కేటాయింపు అభినందనీయం



మాట్లాడుతున్న శివారెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 6: ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ప్రకాశం జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించటం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్య క్షులు శివారెడ్డి అన్నారు. స్థానిక బీజేపీ కార్యాల యంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో శివారెడ్డి మాట్లాడారు. కేంద్రం కరువు జిల్లాలకు సంబంధించి అనేక రాయితీలు, అభివృద్ధి కార్యక్రమాలకు మున్ముందు ఇంకా నిధులు మంజూరు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ రవిశంకర్, నాయకులు నరాల శ్రీనివాసరెడ్డి, దివిశెట్టి చంద్రశేఖర్, అమరసింహా, శివప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస యాదవ్, లక్ష్మీరెడ్డి, శ్రీనివాస్ చౌదరి, రమణారెడ్డి, కరీం బాషా పాల్గొన్నారు.

### టీ5 తీగలేరు కాలువను చిన్న కండ్లేరు చెరువుకు అనుసంధానించాలి

సీపీఐ కార్యదర్శి శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఎర్రగొండపాలెం, ఆగస్టు 6 : వెలిగొండ ప్రాజెక్టు నుంచి వచ్చే టీ5 తీగలేరు కాలువను పుల్లలచెరువు సమీపంలో ఉన్న చిన్న కండ్లేరు చెరువుకు అనుసంధానం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి.శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. పశ్చిమ ప్రకాశంలో వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేస్తే సాగునీరు, తాగునీటి సమస్య తీరుతుందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పనులు పూర్తిచేసి నీళ్లు ఇవ్వడంతో పాటు, మార్కాపురం జిల్లా ను ప్రకటించి ఈ ప్రాంత ప్రజలకు మేలు చేయాలని అన్నారు. రోడ్లకు మరమ్మతులు చేయాలని అన్నారు. సీపీఐ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, కేవీ కృష్ణగౌడ్, నక్కా తిరుపతయ్య త్రిపురాంతకం మండల కార్యదర్శి బి రామయ్య, సభ్యులు పాల్గొన్నారు.

### పాఠశాలను సందర్శించిన ఎంఈవో



తనిఖీ చేస్తున్న ఎంఈవో శార్వణి

కంభం, ఆగస్టు 6 : కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎంఈవో శార్వణి సందర్శించారు. విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనశాల పరిశుభ్రంగా ఉండడం, విద్యార్థులకు చాలీచాలని భోజనాలు వడ్డించడాన్ని నీటిశుద్ధికేంద్రం పనిచేయకపోవడంతో తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించారు. కేంద్రాన్ని మరమ్మతు చేయాలని సూచించారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

### న్యాయ సేవలు వినియోగించుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 6: మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న న్యాయసేవలు వినియోగించుకోవాలని న్యాయవాదులు ఆసీఫ్, నవీన్‌లు అన్నారు. స్థానిక 12, 20 సచివాలయాలలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వివిధ అంశాలపై వివరించారు. పింఛన్లు అందకుంటే, న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తితే మండల న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవా సహాయకుడు షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## వర్షానికి జీవం పోసుకున్న పైర్లు

దర్శి, ఆగస్టు 6: దర్శి ప్రాంతంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పైర్లు జీవం పోసుకున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో కంది, సజ్జ, జొన్న పత్తి తదితర పైర్లను రైతులు సాగు చేస్తున్నారు. ఇంకా వర్షంలేక కొన్ని భూముల్లో విత్తనం వేయలేదు. సాగుచేసిన పైర్లు వాడుముఖం పడుతున్న తరుణంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దర్శిలో 55.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షానికి మెట్టపైర్లు జీవం పోసుకొని కళకళలాడుతున్నాయి. సాగుకు సిద్ధం చేసిన భూముల్లో విత్తనం వేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు.

## రిజర్వాయర్‌లో చెట్ల తొలగింపునకు చర్యలు

పామూరు, ఆగస్టు 6: పామూరు మండలంలోని మోపాడు రిజర్వాయర్ లోపలి భాగంలో దట్టంగా పెరిగిన చిల్లచెట్లను తొలగింపు చర్యలు చేపడుతున్నట్లు ఇరిగేషన్ డీఈ రవి తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా రిజర్వాయర్‌లో ఉన్న చిల్లచెట్లు కుళ్లిపోయి ఉండటంతో నీరు కలుషితంగా మారింది. ప్రస్తుతం జైకో నిధులతో కాలువల రివిట్‌మెంట్ పనులు, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి రిజర్వాయర్ వరకు బీటీ రోడ్డు, రిజర్వాయర్ తూము షట్టర్ మరమ్మతు పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఫిషరీష్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన నిధులతో కలుషితంగా మారిన నీటిని బయటకు తోడి లోపలి భాగంలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నట్టు రవి తెలిపారు.

## విద్యతోనే అభివృద్ధి

పామూరు, ఆగస్టు 6: విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక పువ్వాడి ఫంక్షన్ హాల్‌లో అక్షర విద్యా సంస్థల ఫ్రెషర్‌డే వేడుకలు మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉందన్నారు. ఈసందర్భంగా గత ఏడాది ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. అనంతరం ఉగ్రను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అక్షర విద్యా సంస్థల డైరెక్టర్ కదిరి సత్యప్రసాద్, కరస్పాండెంట్ కదిరి బాబు రంగారావు, టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, డాక్టర్ గద్దె ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌గా ఉష బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యాలయ సిబ్బంది

పీసీపల్లి, ఆగస్టు 6: పీసీపల్లి తహసీల్దార్‌గా సీహెచ్ ఉష మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా డీటీ శ్రీను, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఆమెకు బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన ఆమె మాట్లాడుతూ మండల ప్రజలు, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కరించేక్రమంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

పీసీపల్లి, ఆగస్టు 6: పీసీపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన బుధవారం జరుగుతుందని ఎంపీడీవో వెంకటసుబ్బారావు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎంపీటీసీలు. సర్పంచ్‌లు హాజరుకావాలని ఆయన కోరారు. సమావేశంలో పాల్గొనే మండలస్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

## ఇండ్లచెరువు రహదారికి రూ.కోటి ఇరవై లక్షలు మంజూరు

దొనకొండ, ఆగస్టు 6: మండలకేంద్రమైన దొనకొండ నుంచి ఇండ్లచెరువు గ్రామం మీదుగా గజ్జలకొండ వెళ్లే ప్రధాన రహదారికి కోటి ఇరవై లక్షల రూపాయలు మంజూరైనట్లు పంచాయితీరాజ్ అధికారులు తెలిపారు. గుంతలమయం ఇండ్లచెరువు రహదారి శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సదరు పనికి దర్శికి చెందిన కంపెనీతో ఒప్పందం జరిగిందని పంచాయతీరాజ్ డీఈఈ తెలిపారు.

# 'దర్శి' అభివృద్ధికి సహకరించాలి

» సీఎంను కోరిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


సీఎం చంద్రబాబుకు బొకే అందజేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఆగస్టు 6: సీఎం చంద్రబాబును మంగళవారం అమరావతిలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కలిశారు. ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్, మామ డాక్టర్ కడియాల వెంకటేశ్వర్లుతో కలిసి చంద్రబాబు వద్దకు వెళ్లారు. ఈసందర్భంగా దర్శి నియోజకవర్గ అభివృద్ధికి అన్నివిధాలుగా సహకరించాలని చంద్రబాబును కోరినట్లు డాక్టర్ లక్ష్మి తెలిపారు. దర్శి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను సీఎం అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో వీరోచితంగా పోరాడారని ఆయన అభినందించినట్లు తెలిసింది. మీ రాజకీయ భవిష్యత్తు నేను చూసుకుంటానని, మిమ్మల్ని రాజకీయంగా పైకి తీసుకొస్తానని చంద్రబాబు భరోసా ఇచ్చినట్లు తెలిసింది. దర్శి నియోజకవర్గ ప్రజలతో మమేకమై నిరంతరం పనిచేయాలని సూచించినట్లు ఆమె తెలిపారు. దొన కొండ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని, సాగర్ కాలువలకు మరమ్మతులు చేపట్టి సాగునీరు అన్నిప్రాంతాలకు అందేలా చూడాలని విజ్ఞప్తి చేయగా సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. తాగునీటి శాశ్వత పథకాలైన అమృత, జలజీవన్ పథకాలను పూర్తి చేసేందుకు సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు.

దొనకొండలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఉన్న గొట్టిపాటి లక్ష్మికి సీఎం చంద్రబాబును కలవాలని ఆయన కార్యాలయం నుంచి సమాచారం రావడంతో హుటాహుటీన బయలుదేరివెళ్లారు. సీఎంతో గొట్టిపాటి లక్ష్మి కుటుంబసభ్యులు సుమారు అరగంట సేపు అన్ని విషయాలు మాట్లాడినట్లు తెలిపింది. చంద్రబాబును కలిసిన తర్వాత ఆయన ఇచ్చిన హామీలతో వారు ఆనందం వ్యక్తం చేశారు.

**ఆరోగ్యకర సమాజమే ప్రభుత్వ లక్ష్యం**

దొనకొండ, ఆగస్టు 6: సమాజం ఆరోగ్యంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఆరోగ్యకరమైన సమాజమే టీడీపీ కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. స్థానిక ఆరోగ్యకేంద్రం వద్ద మంగళవారం నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజాహిత కార్యక్రమాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని చెప్పారు. తల్లిపాలకు ఉన్న ప్రాముఖ్యమైన అనేక అంశాలను వివరించారు.

కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ సునీత, టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, మోడి వెంకటేశ్వర్లు, మగ్బూల్ అహమ్మద్, డాక్టర్ మల్లికార్జునశర్మ, పులిమి రమణాయాదవ్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.


తల్లిపాల విశిష్టతను సూచించే బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

# ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


ఆసుపత్రిలో జరుగుతున్న పనులపై సూపర్‌వైజర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఆగస్టు 6: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందంచాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఇటీవల ప్రత్యేక నిధులతో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని సంబంధిత కాంట్రాక్టర్, సూపర్‌వైజర్‌కు సూచించారు. ఆసుపత్రిలోని రోగుల వార్డులతో పాటు వైద్యుల చాంబర్‌లు శుభ్రంగా ఉండాలన్నారు. ఆసుపత్రిలో వివిధ వార్డులను పరిశీలించారు. వార్డుల్లో పాడై పడిఉన్న సామగ్రిని చూసి ఎమ్మెల్యే నివ్వెరపోయారు. ప్రభుత్వాలు లక్షలాది రూపాయలు వెచ్చించి రోగులకు మౌలిక వసతుల కల్పించేందుకు పంపించిన సామగ్రిని ఉపయోగించకపోవటంపై అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోని ప్రసూతి వార్డుల్లో సేవలు అందకపోవటంపై ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. ఈనెల 15 నుంచి ఆపరేషన్లు కూడా ప్రభుత్వాసుపత్రిలో జరగాలన్నారు. ఎవరైనా సేవలు అందటం లేదని పరాయి ప్రాంతాలకు పరుగులు పెట్టినట్లు తెలిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు మేలు



పామూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కురిచేడు, ఆగస్టు 6: తల్లిపాలు బిడ్డకు మేలు అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన తల్లి పాల వారోత్సవ కార్యక్రమానికి వైద్యాధికారి ప్రవీణ్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ మారుతున్నకాలంలో తల్లులు బిడ్డలకు పాలు ఇవ్వడానికి ఆలోచిస్తున్నారన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లికి మేలు జరుగుతుందన్నారు. ఆవులమందకు చెందిన గొట్టిపాటి వెంకటేశ్వర్లు గర్భిణులు, బాలింతలకు బ్రెడ్, అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, ఎంపీడీవో సీతారామయ్య, సీడీపీవో భారతి, లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు జోన్ చైర్మన్ జేబీ రామారావు, అధ్యక్షుడు వీవీ రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

**తల్లి పాలు బిడ్డకు ఔషధం లాంటిది**

పామూరు, ఆగస్టు 6: బిడ్డకు తొలి ఆహారం అమ్మపాలని సర్పంచ్ బద్దిపూడి శారమ్మ అన్నారు. ఇది బిడ్డ ఎదుగుదలకు ఔషధంలా పనిచేస్తుందని చెప్పారు. మండలంలోని పామూరు, సట్టుమడుగు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గోళ్ల పద్మజ, ఎంపీఎస్ పార్వతి, షేక్ రమీజీ, రూహి, విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీఎస్‌పురం మండల కేంద్రంలోనూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ రామచంద్రరావు, డాక్టర్లు ఎస్.మురళి, హోమద్యుతి, సూపర్‌వైజర్ దేవా కృపావరం, తదితరులు పాల్గొన్నారు.

**తల్లిపాలు అమృతంతో సమానం**

ముండ్లమూరు, ఆగస్టు 6: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి.సునీత అన్నారు. బిడ్డకు జన్మనిచ్చిన ప్రతి తల్లి మొదట ముర్రు పాలు తాగించినట్లయితే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. మంగళవారం ఉల్లగల్లులోని కొత్తూరు అంగన్‌వాడీ పాఠశాలలో జరిగిన తల్లిపాల వారోత్సవంలో ఆమె మాట్లాడారు. ఎక్కువగా విటమిన్స్ ఉండే పదార్థాలు తీసుకోవటం వల్ల పుట్టబోయే బిడ్డ పరిపుష్టిగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ చైతన్యభారతి తదితరులు పాల్గొన్నారు.

**సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలి**

కనిగిరి, ఆగస్టు 6: అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్రమంగా పౌష్టికాహారం అందించాలని సూపర్‌వైజర్ సుమతి అన్నారు. పట్టణంలోని బొగ్గులగొంది కాలనీలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కేంద్రంలో అందుతున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ముర్రుపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్‌లు సుశీల, అంకమ్మ, శారద, విష్ణుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

# జామాయిల్ కర్ర అక్రమంగా తరలింపు


అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ తోట

పామూరు, ఆగస్టు 6: అగ్రిగోల్డ్ భూముల్లోని జామాయిల్ కర్రను అక్రమంగా తరలించుకుపోతున్నారు. మండలంలోని పలుగ్రామాల్లో అగ్రిగోల్డ్ భూములు ఉన్నాయి. వీటిల్లో గల జామాయిల్ చెట్లను అక్రమంగా నరికి సొమ్ము చేసుకొంటున్నారు. సంస్థకు సంబంధించి కోర్టు కేసుల పెండింగ్‌లో ఉండటంతో కలిసివచ్చింది. రాత్రుళ్లు అక్రమంగా జామాయిల్‌ను నరికి లోడ్ చేసుకొని జేబులు నింపుకొంటున్నారు. మండలంలోని గుమ్మలంపాడు, పడమట కట్టకిందపల్లి గ్రామాలకు సరిహద్దులో అగ్రిగోల్డ్ సంస్థ సాగుచేసిన జామాయిల్ చెట్లను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రిపూట యంత్రాలతో అక్రమంగా నరికి లారీల్లో చెక్ పోస్టులను దాటిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. సోమవారం రాత్రి ఎస్ఐ ఎంసైదుబాబుకు జామాయిల్ కర్రను కొడుతున్నారని సమాచారం అందింది. దీంతో ఎస్ఐ తన సిబ్బందితో బయలుదేరగా, సమాచారం ముందే తెలుసుకున్న అక్రమార్కులు అక్కడ నుంచి ఉడాయించారు. అక్కడ లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉన్న జామాయిల్ దుంగలు ఉన్నాయి. సుమారు అర ఎకరా భూమిలో జామాయిల్‌ను నరికినట్లు రెవెన్యూ వర్గాలు తెలిపారు. మండలంలోని మిగతా గ్రామాల్లో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ కర్ర అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# జాతీయ విపత్తుగా ప్రకటించి కేరళను ఆదుకోవాలి


విరాళాల సేకరణలో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్ తదితరులు

పామూరు, ఆగస్టు 6: ప్రకృతి విలయ తాండవానికి సర్వసం కోల్పోయిన కేరళ రాష్ట్రం వయనాడ్‌లో ప్రజలను ఆదుకోనేందుకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హానీఫ్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం వయనాడ్ ప్రజలను ఆదుకొనేందుకు విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కేరళ రాష్ట్రం వయనాడ్‌లో అధిక వర్షాలతో కొండ చరియలు విరిగిపడిన ప్రమాదంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయాన్నారు. కొంతమంది గాయాలు పాలై నిరాయుధులుగా మారారన్నారు. అట్టివారిని మానవత్వంతో ఆదుకునేందుకు ప్రజలు విరివిగా విరాళాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో షేక్ మస్తాన్, ఇస్మాయిల్, సీహెచ్ వెంకటేశ్వర్లు, గౌస్ బాషా, రామయ్య, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

**కేరళ వరద బాధితులకు సీపీఎం విరాళాల సేకరణ**

దొనకొండ, ఆగస్టు 6: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులకు స్థానిక సీపీఎం నాయకుడు చిరుపల్లి అంజయ్య నేతృత్వంలో మంగళవారం దొనకొండలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు తాండవ రంగారావు మాట్లాడుతూ కేరళలో వరదలతో కొండ చరియలు విరిగిపడిన దుర్ఘటనలో వందలాది మంది ప్రజలు మృతిచెందారని విచారణ వ్యక్తం చేశారు.

వరదలలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు మానవతా దృక్పథంతో సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కర్నా హనుమయ్య, కుందుర్తి అనీల్, ఎం.అంజిబాబు, దమ్ము దాసు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి

కనిగిరి, ఆగస్టు 6: హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీవోకు వినతి పత్రం అందచేశారు. హాస్టళ్లలో అసౌకర్యాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని ఆర్డీవోకు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సురేష్, షకీలా, భాగ్య తదితరులు పాల్గొన్నారు.



తాళం వేసిఉన్న దొనకొండ-2 సచివాలయం

## మధ్యాహ్నంకే సచివాలయానికి తాళం

దొనకొండ, ఆగస్టు 6: ప్రజల సమస్యలు వారి గ్రామాల్లోనే పరిష్కరించేలా ఏర్పాటైన గ్రామ సచివాలయ వ్యవస్థ ఆచరణలో అభాసుపాలవుతుంది, అధికారుల పర్యవేక్షణాలోపంతో సిబ్బంది ఎప్పుడు వస్తున్నారో, ఎంతసేపు ఉంటున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మంగళవారం దొనకొండ-2 సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది మధ్యాహ్నం నుంచిసచివాలయంకు తాళం వేశారు. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు కొంతసేపు అక్కడ కూర్చుని వెనుతిరిగి వెళ్లారు. కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్, వీఆర్వో, ఏఎన్ఎం, సర్వేయర్, ఎనర్జీ అసిస్టెంట్, మహిళా పోలీసు తదితర శాఖలకు చెందిన సిబ్బంది విధులు నిర్వహించాలి. అయితే, మధ్యాహ్నంకే సచివాలయానికి తాళం వేశారు. అధికారుల పర్యవేక్షణలోపంతో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దొనకొండ-2 సచివాలయం తాళం వేసిన విషయాన్ని ఎంపీడీవో వసంతరావునాయక్‌ను వివరణ కోరగా సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీచేస్తామన్నారు. ఇందుకుసంబంధించి వివరణ కోరుతూ తగిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

## రహదారిని కమ్మేసిన చిల్లచెట్ల తొలగింపు

ముండ్లమూరు, ఆగస్టు 6: మండలంలోని వేంపాడు నుంచి పెదరావిపాడు వరకు రహదారిని ఇరువైపులా కమ్మేసిన చిల్ల చెట్లను నాయుడుపాలెం సర్పంచ్ గొర్రె శ్రీదేవి రాముడు మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఇటీవల చిల్లచెట్లు దట్టంగా పెరిగి వాహనచోదకులకు ఇబ్బందిగా మారింది. ప్రమాదాలు జరగకుండా సర్పంచ్ శ్రీదేవి రాముడు చిల్లచెట్ల తొలగింపునకు శ్రీకారం చుట్టారు.

## సజావుగా విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించాలి

ముండ్లమూరు, ఆగస్టు 6: పాఠశాలల్లో ఈనెల 8న జరగనున్న విద్యా కమిటీ ఎన్నికలు ఎలాంటి వివాదాలు లేకుండా సజావుగా జరిగేందుకు ప్రధానోపాధ్యాయులు సహకరించాలని ఎస్ఐ వి.నాగమల్లేశ్వరరావు కోరారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న విద్యా కమిటీ ఎన్నికల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ప్రధానోపాధ్యాయులు వివాదాలకు పోకుండా సహకరించాలన్నారు. ఎంఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో 68 పాఠశాలలు ఉన్నాయన్నారు. ఇందులో 52 ప్రాథమిక పాఠశాలలు, ఎనిమిది ఉన్నత పాఠశాలలు, మరో ఎనిమిది యూపీ పాఠశాలలకు ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## గద్దర్‌కు నివాళి

తాళ్లూరు, ఆగస్టు 6: గద్దర్‌లాంటి మహనీయున్ని ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య అన్నారు. మంగళవారం తాళ్లూరులోని అంబేద్కర్ నగర్‌లో జరిగిన ప్రజాయుద్ధనౌక గద్దర్ స్మారక సభలో ఆయన మాట్లాడారు. ప్రజల సామాజిక బాధ్యతలను జానపద బాణీలో గానం చేసి ప్రజల హృదయాల్లో స్థిర స్థాయిగా నిలిచారన్నారు. ముందుగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులఅర్పించారు. కార్యక్రమంలో బంటుపల్లి ఇస్మాయిల్, పులి కోటేసు, అరిక జైపాల్, సీఆర్‌పీఎఫ్ సీఐ జగన్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు భోజనం

కురిచేడు, ఆగస్టు 6: కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంగళవారం గర్భిణులు, బాలింతలు పరీక్షలకు వచ్చారు. ఈసందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు ఆధ్వర్యంలో 400 మందికి భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించిన దేవతి నాగేంద్రబాబుకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమణారావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్, ఎంపీడీవో సీతారామయ్య, జేబీ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు(విద్య), ఆగస్టు 6 : జిల్లాలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి జాతీయ ఉపకార వేతన పరీక్ష (నేషనల్ మిన్స్‌కమ్‌మెరిట్ స్కాలర్‌షిప్-ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, పాఠశాలలు, వసతి సౌకర్యంలేని ఆదర్శ పాఠశాలల్లో చదువుతున్నవారు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలు లోపు ఉన్నవారు మాత్రమే ఉండాలి. ఈ ఏడాది డిసెంబరు 8న పరీక్ష జరుగుతుంది. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించాలి. సెప్టెంబరు6 నుంచి దరఖాస్తుకు చివరి తేదీ. పరీక్ష రుసుం ఈనెల 10వతేదీలోపు చెల్లించాలని డీఈవో తెలిపారు

## జిల్లాలో పశుగణనను సమగ్రంగా నిర్వహించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 6: జిల్లాలో ఈనెల 1 నుంచి ప్రారంభమైన పశుగణనను సమగ్రంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం పశుగణన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. పశుసంవర్ధకశాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్ళి పశువులు, కోళ్ళు, గొర్రెలు, మేకలు, పందులు, పెరటి కోళ్ళు పాలిచ్చే పశువులు, కుక్కలు, పెంపుడు కుక్కలు తదితర 15 అంశాలపై సమగ్ర వివరాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో జేడీపీ డాక్టర్ బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.



**ఒంగోలు నగరపాలక సంస్థ, ఒంగోలు**

**'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ నెం.**

64/2024-25 నుండి 90/2024-25 వరకు, తేది.06-08-2024

| | | | |
|---|---|---|---|
| 1. | మొత్తం పనుల సంఖ్య | : | 27 |
| 2. | మొత్తం పనుల అంచనా విలువ | : | రూ. 163.00 లక్షలు |
| 3. | 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేసులో టెండర్ షెడ్యూల్ లభ్యమగు ప్రారంభ తేది | : | 07-08-2024 సాయంత్రం 4.00 గం॥ నుండి |
| 4. | 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేసులో టెండర్ షెడ్యూల్ లభ్యమగు చివరి తేది | : | 14-08-2024 సాయంత్రం 4.00 గం॥ ల వరకు |
| 5. | 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేసులో ఆన్‌లైన్ ద్వారా బిడ్స్ సమర్పించుటకు ఆఖరు తేది మరియు సమయము | : | 14-08-2024 సాయంత్రం 4.15 గం॥ల వరకు |
| 6. | ప్రైస్ బిడ్ తెరుచుటకు నిర్ణయించిన తేది మరియు సమయము | : | 14-08-2024 సాయంత్రం 4.30 గం॥లకు |

ఇతర వివరములకు సంప్రదించవలసిన చిరునామా
www.apeprocurement.gov.in

వివరములకు : 98499 08065 — సం/- కమీషనర్, ఒంగోలు నగరపాలక సంస్థ



సాగర్ వద్ద యువత సెల్ఫీ

# మగ్గం మురిసేనా?

- పూర్వ వైభవంపై నేతన్నల ఆశలు
- చేనేత దినోత్సవం సందర్భంగా నేడు చీరాలకు చంద్రబాబు
- నేతన్నల కుటుంబాలతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ముఖాముఖి
- కులవృత్తిని వీడలేక.. ప్రోత్సాహం దొరక్క ఇక్కట్లలో నేతన్నలు

**ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన చేనేత మగ్గం ఆధునికీకరణ, యాంత్రీకరణలతో కుదేలైంది. తన మేధస్సుతో ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన నేతన్న నేడు బతుకు భారంగా మారింది. దారం పోగులతో వస్త్రాలను అత్యద్భుతంగా తీర్చిదిద్దే మగ్గం సంక్షోభంలో చిక్కుకుపోయింది. స్వయం పోషకంగా తరతరాలుగా జీవనం సాగిస్తున్న చేనేత రంగం చేయూత కరువై అల్లాడిపోతోంది. గతం ప్రభుత్వ విధానాలతో కునారిల్లిపోయిన దశలో కూటమి ప్రభుత్వంపై నేతన్నలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నేతన్న ఇంతటి సంక్షోభంలో ఉన్న సమయాన బుధవారం చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు చీరాలకు రానుండడంతో మగ్గానికి పూర్వ వైభవం తెచ్చే విధంగా వరాల జల్లు కురిపిస్తారని కార్మికులు ఆశతో ఉన్నారు. నేతన్నల కుటుంబాల స్థితిగతులపై సీఎం చంద్రబాబు స్వయంగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి తెలుసుకోనున్నారు. తర్వాత వారితో సమావేశమై ఇక్కట్లను విని చేనేత రంగానికి పూర్వ వైభవం తెచ్చే పాలసీని ప్రకటించనున్నారని సమాచారం.**

గుంటూరు, బాపట్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధిరంగమైన చేనేత సంక్షోభంలో చిక్కి విలవిలలాడుతోంది. చేయూత కరువై అల్లాడిపోతోంది. ఎన్ని అవాంతరాలు ఎదురైనా నిపుణులైన చేనేత కార్మికులు కష్టనష్టాలకోర్చి చేనేత రంగాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు. అయితే పవర్ లూమ్ ధాటికి నేతన్నల చే'మగ్గం' విరిగిపోతోంది. రెక్కాడితేగాని డొక్కాడని నేతన్నల దుస్థితిని గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఫలితంగా గడిచిన ఐదేళ్లలో చేనేత రంగం మునుపెన్నడూ లేనంతటి సంక్షోభంలో కూరుకుపోయింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 50 వేల కుంటుంబాల పరిస్థితి ప్రమాదంలో పడింది. బాపట్ల జిల్లాలో వ్యవసాయం, ఆక్వా రంగాల తర్వాత ఎక్కువమంది ఆధారపడిన రంగం చేనేత పరిశ్రమ. జిల్లా పరిధిలో ఐలవరం, రేపల్లె, భట్టిప్రోలు, వేటపాలెంతో పాటు చీరాలలో అత్యధిక సంఖ్యలో చేనేత కార్మికులు గతంలో ఉండేవారు. ఐదేళ్ల క్రితం వరకు జిల్లాలో దాదాపు 17,000 వరకు మగ్గాలుండేవి. ప్రస్తుతం ఆ సంఖ్య 8,000కు పడిపోగా ఒక్క చీరాలలో 6,000 వరకు ఉన్నట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. ఈ రంగం నుంచి వైదొలగిన ఎంతోమంది కుటుంబ పోషణకై బేల్దారి కార్మికులగా, ఆటో డ్రైవర్లుగా మారిపోయారు. మరి కొందరు కులవృత్తిపై మమకారం వదులుకోలేక, ప్రభుత్వం నుంచి సహకారం అందక అంపశయ్యమీద నెట్టుకొస్తుంటే మరెంతో మంది అప్పుల బాధతో తనువు చాలించారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం రావడంతో తమకు ఊపిరి తీసుకునే వెసులుబాటు వస్తుందన్న ఆశతో నేతన్నలు ఎదురు చూస్తున్నారు. 2014--19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో చేనేత రంగానికి ఎన్నో రాయితీలను అందించింది. ముడిసరుకుపై రాయితీ, మార్కెటింగ్ ఇన్సెంటివ్ తదితరాలతో అప్పట్లో నేతన్నలకు, సంఘాలకు ప్రభుత్వం ఊతమిచ్చింది. దీని వల్ల ఒక్కో చేనేత సంఘానికి దాదాపు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు లబ్ధి చేకూరేది. పట్టు చీరలు నేసే నేతన్నలకు ముడి సరుకుపై కిలోకు రూ.200 వరకు రాయితీని అందించేది. దీనివల్ల ఏడాదికి ఒక్కో కార్మికుడికి సగటున దాదాపు 30,000 వరకు ప్రయోజనం దక్కేది. చేనేత కార్మికుడు తన ఆదాయంలో 8 శాతం పొదుపు చేసుకుంటే అంతేమొత్తాన్ని ప్రభుత్వం చెల్లించి వారికి అండగా నిలిచింది. అయితే వైసీపీ అధికారంలోకి రాగానే అవన్నీ నిలిపేసి నేతన్న నేస్తంతో చేనేత రంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బ తీసింది. గడచిన ఐదేళ్లలో ముడిసరుకు ధర రెట్టింపైనా జగన్ ప్రభుత్వం దృష్టి సారించిన దాఖలాలు లేవు. నేతన్న నేస్తం పేరుతో నూటికి పది మందికి తాయిలాలు పంచుతూ అదే నేతన్నల సమస్యలన్నింటికీ పరిష్కారమన్న చందంగా వ్యవహరించింది. చితికి పోతున్న చేనేతను సంరక్షించేందుకు టీడీపీ యువనేత లోకేశ్ తన నియోజకవర్గమైన మంగళగిరిలో కొంత ప్రయత్నం చేశారు. అధికారం లేకపోయినా సొంత నిధులతో నేతన్నలకు అధునాతన యంత్ర సామాగ్రిని అందించ డంతో పాటు, మూలాల్లోకి వెళ్లి చేనేత సంరక్షణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మంగళగిరిని నమూనాగా తీసుకుని చేనేతకారులతో చర్చించి నిర్దిష్టమైన కార్యక్రమం రూపొందించే ప్రయత్నం చేశారు. కార్పొరేట్ మార్కెటింగ్ సంస్థల ద్వారా స్పాన్సర్‌షిప్ తీసుకు వచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. అది మంచి ఫలితాలను ఇచ్చింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపైన, ప్రత్యేకించి ప్రస్తుతం మంత్రిగా ఉన్న లోకేశ్‌పైన నేతన్నలు ఆశలు పెంచుకున్నారు. అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వపరంగా సమగ్ర కార్యక్రమాన్ని అమలు చేసి చేనేత సంరక్షణ చేపట్టాలని నేతన్నలు వేడుకుంటున్నారు.

### వైసీపీ వంచన

అసలే అంతంత మాత్రంగా ఉన్న చేనేత రంగాన్ని ఐదేళ్ల వైసీపీ పాలనతో మరింతగా సంక్షోభంలో కూరుకుపోయింది. మగ్గం ఉన్న చేనేత కుటుంబాలకు అన్నింటికీ పోత్సాహకం అందిస్తామని చెప్పిన జగన్ ప్రభుత్వం ఆ తర్వాత మాటమార్చింది సొంత మగ్గం ఉంటేనే అనే షరతు చేర్చి నేతన్నలను నిలువునా వంచించింది. కూలి మగ్గాలపై ఆధారపడి పొట్టపోసుకుంటున్న వేల మంది నేతన్నలను వైసీపీ దగా చేసింది. ముడిసరుకుకు ఇచ్చే రాయితీని ఎత్తివేశారు. సహకార సొసైటీల ఉద్దేశాన్ని నీరుగార్చి భ్రష్టుపట్టించారు. వైసీపీ ప్రభుత్వం చేనేత రంగంపై అవలంబించిన వైఖరి వల్ల ఎంతో మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారు. కులవృత్తిని వదులుకోలేక కుటుంబపోషణ భారమై పంటి బిగువున బతుకీడ్చిస్తున్న వారు ఎందరో ఉన్నారు.



హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు కొండయ్య, నరేంద్రవర్మ, కలెక్టర్, ఎస్పీ

చెన్నై, ముంబై, ఢిల్లీల్లోని అతిపెద్ద చేనేత మార్కెట్లన్నీ తమకు చేనేత వస్త్రాలు వద్దని బోర్డులు పెట్టాయి. ఫలితంగా రెండేళ్లుగా చేనేత ఉత్పత్తులన్నీ ఉత్పత్తిదారుల దగ్గరే ఆగిపోయి, గుట్టలుగా పేరుకుపోయాయి. మాస్టర్ వీవర్లు ఉత్పత్తిని నిలిపివేశారు. కార్మికులకు పని కల్పించడం ఆపేశారు. దీంతో నేతన్నల ఆకలి పస్తులతో, అప్పుల తిప్పలతో అల్లాడిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో వారంతా వృత్తిని వదిలి ఇతర పనులకు వెళ్లిపోయారు.

### పవర్‌లూమ్‌తో కుదేలు

1985లో నూతన జౌళి విధానంతో మొదలైన చేనేత పతనం ఇప్పుడు అత్యంత ప్రమాదకర స్థాయికి చేరింది. పవర్ మగ్గాలు, కాంపోజిట్ మిల్లుల ధాటికి తట్టుకోలేక చిగురుటాకులా వణికిపోతోంది. చేనేత సంరక్షణ కోసమంటూ వస్త్రాల ఉత్పత్తిని రిజర్వు చేసినా వాటిని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా మార్కెట్లో చేనేత ఉత్పత్తుల స్థానం మొత్తాన్ని పవర్‌లూమ్ ఆక్రమించింది. దీంతో చేనేతకు ఉపాధి అనేదే లేకుండా పోయింది. వైసీపీ హయాంలో చేనేత పేరుతో మార్కెట్లోకి వచ్చిన పవర్‌లూమ్ ఉత్పత్తులను కొన్న వినియోగదారులు ఘోరంగా మోసపోయారు. మోసపోయిన వినియోగదారులు చేనేతేదో, నకిలీ ఏదో గుర్తించలేక చేనేత వస్త్రాలను కొనడమే మానేసే పరిస్థితికి వచ్చారు. ఫలితంగా హైదరాబాదు, బెంగళూరు, విజయవాడ,

### నకిలీ ఉత్పత్తులకు ఆప్కో ఊతం

చేనేత ఉత్పత్తులకు రక్షణ, ప్రోత్సాహం కల్పించాల్సిన ప్రభుత్వాలే ఆ బాధ్యతను పూర్తిగా విస్మరించాయి. చేనేత పేరుతో చలామణి అవుతున్న నకిలీ వస్త్రాల ఉత్పత్తికి ఊతమిచ్చేలా ఆప్కో పవర్‌లూమ్ వస్త్రాలను చేనేత వస్త్రాల పేరుతో విక్రయిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దాంతో పవర్ లూమ్ ఉత్పత్తిదారులు చెలరేగిపోయేవారు. వైసీపీ ప్రభుత్వానికి ముందున్న ప్రభుత్వాలు పవర్‌లూమ్ విషయంలో కొంతమేర అప్రమత్తంగా ఉన్నాయి. దీంతో బెంగళూరు, చెన్నై, శేలంలలో మగ్గాలు పెట్టి అక్కడి నుంచి తెచ్చి ఇక్కడ విక్రయించేవారు. వైసీపీ ప్రభుత్వం పవర్‌లూమ్ విషయాన్ని పూర్తిగా వదిలేయడంతో నేరుగా రాష్ట్రంలోనే పవర్‌మగ్గాలు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం, మంగళగిరి సహా అనేక ప్రాంతాల్లో పవర్ మగ్గాలు పెట్టి, అక్కడే భారీగా ఉత్పత్తి చేసి చేనేత వస్త్రాలుగా మార్కెట్లోకి వదిలేస్తున్నారు. ఆప్కోలో నకిలీ వస్త్రాల విక్రయంతో పాటు, పవర్ మగ్గాలను నియంత్రించాలన్న డిమాండ్ కూటమి ప్రభుత్వం ముందుంది.

### చేనేతకు అన్ని విధాల పెద్దపీట

**చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత**

చీరాల: వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి వస్తుంటే చెట్లు కొట్టేవారని, పరదాలు కట్టేవారని, ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్నారని చెట్లు కొట్టడంలేదు.. పరదాలు కట్టడం లేదని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వేటపాలెం మండలం కొణిజేటి చేనేత పురి, చీరాల మండలం జాండ్రపేట ప్రాంతాల్లో పర్యటించి నేతన్నల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ చేనేత రంగానికి పూర్వవైభవం సీఎం చంద్రబాబు, ఎన్డీఏ ప్రభుత్వంతో సాధ్యమన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేనేత రంగం నిర్వీర్యమైందన్నారు. సంక్షేమ పథకాలతో నేతన్నల అభివృద్ధికి, జీవన ప్రమాణాల పెంపునకు కూటమి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టి పెద్దపీట వేస్తుందన్నారు.



చేనేత మహిళలతో మాట్లాడుతున్న మంత్రి సవిత

### ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి సవిత

చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో సీఎం చంద్రబాబు పర్యటించనున్న నేపథ్యంలో ఆయా ఏర్పాట్లను మంత్రి ఎస్. సవిత మంగళవారం పరిశీలించారు. చీరాల పరిధిలోని జాండ్రపేటలో సీఎం సందర్శించే నేతన్నల గృహాలను పరిశీలించారు. అనంతరం వేటపాలెం మండల పరిధిలోని సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. ఐటీసీ శాంగ్రిజ్ అతిథి గృహంలో ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, కొండయ్య, ఎస్పీ తుషార్ డూడీ, మాజీ ఎమ్మెల్యేలు బాచిన చెంచుగరటయ్య, చీరాల గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరి సునీత, హ్యాండ్లూమ్ కమిషనర్ రేఖారాణి తదితరులతో కలసి చర్చించారు. సీఎం పర్యటన సందర్భంగా చెట్లను నరకడం, స్తంభాలను తొలగించడం వంటివి చేయవద్దని కలెక్టర్ వెంకటమురళి అధికారులను ఆదేశించారు.

### చంద్రబాబు పర్యటన ఇలా...

బుధవారం మధ్యాహ్నం 3:35కు వేటపాలెంలోని సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు సీఎం చంద్రబాబు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో జాండ్రపేటలోని బట్టవీరన్న అండ్ బీరకనాగయ్య హైస్కూల్‌కు 3:50కు వస్తారు. అక్కడ జరిగే చేనేత దినోత్సవంలో పాల్గొననున్నారు. తొలుత నేత కార్మికుల ఇళ్ళ సందర్శనతో పాటు అక్కడే ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లను చంద్రబాబు తిలకించనున్నారు. నేతన్నలతో ముఖాముఖిలో పాల్గొని అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడతారు. ఐదేళ్లలో వారు పడిన ఇబ్బందులు, ఆ పరిస్థితి నుంచి వారిని బయటపడేయడానికి ప్రభుత్వం ఏం చేస్తే బాగుంటుందనే అంశంపై నేతన్నల అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. సాయంత్రం 5:30కు జాండ్రపేటలోని హైస్కూల్ ప్రాంగణం నుంచి రోడ్డుమార్గంలో 5:35కు తిరిగి హెలిప్యాడ్ వద్దకు చేరుకుని తిరుగు పయనం కానున్నారు.

### చేనేతను కాపాడాలి



వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో చేనేత కార్మికులకు పనే లేకుండా పోయింది. ఆరు నెలలుగా పని లేక, పూట గడిచే పరిస్థితి లేక అనేక మంది అల్లాడిపోతున్నారు. కూలీలు కూడా సగానికి సగం తగ్గించారు. చేనేతను చంపేసిన పాపం ప్రభుత్వానిదే. ఇదే పరిస్థితి కొనసాగితే ఆకలి చావులు జరిగే ప్రమాదం ఉంది. కూటమి ప్రభుత్వం చేనేతను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి.

**- జీ. సుబ్బారావు, చేనేత మిత్రమండలి రాష్ట్ర నేత**

# సాగర్ నుంచి.. సాగరానికి..

- పరవళ్లు తొక్కుతూ కృష్ణమ్మ ప్రవాహం
- ఆల్మటి నుంచి నిండు కుండల్లా జలాశయాలు
- పులిచింతల నుంచి నేడు 3 లక్షల క్యూసెక్కుల విడుదల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కృష్ణమ్మ ఉప్పొంగుతోంది. కొద్ది రోజులుగా భారీగా వస్తున్న వరదతో కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ నిండాయి. వడివడిగా కృష్ణమ్మ సాగరం దిశగా పరుగులిడుతోంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు 22 క్రస్ట్ గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణమ్మ సాగరం వడికి చేరుకునేందుకు పోటెత్తుతోంది. ఆల్మట్టి నుంచి ప్రకాశం బ్యారేజ్ వరకు ఉన్న ప్రాజెక్టులన్నింటిని దాటుకుంటూ కృష్ణమ్మ సాగరం చెంతకు చేరేందుకు పరుగులు పెడుతోంది. రెండు రోజుల్లో ప్రకాశం బ్యారేజ్‌కు భారీగా వరద వచ్చి చేరనుంది. కృష్ణానది ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో నదిపై ఉన్న జలాశయాలన్నీ జలకళను సంతరించుకున్నాయి. శ్రీశైలం.. నాగార్జున సాగర్.. పులిచింతల.. ప్రకాశం బ్యారేజ్‌లలో నీటి నిల్వ సామర్థ్యం 589.67 టీఎంసీలకు మంగళవారం 529 టీఎంసీలకు చేరింది. జలాశయాల్లోకి నిలకడగా వరద వచ్చి చేరుతుండటంతో ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజ్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆల్మటి నుంచి పులిచింతల వరకు ఉన్న ప్రాజెక్టుల గేట్లు తెరిచి ఉంచారు. శ్రీశైలం ప్రాజెక్టుకు మంగళవారం కొంత మేర వరద ప్రవాహం తగ్గింది. శ్రీశైలం జలాశయానికి 3,70,589 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా పోతిరెడ్డిపాడుకు 4,02,578 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆల్మట్టి నుంచి 2,06,607, తుంగభద్ర నుంచి 55,586, నారాయణపూర్ నుంచి 2,08,540, జూరాల నుంచి 2,74,314 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

### సాగర్ 22 గేట్లు తెరిచారు..

నాగార్జున సాగర్ 22 క్రస్ట్ గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ క్రస్ట్ గేట్లను ఒక్కొక్కటి 10 అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. గేట్ల నుంచి 3,09,276 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 27,973 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి కాల్వకు 8,298, ఎడమ కాల్వకు 8,022 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. సాగర్ పూర్తి నీటి మట్టం 590 అడుగులకు 585.30 అడుగులకు చేరింది.

### పులిచింతలకు పోటెత్తుతోన్న వరద

సాగర్ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. భారీగా వరద వస్తుండటంతో జలకళను సంతరించుకుంది. మంగళవారం సాయంత్రం ప్రాజెక్టుకు 3,70,632 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. పులిచింతల మూడు గేట్లు 2.5 మీటర్ల ఎత్తి ప్రకాశం బ్యారేజ్‌కు 50,283 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 5,600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. బుధవారం ఉదయం పులిచింతల గేట్లు మొత్తం తెరిచి మూడు లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని ప్రకాశం బ్యారేజ్‌కు విడుదల చేసేందుకు ప్రాజెక్టు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ పూర్తి స్థాయి నీటి మట్టం 72.6 అడుగులు కాగా 54.05 అడుగులకు నీటి మట్టం చేరింది. నేడు బ్యారేజ్‌కు భారీగా వరద చేరనుంది.

**జలాశయాల్లో నీటి నిల్వల వివరాలు...**

| జలాశయం | పూర్తి స్థాయి నీటి నిల్వ టీఎంసీలలో | ప్రస్తుత నీటి నిల్వ టీఎంసీలలో | వస్తున్న వరద నీరు క్యూసెక్కుల్లో | విడుదల చేస్తున్న నీరు క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|
| ఆలమట్టి | 123.08 | 86.35 | 3,02,660 | 2,06,607 |
| నారాయణపూర్ | 33.58 | 27.64 | 2,08,540 | 2,08,540 |
| జూరాల | 9.66 | 4.95 | 4,014 | 27,579 |
| తుంగభద్ర | 105.78 | 102.35 | 84,696 | 55,586 |
| శ్రీశైలం | 215.81 | 204.35 | 3,70,589 | 4,02,578 |
| సాగర్ | 312.05 | 298.59 | 3,55,369 | 3,55,369 |
| పులిచింతల | 45.77 | 42.16 | 3,70,632 | 55,883 |
| ప్రకాశం బ్యారేజ్ | 3.07 | 2.28 | 6,632 | 11,157 |

### వరద ప్రమాద హెచ్చరిక

గుంటూరు(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ డ్యాం నుంచి భారీగా వరద నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో ప్రకాశం బ్యారేజ్ దిగువ ప్రాంతాలకు యంత్రాంగం ప్రమాద హెచ్చరికని జారీ చేసింది. మంగళవారం మధ్యాహ్నానికే సాగర్ నుంచి 3,37,249 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ నీరు బుధవారం ప్రకాశం బ్యారేజ్ వద్దకు చేరుకో వచ్చని, ఇంకా వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అచ్చంపేట, క్రోసూరు, అమరావతి, తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు తదితర మండలాల ప్రజలు నదీ తీర ప్రాంతం వద్దకు వెళ్లరాదన్నారు. పిల్లలు, పశువులను కూడా వరద నీటి వద్దకు తీసుకెళ్లొద్దని గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు.

# పల్నాడు జిల్లాలో వింత జ్వరాలు!

- రోగుల్లో పాదాలు, చేతుల వాపు
- జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు
- జ్వరం తగ్గినా వదలని కీళ్ల నొప్పులు
- చికున్ గన్యా కాదంటున్న డీఎంహెచ్‌వో
- ఆర్బో వైరస్ కావచ్చంటున్న వైద్యులు

గుంటూరు (మెడికల్) ఆగస్టు 6 : గుంటూరు జిల్లాలో వింత జ్వరాలు ప్రబలాయి. ఊళ్లకు ఊళ్లు ఈ వింత జ్వరాల బారినపడుతున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో మాచర్ల, పల్నాడు తదితర ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో ఈ జ్వరాలు విస్తృతంగా ప్రబలాయి. ఇవి వైరల్ ఫీవర్లు కావడంతో ఇంట్లో ఒకరు జ్వరం బారిన పడితే.. ఇంటిల్లిపాదీ వీటికి గురౌతున్నారు. బాధితుల్లో జ్వరం, కీళ్ల నొప్పులు, పాదాలు, చేతుల వాపు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. పాదాలు, చేతులు, చేతివేళ్ల వాపనకు గురై తీవ్రంగా వేధిస్తున్నాయి. చేతి వేళ్లను మడవ లేకపోతు న్నారు. పాదాల వాపుతో రోగులు సరిగా నడవ లేకపోతున్నారు. మూడు, నాలుగు రోజుల్లో జ్వరం తగ్గుతున్నా, కీళ్ల నొప్పులు మాత్రం పలువురిని వదలటం లేదు. మెజార్టీ రోగుల్లో 4-6 వారాల పాటు కీళ్ల నొప్పులు వేధిస్తున్నట్లు చెబుతున్నారు.



చేతుల వాపులు (నమూనా చిత్రం)

### చికున్ గన్యా జ్వరాలు కాదు...

జ్వర ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ఇవి చికున్ గన్యా జ్వరాలను తలపిస్తున్నా.. వైద్య పరీక్షల్లో మాత్రం ఇది నిర్ధారణ కావడం లేదు. ఆర్బో తరగతికి చెందిన వైరస్‌లే ఈ జ్వరాలకు కారణమని వైద్య వర్గాలు భావిస్తున్నాయి. జిల్లాలో ప్రబలిన వింత జ్వరాలపై గుంటూరు డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయ లక్ష్మిని వివరణ కోరగా, వీటిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రోగులు మూడు రోజుల్లోనే కోలుకుంటున్నట్లు తెలిపారు. సీరియస్ కాంప్లికేషన్స్ లేవన్నారు. రోగుల నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షిస్తే, అవి చిగున్ గున్యాగా నిర్ధారణ కావడం లేదని డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. వైరస్ నిర్ధారణ కోసం సీరం నమూనాలను పూణేలోని నేషనల్ వైరాలజీ ల్యాబ్‌కు పంపాలని భావిస్తున్నారు.

### ఆరు వారాల పాటు కీళ్ల నొప్పులు

ఇవి కొత్త జ్వరాలు కావడంతో పలువురు రోగులు ఆందోళనతో గుంటూరు నగరంలోని పలు ప్రైవేటు వైద్యశాలల్లో చేరి చికిత్సలు పొందుతున్నారు. 'ఈ వైరల్ ఫీవర్లు ప్రమాదకరం కాదు. సింప్టమ్యాటిక్ ట్రీట్‌మెంట్‌తోనే తగ్గుతున్నాయని' సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ వైవీఎస్ ప్రభాకర్ తెలిపారు. 'కొంత మంది రోగుల్లో జ్వరం తగ్గాక రెండు వారాలకు పైగా కీళ్ల నొప్పులతో బాధపడుతుంటే మాత్రం తక్కువ మోతాదులో స్టెరాయిడ్స్ ఇస్తే వారికి ఉపశమనం లభిస్తున్నట్లు' పల్మనాలజిస్ట్ డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు తెలిపారు. ఆరు వారాల్లో కీళ్ల నొప్పులు పూర్తిగా తగ్గిపోతున్నట్లు ఆయన వెల్లడించారు.



పందిళ్లపల్లి సమీపంలో ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గోతులు

# రూటు మార్చిన ఇసుక భోక్తలు

- సీఎం వచ్చి వెళ్లే వరకు ఆగుదామని నిర్ణయం
- వ్యూహాత్మక నిర్ణయంతో తాత్కాలికంగా నిలిపివేత

చీరాల, ఆగస్టు 6: అక్రమ తవ్వకాలు, రవాణాతో చెలరేగిపోతున్న ఇసుక అక్రమార్కులు రూటుమార్చారు. చీరాలలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనతో జిల్లా స్థాయి అధికారులు, మంత్రులు పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి నుంచి అక్రమార్కులు ఇసుక తవ్వకాలు, రవాణాకు ఫుల్‌స్టాప్ పెట్టారు. చిన్నా, పెద్ద క్వారీలన్నింటినీ ఆపారు. అయితే ఈ నిబద్ధత సీఎం పర్యటన ముగిసే వరకేనని సమాచారం. తమ మధ్య ఉన్న విభేదాలను వీడి చంద్రబాబు వచ్చి వెళ్లే వరకు ఆపుదామని ఒక మాటపై వచ్చినట్లు తెలిసింది. సిలికా ముసుగులో సాధారణ ఇసుకను రవాణా చేసేవారు కూడా ఆ కూటమితో జతకట్టారని వినికిడి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, ఇసుక తవ్వకాలు నిలుపుదల చేయాలని కొందరు కోర్టును ఆశ్రయించడంతో సీనరేజీ పాటలు ఆగాయి. అయితే చీరాల నియోజకవర్గంలో అక్రమ ఇసుక తవ్వకాలు మాత్రం ఆగలేదు. ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి పాలక, ప్రతిపక్షాలకు చెందిన పలువురి హస్తం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉండడం విశేషం.

### కేసులు కూడా మేమే ఇస్తాం

ఇసుక తవ్వకాలు, రవాణాలను అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ ఉండేందుకు అక్రమార్కులు ఓ ప్రణాళిక రూపొందించారు. నెలకు కొన్ని ట్రాక్టర్లను పట్టుకుని ఫైన్ వేసినట్లు ఉండేలా ఎవరెవరు ఎప్పుడెప్పుడు కేసులు రాపించుకోవాలనే విషయంలో కూడా కొందరి మధ్య అవగాహన ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

## మనస్తాపంతో భర్త ఆత్మహత్య



పరమేశ్వర్ (ఫైల్)

చీరాలటౌన్, ఆగస్టు 6 : ప్రేమించి పెళ్లాడాడు. అన్యోన్య దాంపత్యంలో బాబుకు జన్మనిచ్చారు. అనుకోని విభేదాలతో భర్త బలవన్మరణం చెందిన ఘటన సోమవారం రాత్రి పట్టణ పరిధిలోని తెల్లగాంధీ బొమ్మ సమీపంలో జరిగింది. అందిన వివరాల ప్రకారం.. కనక పరమేశ్వర్(38), కీర్తి పదేళ్ల కిందట ప్రేమించి, పెద్దలను ఎదురించి పెళ్లి చేసుకున్నారు. వీరికి బాబు పుట్టాడు. కారు డ్రైవర్‌గా పనిచేస్తూ పరమేశ్వర్ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మద్యానికి బానిసై అలాగే అనారోగ్యానికి గురయ్యారు. ఈ క్రమంలో అప్పులు కూడా చేశారు. దీంతో భార్యతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. గతంలో ఆమె స్థానిక రోశయ్య కాలనీలోని పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే పెద్దల జోక్యంతో తిరిగి కాపురానికి వచ్చింది. కొద్దికాలం పరిస్థితులు చక్కబడ్డాయి. కానీ మళ్లీ కొద్ది రోజులుగా విభేదాలు పెరిగాయి. సోమవారం మధ్యాహ్నం భార్య గొడవపడి తల్లితో విషయాన్ని చెప్పేందుకు వెళ్లింది. మనస్తాపం చెందిన పరమేశ్వర్ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. రాత్రి ఇంటికి వచ్చి భర్తను విగతజీవిగా చూసిన భార్య లబోదిబోమంది. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలి



సమస్యలపై మాట్లాడుతున్న సర్పంచ్ ఆత్మారావు

చినగంజాం, ఆగస్టు 8 : గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెళ్లి వాటిని వెంటనే పరిష్కరించుకోవాలని ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాల్‌లో సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలెం గ్రామంలోని చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో వసతులు లేవని, క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు లేని స్కూల్‌కు అనుమతులు ఎలా ఇచ్చారని కొత్తపాలెం గ్రామ సర్పంచ్ ఆసోది బ్రహ్మారెడ్డి సభలో ఎంఈవో-2 కోటేశ్వరరావుని ప్రశ్నించారు. నూతనంగా ఏర్పాటు చేసే పాఠశాలలకు అనుమతులు ఎంఈవో-1 ద్వారా ఇస్తారన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని మసీదుపేటలో వేలాడుతున్న విద్యుత్ లైన్లను సరిచేయాలని, పగటిపూట వీధిలైట్లు వెలుగుతున్నాయని, స్తంభాలను ఏర్పాటు చేయాలని సర్పంచ్ ఆత్మారావు విద్యుత్ శాఖ జేఈ భీమానాయక్ దృష్టికి తెచ్చారు. మూడో లైన్ కోసం గ్రామ పంచాయతీ ద్వారా 4.21 కిలోమీటర్ల మేర విద్యుత్ లైను వేసేందుకు రూ.3,79,000లను విద్యుత్‌శాఖకు చెల్లించామని, బాపయ్యనగర్, తూర్పు పల్లెపాలెం గ్రామాల్లో కొంత మేర పని జరిగిందని, పెద్దపల్లెపాలెం గ్రామంలో వీధి లైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ సభ్యులు పీతా భార్గవి జేఈ దృష్టికి తెచ్చారు. నూతన కేబుల్ లేక విద్యుత్ పనులు ఆగిపోయాని, స్తంభాలకు అంచాలు వేశామని జేఈ తెలిపారు. గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి అవసరాలు ఉంటే మండల పరిషత్ నుంచి నిధులు మంజూరు చేస్తామని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్. వేణుగోపాలకృష్ణమూర్తి, మండల ఉపాధ్యక్షురాలు-2 టి.ప్రసన్నలక్ష్మీ, ఎంపీటీసీలు ఆమంచి వెంకటసుబ్బారావు, కోడూరి గోవిందు, మరపాల రాంబాబురెడ్డి, మండల కోఆప్షన్‌మెంబరు షేక్ నబీషా, పలు శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యర్శులు పాల్గొన్నారు.

## 24 నుంచి శతావధానం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సాహితీ సంస్థల ప్రతినిధులు

అద్దంకి, ఆగస్టు 6 : సాహితీ మిత్ర మండలి, పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నారాయణం బాలసుబ్రహ్మణ్యం 4వ శతావధానం ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు అద్దంకి లోని బంగ్లారోడ్డులో చిన్ని శాంతయ్య, పచ్చమ్మ సేవాసదన్‌లో జరుగుతుందని ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. శతావధానం కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలు సాహితీ సంస్థల ప్రతినిధులు వారణాసి రఘురామశర్మ, డాక్టర్ యు.దేవపాలన, గాడేపల్లి దివాకర్‌దత్, చప్పిడి వీరయ్య, లక్కరాజు శ్రీనివాసరావు, డాక్టర్ ఫణీంద్రబాబు, చిన్ని మురళీకృష్ణ, చుండూరి మురళీసుధాకర్,నందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల అరెస్ట్

**రూ.4లక్షల సొత్తు స్వాధీనం**

**ఐదుగురిలో ముగ్గురు మైనర్‌లు, మరో ఇద్దరు యువకులు**

**పగలు సుబాబుల్ కర్ర కొట్టేపని.. రాత్రిపూట ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీ**



పోలీసులు స్వాధీనం చేసుకున్న రాగి, అల్యూమినియం వైరు, నిందితులు

అద్దంకి, ఆగస్టు 6 : పగలు సుబాబుల్ కర్ర కొట్టే పనులు, చేపలు వేటకు వెళ్లడం.. రాత్రి అయితే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు పగులగొట్టి రాగి, అల్యూమినియం వైరు చోరీలకు పాల్పడే ముఠాను అద్దంకి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఆ వివరాలను మంగళవారం సీఐ కృష్ణయ్య వివరించారు. పోలీసుల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని శ్రీరామ్‌నగర్ ఎస్టీ కాలనీకి చెందిన యువకులు పొట్లూరి చెంచురామయ్య, యాటగిరి రామయ్యతో పాటు మరో ముగ్గురు మైనర్లు పగలు సమయంలో సుబాబుల్ తోటలను కొట్టేందుకు వెళ్లి ఆయా ప్రాంతాలలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను పరిశీలించి, రాత్రి వేళలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి ట్రాన్స్‌ఫార్మర్‌లు పగులగొట్టి కాపర్, అల్యూమినియం వైర్లను చోరీ చేసి అమ్మకాలు చేస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలోని 5 మండలాలతో పాటు మార్టూరు, చినగంజాం, వేటపాలెం మండలాలల పరిధిలో 39 కేసులకు సంబంధించి 66 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లలో రాగి, అల్యూమినియం వైర్లు చోరీ చేశారు. సుమారు 6,16,750 రూపాయలు విలువైన సొత్తు అపహరణకు గురి కాగా, మంగళవారం నిందితుల వద్ద నుంచి 4.05లక్షల రూపాయల విలువైన రాగి, అల్యూమినియం వైరును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కృష్ణయ్య వివరించారు. ఇద్దరు యువకులను అరెస్ట్ చేశామని, మరో ముగ్గురు మైనర్లు ఉన్నట్లు తెలిపారు. చోరీ కేసు ఛేదించిన ఎస్సై నాగరాజు, సిబ్బంది అంకమ్మరావు, సాయి కృష్ణారెడ్డి, గోపి, బ్రహ్మయ్యను సీఐ అభినందించారు. తమ పిల్లలకు దొంగతనాలు చేయడం ఎప్పుడూ లేదని, అన్యాయంగా అరెస్టు చేశారంటూవారి తల్లిదండ్రులతోపాటు కాలనీవాసులు, మహిళలు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి నిరసన తెలిపారు.

## చీరాలలో డిగ్రీ విద్యార్థి దారుణ హత్య

**కారులో వచ్చి దాడికి పాల్పడిన దుండగులు**

చీరాలటౌన్, ఆగస్టు 6 : బీటెక్ విద్యార్థినిని గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి దారుణంగా హత మార్చారు. ఈ ఘటన మంగళవారం రాత్రి చీరాల పరిధిలోని ఆదినారాయణపురం ప్రధాన రహదారిలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం పంచాయతీ యూసుఫ్‌నగర్‌కు చెందిన సయ్యద్ అమీన్ ఆరీఫ్(18) పట్టణంలోని ప్రైవేటు కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇతను శాంతినగర్‌కు చెందిన మిత్రుడు కొండూరి మనోజ్‌తో కలిసి చీరాల నుంచి ఇంటికి వెళుతుండగా సుమారు ఏడుగురు గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి కత్తులతో దారుణంగా హత మార్చారు. అలాగే మనోజ్‌పై స్వల్పంగా దాడి చేసి వెళ్లిపోయారు. దీంతో రోడ్డంతా రక్తం ముద్దయింది. స్థానికులు ప్రైవేటు వాహనం ద్వారా చీరాలకు తరలించగా పరీక్షలు చేసిన వైద్యుల అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. విషయం తెలిసి హాస్పిటల్ వద్దకు వచ్చిన అమీన్ తండ్రి కుప్పకూలారు. సీఐ సోమశేఖర్ హాస్పిటల్ వద్దకు చేరుకుని విషయంపై ఆరా తీశారు. కేసు నమోదు చేశారు.

# అటు నీరు.. ఇటు నిరాశ...!

**కృష్ణమ్మ పరవళ్లు.. జిల్లాకు మాత్రం కన్నీళ్లు**

**వైసీపీ ప్రభుత్వంలో వెలిగొండ, గుండ్లకమ్మపై నిర్లక్ష్యం**

**సాగర్ కాలువల మరమ్మతులు పట్టించుకోని వైనం**

**శ్రీశైలం, సాగర్ పొంగిపొర్లుతున్నా నీరు తీసుకోలేని దుస్థితి**

**జిల్లాకు శాపమైన జగన్ తీరు**

**కూటమి పాలకులపైనే ప్రజల ఆశలు**

**రూ.600 కోట్లు ఇస్తే వెలిగొండ తొలిదశకు నీరు**

గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం జిల్లావాసులకు శాపంగా మారింది. నిండా నీరున్నా తెచ్చుకోలేని పరిస్థితి నెలకొంది. గడిచిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో అంతా ఆర్బాటమే తప్పా ప్రజలకు నీరివ్వాలనే చిత్తశుద్ధి కరువైంది. ఇప్పుడా దుస్థితి వెంటాడుతోంది. వెలిగొండ, గుండ్లకమ్మ ప్రాజెక్టులు జిల్లాకు అత్యంత కీలకమైనవి. కాగా ఆ రెండింటి విషయంలో జగన్ అండ్ కో వ్యవహరించిన తీరు అత్యంత దారుణంగా ఉంది. గుండ్లకమ్మకు గేట్లు బిగించలేకపోయారు. వెలిగొండ ప్రాజెక్టులో కీలకమైన రెండు సొరంగాల తవ్వకాల పనులు పూర్తయ్యి కృష్ణానది నుంచి నీరు తీసుకునే వీలున్నా నిర్వాసితులకు పునరావాస చర్యలు చేపట్టే విషయంలో చేతులెత్తేశారు. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టుకు వరద పోటెత్తుతున్న చుక్కనీరు వెలిగొండకు తీసుకోలేని దుస్థితి నెలకొంది.



వెలిగొండ ప్రాజెక్ట్ టన్నెల్

ఒంగోలు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : రెండేళ్ల తర్వాత కృష్ణమ్మకు భారీ వరద నీరు వస్తూ పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతాల్లోని కర్ణాటక, తెలంగాణ ప్రాజెక్టులే కాక రాష్ట్రంలోని కృష్ణానదిపై ఉన్న భారీ ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్ డ్యామ్‌లు పొంగిపొర్లుతున్నాయి. లక్షల క్యూసెక్కుల నీరు నదిని దాటి సముద్రం వైపు వెళ్తున్నాయి. ఆ వరదను మరల్చుకుని రిజర్వాయర్లలో నింపుకునే అవకాశం ఉన్నా జిల్లాప్రజలకు కన్నీళ్లే మిగులాయి. వర్షాలు లేక పంటలు సాగుకాక ఆందోళన చెందుతున్న రైతులకు కనీసం కృష్ణమ్మ పరవళ్లను జిల్లాకు తెచ్చుకుంటే కాస్తంత ఉపశమనం కలిగేది. గత ప్రభుత్వ అలవిమాలిన నిర్లక్ష్యం శాపంగా మారింది. దాదాపు పాతికేళ్లుగా సాగుతున్న వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో కీలకమైన పనులు కొలిక్కి వచ్చాయి. తాజా అంచనాల ప్రకారం ప్రాజెక్టు వ్యయం రూ.8,400 కోట్లు కాగా సుమారు రూ.5,600కోట్లు ఖర్చుచేశారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చేనాటికి రూ.2200 కోట్లు వ్యయం చేయగా టీడీపీ ఐదేళ్ల కాలంలో దాదాపు రూ.1,500కోట్లు ఖర్చుచేసింది. అంతేకాక అప్పటికి పూర్తిగా నిలిచిపోయిన టన్నెల్(సొరంగం) తవ్వకాల పనులు పునఃప్రారంభించడంతో పాటు అత్యంత క్లిష్టమైన శ్రీశైలం ఎగువప్రాంతం నుంచి టన్నెళ్లకు నీరు తీసుకునే కొల్లంవాగు ప్రాంతం వద్ద హెడ్ రెగ్యులేటరీ నిర్మాణం చేపట్టింది.

### టీడీపీ హయాంలోనే దాదాపు పూర్తి

టీడీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి టన్నెల్-1 పనులు, తొలిహెడ్ రెగ్యులేటరీ పనులు దాదాపుగా పూర్తికావచ్చాయి. అలాగే రెండవ టన్నెల్‌ను కొల్లంవాగు ప్రాంతం నుంచి తవ్వి తీసుకుంటే 45 రోజుల వ్యవధిలో 45 టీఎంసీల నీరు వెలిగొండకు చేరుతుంది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఏడాదిలోనే తొలి టన్నెల్, హెడ్ రెగ్యులేటరీ పూర్తికాగా కృష్ణానది నుంచి నీరు తీసుకునే అవకాశం ఉన్నా నిర్వాసితులను తరలించడం పట్టించుకోక వీలుకాలేదు. దానిని మభ్యపెట్టి రెండవ టన్నెల్ కూడా పూర్తిచేసి నీరు ఇస్తామని ఏడాదికి రెండు, మూడు ముహూర్తాలు పెడుతూ వచ్చారు తప్ప నిర్వాసితులకు పరిహారం ఇచ్చి పునరావాస చర్యలు పూర్తి చేయడంపై దృష్టిపెట్టలేదు. చివరకు రెండవ టన్నెల్ కూడా 2024 జనవరి 23న పూర్తయ్యింది. అప్పటికి కూడా నిర్వాసితుల తరలింపు జరగలేదు. దాదాపు 11 గ్రామాలలో 7,500 మందిని గుర్తించినా కేవలం 100 కుటుంబాలను మాత్రమే తరలించారు. మిగిలిన వారికి సంబంధించి పరిహారం చెల్లింపు, పునరావాస చర్యలకు రూ.1300 కోట్లు మంజూరు చేస్తూ 2021 ఫిబ్రవరిలో జీవో ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం 2024లో దిగిపోయే వరకు చిల్లిగవ్వ కూడా ఇవ్వక తరలింపు నిలిచిపోయింది.

### నిధులు ఇవ్వక నత్తనడకన పనులు

వరుసగా రెండు గేట్లు పోయాక కళ్లు తెరిచిన వైసీపీ ప్రభుత్వం 12గేట్ల మరమ్మతులకు అనుమతి ఇవ్వగా రూ.6.80 కోట్లతో అహ్మదాబాద్ కంపెనీ టెండర్ పొంది పనులు చేపట్టి నాలుగు గేట్లను ఇప్పటికి అమర్చగా మరో రెండింటిని బిగిస్తున్నారు. ఆ పనులకు రూ.3.60 కోట్లు బిల్లులు కాగా ఒక్క రూపాయి కూడా వైసీపీ ప్రభుత్వం ఇవ్వక గేట్లు పనులు నత్తనడకన సాగాయి. ప్రస్తుత పరిస్థితి చూస్తే సగం గేట్లు బాగా లేవు. ప్రాజెక్టులోకి నీరు వస్తే కొట్టుకుపోయే అవకాశం ఉంటుందని అధికారులు చెప్తున్నారు. ఈ పరిస్థితుల్లో తక్షణం పెండింగ్ బిల్లులు ఇస్తే మిగిలిన గేట్లను కూడా కాంట్రాక్టు కంపెనీ పూర్తిచేసే అవకాశం ఉంది.

### ఎన్నికల కోసం హడావుడిగా ప్రారంభం

ఐదేళ్ల వైసీపీ కాలంలో కేవలం రూ.900 కోట్లు మాత్రమే ఈ ప్రాజెక్టుకు వెచ్చించగా అత్యంత కీలకమైన 2023-24 బడ్జెట్‌లో కేవలం రూ.101 కోట్లు కేటాయించి రూ.30కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అలా ప్రాజెక్టు విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైసీపీ ప్రభుత్వం 2024 ఎన్నికల్లో లబ్ధికోసం నీరు లేకుండానే టన్నెళ్లను జాతికి అంకితం పేరుతో శిలాఫలకాన్ని మాత్రం నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆవిష్కరించి వెళ్లారు. నిజానికి టన్నెళ్ల తవ్వకాలు పూర్తినాటికి నిర్వాసితుల తరలింపు జరిగి ఉంటే ప్రస్తుతం శ్రీశైలం నుంచి వెలిగొండకు నీరు తీసుకునే వీలు ఉండేది. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా 843 నుంచే వెలిగొండకు నీరు తీసుకోవచ్చు. ప్రస్తుతం పది రోజులుగా శ్రీశైలం మట్టం 843 పైనే ఉంది. అంటే రోజుకు ఒక టీఎంసీకి పైగా నీటిని వెలిగొండకు తీసుకునే అవకాశం ఉండేది.

### గుండ్లకమ్మను గాలికొదిలేశారు

ఇదిలాఉండగా మరో కీలకమైన గుండ్లకమ్మ ప్రాజెక్టు దుస్థితి కూడా అలాగే ఉంది. సాగర్ డ్యామ్ నుంచి గేట్లు ఎత్తి సముద్రానికి వదలుతున్నా ప్రస్తుత తరుణంలో కుడి కాలువ ద్వారా నీటిని తీసుకొని గుండ్లకమ్మను నింపుకొనే అవకాశం ఉంది. ప్రాజెక్టు గేట్లు మరమ్మతుల విషయంలో గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యంతో అవి దెబ్బతిని ప్రస్తుతం ప్రాజెక్టుకు నీటిని పెడితే కొట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉంది. మొత్తం 15గేట్లు ఉండగా రెండేళ్ల క్రితం ఒకటి, ఏడాది క్రితం మరొకటి కొట్టుకుపోయాయి. నిజంగా 6, 7 నెంబరు గేట్లు తక్షణం మరమ్మతుల కోసం నిధులు కావాలని 2022 జూన్‌లోనే ఇరిగేషన్ అధికారులు కోరినా నాటి వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. ఆ ఏడాది ఆగస్టు 31న మూడవ నెంబరు గేటు కొట్టుకుపోయింది. తర్వాత కదలిక వచ్చి 6, 7 గేట్లు మరమ్మతులు చేపట్టినా ఇంకా రూ.60లక్షలు బకాయి కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. ఆ సమయంలో మొత్తం గేట్లకు మరమ్మతులు అవసరంగా నిపుణులు సూచించగా రూ.9.4 కోట్లతో అధికారులు అంచనా వేశారు. వాటి మంజూరులోనూ జాప్యం జరగ్గా ఈలోపు గతేడాది జనవరిలో మరోగేటు కొట్టుకుపోయింది. ఫలితంగా రెండేళ్లు ఆయకట్టుకు నీరు రాక రైతులు నష్టపోయారు.

### తక్షణం రూ.600కోట్లు కావాలి

వెలిగొండకు సంబంధించి చూస్తే తొలిదశ నీరు నిల్వ చేయాలంటే సగం మంది నిర్వాసితులను తరలించాలి. అందుకోసం రూ.500 కోట్లు, అలాగే పెండింగ్ పనులకు మరో రూ.100 కోట్లు వెరసి రూ.600 కోట్లు తక్షణం ఇస్తే కృష్ణానదిలో వరద ప్రవాహాలు తగ్గేలోపు ప్రాజెక్టుకు నీటిని తీసుకునే అవకాశం ఉంది. వాస్తవ పరిస్థితిని గుర్తించి వెలిగొండ, గుండ్లకమ్మలను నీటితో నింపే వైపు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు. ఇదిలాఉండగా జిల్లాలో సాగర్ కాలువల పరిస్థితి దారుణంగా ఉంది. సాగర్ డ్యామ్ నుంచి నీరు ఇచ్చినా పొలాలకు సక్రమంగా అందే వీలు లేదు. వైసీపీ పాలనలో సాగర్ కాలువలపైనా అలవిమాలిన నిర్లక్ష్యమే జరగడంతో ఈ పరిస్థితి నెలకొంది. అత్యవసర మరమ్మతులైనా ఆ కాలువలకు చేయాలని రైతులు కోరుతున్నారు.

# డీసీఎంఎస్‌లో రూ.52.95 లక్షలు గోల్‌మాల్

**నిధుల స్వాహాకు ముగ్గురు బాధ్యులు**

**ఆ ముగ్గురిపై సివిల్, క్రిమినల్ చర్యలకు సిఫార్సు**

ఒంగోలు(విద్య), ఆగస్టు 6 : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)లో రూ.52.95 లక్షలు గోల్‌మాల్ అయ్యాయి. డీసీఎంఎస్‌లో జరిగిన నిధుల స్వాహాపై జరిగిన విచారణలో ఈ విషయం వెల్లడైంది. డీసీఎంఎస్‌లో నిధుల దుర్వినియోగంపై అసిస్టెంట్ రిజిస్ట్రార్ బీవీ మాల కొడయ్య విచారణ నిర్వహించి సమగ్ర నివేదికను డీసీవో శ్రీనివాసరెడ్డికి అందజేశారు. డీసీఎంఎస్ నిధులు గోల్‌మాల్‌కు ముగ్గురిని బాధ్యులుగా విచారణాధికారిగా తేల్చారు. డీసీఎంఎస్ చైర్‌పర్సన్ రావి పద్మావతి, బిజినెస్ మేనేజర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ చుండూరి సతీష్, అకౌంటెంట్ బొమ్మరాజు రామచంద్రరావును బాధ్యులుగా గుర్తించారు. సొసైటీలో అకౌంటెంట్ వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు మళ్లించి మింగేసిన రూ.52.95లక్షలను పద్మావతి, సతీష్, రామచంద్రరావుల నుంచి 18శాతం వడ్డీతో వ్యక్తిగతంగా, సమష్టిగా వసూలు చేయమని విచారణాధికారి సిఫార్సు చేశారు. ఈ ముగ్గురిపై సివిల్, క్రిమినల్ చర్యల చేపట్టమని ఆ నివేదికలో కోరారు. ఈ విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పించి తర్వాత తగు చర్యల నిమిత్తం డీసీఎంఎస్ పాలకవర్గానికి పంపించారు. దీనిపై 30రోజుల లోపు పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేసి వారు తగు తీర్మానాలు చేస్తారు. ఆ తర్వాత ఆధారంగా వారిపై సివిల్, క్రిమినల్ చర్యలకు పూనుకుంటామని డీసీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు.

### ట్రై పార్టియేట్ అగ్రిమెంట్ ఉల్లంఘన

పొగాకు రైతులకు ఎరువులు సరఫరా చేసేందుకు ఇండియన్ పొటాష్ లిమిటెడ్, పొగాకు బోర్డు, రైతు కమిటీకి డీసీఎంఎస్‌ల మధ్య ఒప్పందం ఉంది. దానిని డీసీఎంఎస్ ఉల్లంఘించింది. ఆ ఒప్పందం ప్రకారం ఇండియన్ పొటాష్ లిమిటెడ్, డీసీఎంఎస్‌కు ఎరువులు సరఫరా చేస్తుంది. ఆ ఎరువులను డీసీఎంఎస్ పొగాకు రైతులకు పంపిణీ చేస్తుంది. రైతులకు అందించిన ఎరువులకు సంబంధించి నిధులను పొగాకు బోర్డు డీసీఎంఎస్ బ్యాంకు ఖాతాకు జమచేస్తుంది. నిధులు జమ చేసిన రోజు లేదా ఆ మరుసటి రోజు డీసీఎంఎస్ తన కమీషన్‌ను మినహాయించుకొని మిగిలిన మొత్తాన్ని ఇండియన్ పొటాష్ లిమిటెడ్‌కు జమచేయాలి.బోర్డు నుంచి వచ్చిన నిధులను అకౌంటెంట్ రామచంద్రరావు తన వ్యక్తిగత ఖాతాకు రూ. 3,21,35,000 మళ్లించారు. అప్పటి డీసీవో రాజశేఖర్ చొరవతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. ఆయన కలెక్టరుకు, డీసీఎంఎస్ పాలకవర్గానికి లేఖలు రాసి ఒత్తిడి పెంచడంతో అకౌంటెంట్ రామచంద్రరావు 11 దఫాలుగా మొత్తం రూ.2,98,40,000 ఐపీఎల్‌కు జమచేయగా, ఇంకా రూ.52,95,000 చెల్లించలేదు.

### ఖాళీ చెక్కులపై సంతకాలు

చైర్మన్ రావి పద్మావతి, బిజినెస్ మేనేజర్ చుండూరి సతీష్‌లు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి ఖాళీ చెక్కుల మీద సంతకాలు చేయడం వల్లనే సొసైటీలో ఇంత భారీ మొత్తంలో నిధులు స్వాహాకు దారితీసిందని విచారణాధికారి నివేదికలో పేర్కొన్నారు. ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించుకున్న అకౌంటెంట్ ఐపీఎల్ బ్యాంకు ఖాతాకు తప్పుడు ఆర్టీజీఎస్‌తో నిధులు జమ కాకుండా చూసి ఆ మొత్తాలను తన వ్యక్తిగత ఖాతాకు మళ్లించుకున్నారు. ఐపీఎల్‌కు చెల్లింపులు జరుగుతున్నాయా లేదా? అన్నది కూడా సొసైటీ చైర్మన్, బిజినెస్ మేనేజర్లు పట్టించుకోలేదు. నిబంధనల ప్రకారం ప్రతి చెల్లింపునకు సంబంధించి నోట్‌ఫైల్ రాసి ఏ బ్యాంకు ఖాతాకు ఎంత మొత్తం జమచేస్తుంది రాసి చెక్కు మీద ఆ వివరాలు రాయాలి. కానీ అందుకుభిన్నంగా నిధులు మింగేసినా పట్టించుకోలేదు. అక్రమాలపై విచారణ నివేదిక రావడంతో చర్యలకు డీసీఓ ఉపక్రమించారు. బ్యాంకు ఖాతాకు తప్పుడు ఆర్టీజీఎస్‌తో నిధులు జమ కాకుండా చూసి ఆ మొత్తాలను తన వ్యక్తిగత ఖాతాకు మళ్లించుకున్నారు.

## రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

**పాత, కొత్త వ్యాపారులు కలిసి రాత్రికిరాత్రే తరలింపు**

**ఆరు రోజుల వ్యవధిలో జిల్లాలో వెయ్యికి పైగా బస్తాల పట్టివేత**

**ఈ ఊరు, ఆ ఊరు అనే తేడా లేకుండా తరలిస్తున్న బియ్యం**

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 6 : జిల్లాలో రేషన్ మాఫియా మరింత రెచ్చిపోతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏ విధంగా అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలించారో ఇప్పుడు కూడా అదే రీతిలో రాత్రికి రాత్రే ఎత్తుకుపోతున్నారు. ఒకవైపు పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేస్తున్నా అవేమి పట్టించుకోవడం లేదు. ఏకంగా కార్డుదారుల వద్ద వేలిముద్రలు వేయకుండానే నేరుగా బస్తాలను తరలిస్తున్నారు. నెల ప్రారంభమైన ఆరు రోజుల్లోనే జిల్లావ్యాప్తంగా వెయ్యికి పైగా బస్తాలు పట్టుబడ్డాయంటే రేషన్ అమ్మకాలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి నాయకుల అండదండలతో ఎవ్వరైతే రేషన్ అక్రమ వ్యాపారం చేశారో ఇప్పుడు కూడా వారే చక్రం తిప్పుతున్నారు. ప్రస్తుత అధికార పార్టీలోని కొంతమంది నాయకులను మంచి చేసుకొని వారి అండదండలతో రాత్రికి రాత్రే రేషన్ బియ్యాన్ని వాహనాల్లో తరలిస్తున్నారు. పట్టణ, మండల స్థాయిలో కీలక నేతలుగా ఉండేవారిని అక్రమ బియ్యం వ్యాపారంలో భాగస్వాములను చేసుకొని మరింత రెచ్చిపోతున్నారు.



చీమకుర్తిలో పట్టుబడిన రేషన్ బియ్యం

### భారీగా పట్టుబడుతున్నాయి

గత ఆరురోజుల వ్యవధిలోనే చీమకుర్తి, ఎన్జీపాడు, కనిగిరి, కంభం మండలంతోపాటు పలుప్రాంతాల్లో అక్రమంగా వాహనాల్లో బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో రేషన్ షాపుల నుంచి మరో ప్రాంతానికి తరలించి స్టాకు పెడుతున్నారు. రేషన్ బియ్యాన్ని మంచి ధరలు లభిస్తుండటంతో వాటిని తక్కువ ధరలకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తూ కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. జిల్లాకేంద్రమైన ఒంగోలులో వైసీపీ నుంచి ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీలో చేరిన ఇరువురు నేతలు ఇప్పుడు పాత వ్యాపారులతో కలిసి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. వైసీపీలో భారీస్థాయిలో వ్యాపారం చేసిన వ్యక్తులు ఇప్పుడు అధికారపార్టీ నేతలను కలుపుకొని వ్యాపారం ప్రారంభించడంతో విజిలెన్స్ అధికారులకు కూడా అర్థం కాని పరిస్థితి నెలకొంది.

### పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ

కొంతమంది వ్యాపారులు మిల్లులను అద్దెకు తీసుకొని వాటిల్లోకి స్టాకు తరలించి అక్కడ గోతాలు మార్చుకొని నెల్లూరు, కాకినాడకు తరలిస్తున్నారు. మరికొంతమంది వ్యాపారులు రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టి బ్రాండెడ్ గోతాల్లో నింపి తరలిస్తున్నారు. మరికొంతమంది దళారులను ఏర్పాటు చేసుకొని లగేజి ఆటోల్లో యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా పక్షంరోజుల వ్యవధిలోనే కోట్ల వ్యాపారం చేస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా 1వ తేదీన రేషన్ పంపిణీ ప్రారంభమై 15వతేదీ నాటికి పూర్తికావాల్సి ఉంది. మొబైల్ వాహనాల ఆపరేటర్లు కూడా రేషన్ మాఫియకు అండగా నిలుస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రాంతంలో బియ్యం విక్రయాలు జరుగుతాయో ముందుగానే తెలుస్తుండటంతో వ్యాపారులు తేలికగా బియ్యం కొనుగోలు చేస్తున్నారు. కార్డుదారుల నుంచి రూ.10 కొనుగోలు చేస్తున్న డీలర్లు అక్రమ వ్యాపారులకు రూ.16 నుంచి రూ.18కి విక్రయిస్తున్నారు. పేదల బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి కిలో రూ.40నుంచి రూ.45 వరకు విక్రయిస్తూ కోట్లలో సంపాదిస్తున్నారు. పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువ కావడంతో బియ్యం వ్యాపారుల సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతోంది.

# పోలీసులు నిబద్ధతతో పనిచేయాలి

**సీఎం పర్యటనపై ఎస్పీ తుషార్ డూడీ దిశానిర్దేశం**

**బందోబస్తులో 700 మంది అధికారులు, సిబ్బంది**

చీరాల, ఆగస్టు 6 : సీఎం చంద్రబాబు రేపు మధ్యాహ్నం సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని హెలిప్యాడ్ వద్దకు హెలికాప్టర్‌లో చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన చీరాల మండలం జాండ్రపేట బీవీ అండ్ బీఎన్ హైస్కూల్ ప్రాంగణంలో అధికారికంగా జరిగే అంతర్జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. పోలీసులు ఎవరెవరు ఏఏ విధులు నిర్వహించాలనే విషయమై సెయింట్ ఆన్స్ కళాశాలలో ఎస్పీ తుషార్ డూడీ మంగళవారం సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో పాటించాల్సిన నిబద్ధతపై దిశానిర్దేశం చేశారు. మొత్తం 700 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విధులలో ఎవరైనా అలక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. హెలిప్యాడ్ వద్ద, రూఫ్‌టాప్‌లలో, కాన్వాయ్ పార్టీలో, ట్రాఫిక్ మళ్లింపు, సభా వేదిక వద్ద ఇలా ఎక్కడెక్కడ ఎవరెవరు ఎలా విధులు నిర్వహించాలనే అంశంపై విపులంగా ఆదేశాలు ఇచ్చారు. సామాన్య ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఏదన్నా అత్యవసర పరిస్థితులు ఎదురయితే వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. అందులో తాత్సారం వద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్, రేపల్లె, చీరాల, బాపట్ల డీఎస్పీలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులకు దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

## రవికుమార్‌కు తహసీల్దార్‌గా బాధ్యతలు

బల్లికురవ, ఆగస్టు 6 : డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు బల్లికురవ తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం జిల్లా అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. సోమవారం తహసీల్దార్‌గా చార్జి తీసుకున్న కవితను డిప్యూటేషన్‌పై కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు అందాయి. ఇక్కడ డిప్యూటీ తహసీహసీల్దార్ రవికుమార్ ఆ బాధ్యతలు అప్పగించారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

మార్టూరు, ఆగస్టు 6 : రోటరీ క్లబ్ వారు మండలంలోని ద్రోణాదుల గ్రామంలోని ఎంపీపీఎస్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. వాటితోపాటు పెన్నులు, బిస్కట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మద్దుమాల కోటేశ్వరరావు, టీవీ ఆర్టిస్టు మహేంద్ర, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# రేషన్ షాపుల పునర్విభజన ఎప్పుడో..?

### పలు కాలనీల కార్డుదారులకు అందుబాటులో లేక ఇక్కట్లు



ప్రజా పంపిణీ వ్యవస్థ (ఫైల్)

అద్దంకి, ఆగస్టు 6 : అద్దంకి పట్టణంలో ఎక్కువ శాతం రేషన్ షాపులు కొన్ని ప్రాంతాలలో మాత్రమే కేంద్రీకృతమై ఉండగా, పలు కాలనీలలో అందుబాటులో రేషన్ షాపులు లేకుండా పోయాయి. సుమారు దశాబ్ద కాలం కిందట కార్డుల ఆధారంగా రేషన్ షాపులు ఏర్పాటు జరగగా అనంతరం కార్డుదారులు పెరిగినప్పటికి అదనంగా రేషన్ షాపులు పెరగలేదు. అద్దంకి పట్టణంలో సుమారు 10 వేల కుటుంబాలకు తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఆయా కుటుంబాలకు 18 రేషన్ షాపుల నుంచి సరుకుల పంపిణీ జరుగుతుంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ షాపుల నుంచి సరుకులు తీసుకొని ఆటోలలో ఆయా కాలనీలకు వెళ్లి పంపిణీ చేస్తున్నారు. రేషన్ పంపిణీ ఆటోలు నిర్ధిష్ట సమయం పాటించకపోవడం, ఎప్పుడో తమకు ఇష్టమైనప్పుడు వెళ్లి వీధిలో ఎక్కడో ఒక చోట నిలిపి పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆశించిన ప్రయోజనం లేదన్న అభిప్రాయం కార్డుదారులలో ఉంది. దీనికి తోడు ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రేషన్ పంపిణీ వాహన వ్యవస్థను రద్దు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాతపద్ధతిలో రేషన్ షాపుల వద్దనే సరుకుల పంపిణీ జరిగే అవకాశం ఉంది. దీంతో అద్దంకి పట్టణంలో రేషన్ షాపుల కేటాయింపు ఆయా వార్డుల వారీగా కేటాయించి, ఆ పరిధిలో కార్డుదారులు ఆ రేషన్ షాపులో ఉండే విధంగా కేటాయింపు చేయాలని పలువురు కార్డుదారులు కోరుతున్నారు. అద్దంకి పట్టణంలో అత్యధిక శాతం పేద ప్రజలు నివాసం ఉండే రాజీవ్‌నగర్, శ్రీరామ్‌నగర్ కాలనీ, గుంజివారిపాలెం, గరటయ్య కాలనీ,నంబూరిపాలెం తదితర ప్రాంతాలలో అసలు రేషన్ షాపులు లేవు. కొన్ని ప్రాంతాలలో అయితే పక్క పక్కనే రెండు, మూడు రేషన్ షాపులు ఉన్నాయి. కార్డుదారులు ఏ షాప్‌లోనైనా రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు ఉన్నా ఆచరణలో మా త్రం అమలు జరగటం లేదు. సరుకులు లేవనే లేదా ఏదో ఒక సాకుతో తమ షాపు పరిధిలో లేని కార్డుదారులకు రేషన్ సరుకులు ఇవ్వకుండా ఎగనామం పెడుతున్నారు. అదే సమయంలో కార్డుదారుల సంఖ్య పెరిగినందున కొత్త షాపులు కూడా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. కొత్త షాపులు ఏర్పాటు సమయంలోనే అన్ని ప్రాంతాలలో రేషన్ షాపులు ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం 18 రేషన్ షాపులు ఉండగా, కనీసం మరో రెండు రేషన్ దుకాణాలను కొత్తవి ఏర్పాటు చేయడం ద్వారా అద్దంకి పట్టణంలోని 20 వార్డులలో ఒక్కో షాపును ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ముర్రుపాలు అమృతం

బల్లికురవ, ఆగస్టు 6 : పుట్టిన వెంటనే బిడ్డలకు ముర్రుపాలు పట్టిస్తే అవి అమృతంలా పనిచేస్తాయని సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సుధ పేర్కొన్నారు. మంగళవారం బల్లికురవ సెక్టార్ పరిధిలో ఉన్న 20 అంగన్ వాడీ కేంద్రాల కార్యకర్తలు తల్లులతో కలిసి తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం జరిగింది. సీడీపీవో మాట్లాడుతూ తల్లులు అందరూ పుట్టిన బిడ్డలకు ఆరు మాసాలు నిరంతరంగా పాలు ఇవ్వాలన్నారు. అప్పుడే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ విజయనిర్మల, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పర్చూరు : తల్లిపాల వలన కలిగే లాభాల గురించి తల్లులకు అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఐ.సుభద్ర తెలిపారు. మంగళవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం పర్చూరు గ్రామంలో జరిగింది. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దీపాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈ-పంట నమోదు చేయాలి



పంట నమోదును పరిశీలిస్తున్న ఏవో

బల్లికురవ, ఆగస్టు 6 : ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు వెంటనే గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ-పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి కోరారు. మండలంలోని కొప్పెరపాలెం గ్రామంలో జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని ఏవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో రైతులతో మాట్లాడుతూ పంట నమోదు ఉంటేనే ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలు అందుతాయన్నారు. అలానే ఎదైనా ప్రకృతి విపత్తులు సంభవిస్తే పంట నష్ట పరిహారం అందాలంటే ఈ పంట నమోదై ఉం డాలన్నారు. రైతులంతా గ్రామాలలో జరిగే కార్యక్రమాన్ని దగ్గరుండి చేయించుకోవాలన్నారు. పంట వివరా లు, విస్తీర్ణం వివరాలు, రైతు అధార్ కార్డును సిబ్బందికి అందజేయాలని అమె కోరారు. కార్యక్రమంలో వీఏఏ బాషా పాల్గొన్నారు.

పంగులూరు : రైతులు ఖరీఫ్ పంటలను ఈ-పంట యాప్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని జనకవరం గ్రామ పంట పొలాల్లో రైతు సేవా కేంద్రం సిబ్బంది మంగళవారం చేపట్టిన ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని ఏవో పరిశీలించారు. ఖరీఫ్ పంటల నమోదు మంగళవారం నుంచి మొదలైనట్లు చెప్పారు. ఈ-పంట నమోదు అ యిన రైతులకు పంట నష్టం, సున్నావడ్డీ రాయితీ, బీమా వర్తిస్తాయని వివరించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర అధికారి నవనీత, రైతులు పాల్గొన్నారు.

పర్చూరు : ఖరీఫ్ పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ ఏ మెహన్‌రావు కోరారు. మంగళవారం మార్కెట్ యార్డులో సబ్ డివిజన్‌లోని నాలుగు మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఈ పంట నమోదుపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా మాస్టర్ ట్రైనర్ కిరణ్‌కుమార్ పంట నమోదుపై అవగాహన కల్పించారు. ఎక్కడా లోపాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్, ఆదినారాయణ, సుధీర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న అయుర్వేద వైద్యుడు కృష్ణకుమార్

## ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం

బల్లికురవ, ఆగస్టు 6 : అయుర్వేద వైద్యంతో దీర్ఘ కాలిక వ్యాధులు దూరం అవుతాయని దగ్గుపాడు అయుర్వేద వైద్యశాల వైద్యుడు కృష్ణకుమార్ తెలిపారు. మండలంలోని వల్లాపల్లి ఎస్టీ కాలనీలో అంబడిపూడి అయుర్వేద వైద్యశాల ద్వారా ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా 26 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఎలాంటి సైడ్ ఎఫెక్టులు లేకుండా ఎలాంటి రోగాలను అయిన నయం చేసే శక్తి అయుర్వేద వైద్యంలో ఉందన్నారు. ప్రజలందరూ గ్రామాలలో ఉన్న వైద్యశాలల ద్వారా సేవలను పొందాలన్నారు. అలానే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన వేడి నీటిని సేవించాలన్నారు. అలానే మురుగు నీటి నిల్వలు పరిసరాలలో లేకుండా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంపౌండర్ శేషసాయి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సీఎంసీ ఎన్నికలకు బందోబస్తు కల్పించండి

బల్లికురవ, ఆగస్టు 6 : ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తేదీన స్కూల్ మేనేజిమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎంఈవో రమేష్ పోలీసుస్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు జరుగుతున్నాయని, ముక్తేశ్వరం, సోమవరప్పాడు, కూకట్లపల్లి, కొప్పెరపాలెం గ్రామాలలో ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఎంఈవో కోరారు.

## పొలాల్లో సోలార్ డ్రైవ్ చోరీ



సోలార్ బాక్స్‌లో కత్తిరించిన వైర్లు

మార్టూరు, ఆగస్టు 6 : మండల పరిధి బొల్లాపల్లి గ్రామానికి చెందిన రైతు కాపా వెంకటేశ్వర్లుకు చెందిన పొలంలో ఉన్న సోలార్ బాక్సు నుంచి డ్రైవ్‌ను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. దాని విలువ రూ.25వేలు ఉంటుందని వెంకటేశ్వర్లు తెలిపారు. పొలంలో సోలార్ బాక్స్ వైర్లను కత్తిరించి డ్రైవ్‌ను ఎత్తుకుపోయారని తెలిపారు. రెండేళ్లుగా ఈ గ్రా మంలో పొలాల్లో సోలార్ వస్తువులు చోరీకి గురవుతున్నాయని రైతులు చెప్తున్నారు.నాలుగు నెలల కిందట గ్రామంలోని మాజీ సర్పంచ్‌కు చెందిన పొలంలోనే మూడుసార్లు దొంగలు సోలార్ వస్తువులను ఎత్తుకుపోయారు. దానిలోని రాగి వైరుకు డిమాండ్ ఉండడంతో దొంగతనం చేస్తున్నారు. పోయిన ప్రతీసారీ కొత్తవాటిని అమర్చుకుంటున్నారు. అయినా మళ్లీ దొంగలు వాటిని దొంగిలిస్తున్నారు. కొనే శక్తి లేక రైతులు వాటిని ఏర్పాటు చేయడం లేదు. కోలలపూడి, ఇసుకదర్శి, నాగరాజుపల్లి, జొన్నతాళి తదితర గ్రామాలలో పొలాల్లో సోలార్ వస్తువులను దొంగలు ఎత్తుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. వారిలో కొంతమంది రైతులు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా నేటికీ దొంగల ఆచూకీ తెలియలేదు. విద్యుత్ బిల్లులు ఆదా కోసం సోలార్ పై ఆధారపడుతుంటే, దొంగతనాలతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చోరీలు జరుగకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## ఎర్ర బ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



ఎర్ర బ్యాడ్జీలతో విధులకు హాజరైన ఉద్యోగులు

చీరాలటౌన్, ఆగస్టు 6 : చీరాల ఆర్టీసీ డిపో మేనేజర్ జంజనం శ్యామల ఏకపక్షంగా వ్యవహరించి ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని డిపో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కాల్వ శ్రీనివాసరావు, మచ్చా శ్రీనివాసరావు ఆరోపించారు. డిపో ఉద్యోగులు మంగళవారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతనెల 17వ తేదీ నుంచి సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నా చిన్నచూపు చూస్తున్నారన్నారు. చీరాల - బెంగళూరు సర్వీసులో ఈపీకే విధానంతో రద్దు చేయడం అన్యాయమన్నారు. ఆ సర్వీసును పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేవీరావు, జాయింట్ సెక్రటరీ ఆకుల శ్రీనివాసరావు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.








అవగాహన పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ ఆనంద్ (ఫైల్)

# ఆమెకు అండగా..!

నేటి సమాజంలో భార్యాభర్తలిద్దరూ పనిచేస్తే కాని ఇల్లు గడవని పరిస్థితి. దీంతో దాదాపుగా ప్రతి ఇంటి నుంచి ఓ మహిళ ఉద్యోగానికి వెళుతోంది. ఈ పరిస్థితుల్లో ఆమెకు రక్షణ కూడా కీలకమే. పనిచేసే చోట పలువురు మహిళలు వేధింపులకు గురవుతున్నారు. ఆ విషయాన్ని ఎవరికి చెప్పుకున్నా పరిష్కారం కాకపోవటంతో వారు మానసికంగా కుంగిపోతున్నారు. తమ మాట వినడం లేదని వేధింపులకు గురిచేసే వారు అంటున్నారు. అంతేకాక అకారణంగా స్త్రీలను ఒత్తిడికి గురిచేసి కక్షసాధింపులకు దిగుతున్నారు. ఇలా ఒత్తిడికి గురవుతున్న బాధితులు ఇటు ఉద్యోగం మానలేక, అటు ఉద్యోగం చేయలేక నరకయాతన అనుభవిస్తున్నారు.

- మహిళా ఉద్యోగుల రక్షణకు ప్రభుత్వం పెద్దపీట
- ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో అంతర్గత కమిటీలు
- జిల్లాలో 150కిగాను 16 కమిటీల ఏర్పాటు

**నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 6:** పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించేందుకు 2013లో కేంద్ర ప్రభుత్వం మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని తెచ్చింది. ఈ చట్టం పూర్తి స్థాయిలో అమలు జరటం లేదని రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో మహిళల రక్షణకు పెద్దపీట వేసింది. ఉద్యోగాల్లో ఉన్న మహిళలకు మరింత భరోసా ఇవ్వాలని కూడా నిర్ణయించింది. దీంతో ఇకపై పనిచేసే చోట మహిళలకు వేధింపులు ఉండవు. ధైర్యంగా విధులు నిర్వహించుకోవచ్చు. స్వేచ్ఛాయుత వాతావరణంలో వారు ఉద్యోగం చేసుకొనేలా, వారికి రక్షణ కల్పించేందుకు అంతర్గత కమిటీల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో మహిళా రక్షణ కమిటీలను ఏర్పాటు చేసే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

**● ఒక్క మహిళ ఉన్నా...**

జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, క్రీడా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వైద్యశాలలు, సహకార సంస్థలు, విద్యా సంస్థలు, బ్యాంకులు, కార్పొరేషన్‌లు, స్వయం ఉపాధి సంస్థల్లో పదిమంది పనిచేసే చోట ఒక మహిళ ఉన్నా విధిగా కమిటీ ఏర్పాటు చేయాల్సిందే. పది మంది కంటే ఉద్యోగులు తక్కువగా పనిచేసేచోట మహిళలకు సమస్య వస్తే జిల్లా కమిటీలను ఆశ్రయించవచ్చు. పదిమంది ఉద్యోగులు ఉన్న చోట ఐదుగురితో కమిటీ వేస్తారు. ఇందులో 50 శాతం మంది మహిళలే సభ్యులుగా ఉంటారు. ఈ లెక్కన ఇద్దరి నుంచి ముగ్గురి వరకు మహిళలు విధిగా ఈ కమిటీల్లో ఉంటారు అంతర్గత కమిటీ సభ్యుల పేర్లు, కార్యవర్గం వివరాలు అందరికీ కనిపించేలా నోటీసు బోర్డులో ఉంచాలి. ఎవరైనా లైంగికంగా, మానసికంగా వేధిస్తే వెంటనే అంతర్గత కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు. అక్కడే ఏర్పాటు చేసిన బాక్సులో ఫిర్యాదు కాపీని వేయవచ్చు. ఈ విషయమై అంతర్గత కమిటీలో చర్చిస్తారు. అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా కమిటీని ఆశ్రయించవచ్చు. అక్కడ నేరం రుజువైతే మాత్రం శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు. జిల్లా కమిటీలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మహిళా శిశు సంరక్షణాధికారి సభ్యులుగా ఉంటారు. ఒకవేళ మహిళ ఎవరైనా ఉద్దేశపూరకంగా తప్పుడు కేసు పెడితే ఆమెపై కూడా చర్యలు ఉంటాయి.



హేనా సుజన్

**150 కమిటీల ఏర్పాటుకు నిర్ణయం**

జిల్లాలో 150 మహిళా రక్షణ కమిటీలను ఏర్పాటు చేయడానికి నిర్ణయించాం. ఇప్పటి వరకు 16 కమిటీలను మాత్రమే ఏర్పాటు చేశాం. మండల స్థాయిలో తహసీల్దార్, కార్పొరేషన్ స్థాయిలో కమిషనర్ కమిటీలకు నోడల్ అధికారులుగా ఉంటారు. ఫిర్యాదు అందిన వెంటనే 509 సెక్షన్ కింద చర్యలు ఉంటాయి.

**- హేనా సుజన్, ఐసీడీఎస్, పీడీ**

**● ప్రతి కార్యాలయంలో కమిటీ**

పని చేసే ప్రదేశంలో మహిళలపై లైంగికంగా జరిగే దాడుల నిరోధానికి ప్రతి కార్యాలయంలో కమిటీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ఈ కమిటీలో సీనియర్ మహిళా ఉద్యోగితోపాటు ఎన్‌జీవో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై మహిళా ఉద్యోగులందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు రూపొందించిన పోస్టర్‌ను ఇటీవల కలెక్టర్ విడుదల చేశారు.

**నెల్లూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వం మారినా ఇంకా పలువురు అధికారుల తీరు మాత్రం మారలేదు. వైసీపీ ప్రభుత్వంలోనే ఉన్నట్లుగా.. మమ్మల్ని ఎవరూ అడగరులే... అన్న ధీమాతోనే వారు వ్యవహరిస్తున్నారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఓ వైపు సీఎం చంద్రబాబు హెచ్చరిస్తుండగా, ఆ పని తీరులో మార్పు తీసుకువచ్చేందుకు కలెక్టర్ ఆదేశాలిస్తున్నా కొంత మంది మాత్రం నిర్లక్ష్యం వీడడం లేదు. వారి శాఖల్లో జరుగుతున్న పనితీరు ప్రజలకు తెలియజేయకుండా తప్పించుకు తిరుగుతున్నారు. ఇలా తెలియజేస్తే వారి బాగోతాలు బయట పడతాయని కొందరు వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. పత్రికల్లో వచ్చే కథనాలపై స్పందించాలని కలెక్టర్ ఓ ఆనంద్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజాసమస్యలపై వెంటనే స్పందించి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో ప్రజలకు తెలియజేయాలని సూచించినా కొన్ని శాఖలు మాత్రం కలెక్టర్ ఆదేశాలను సైతం ధిక్కరిస్తున్నాయి. వివరణ ఇవ్వాలంటూ కలెక్టరేట్ నుంచి వచ్చిన లేఖలన్నీ పలు శాఖల్లో పేరుకుపోయాయి. కలెక్టర్ ఒక్కరే అన్ని శాఖలను చూస్తున్నా.. శాఖాధిపతులు మాత్రం వారి శాఖల సమస్యలను కూడా పట్టించుకోలేని దుస్థితిలో ఉన్నారు.

**● పాలనలో పారదర్శకత కోసం...**

పాలనలో పారదర్శకత ఉండాలని, మీడియాలో వచ్చే ప్రజా సంబంధ వార్తలపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని సాక్షాత్తూ సీఎం చంద్రబాబు నాయుడే కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సూచించారు. మీడియాలో వచ్చిన కథనాలు నిజమైతే ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని, అదే సమయంలో తప్పుడు ప్రచారం చేస్తే ఖండన ఇవ్వడంతో పాటు న్యాయపరంగా చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించారు. పారదర్శక పాలనకు, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనాన్ని తీసుకొచ్చేందుకు ఈ విధానం ఎంతగానో దోహదపడుతుంది. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రోజు నుంచే ఈ విధానాన్ని ఓ. ఆనంద్ అమల్లోకి తీసుకువచ్చారు. ప్రతీ రోజూ ఆయన పత్రికలను చదువుతూ, అందులోని ప్రజా సంబంధమైన అంశాలపై స్పందిస్తున్నారు. ఆ కథనాలపై వివరణ ఇవ్వాలని ఆయా శాఖలను ఆదేశిస్తున్నారు. గాడి తప్పిన అధికార వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు, అధికారుల్లో ఆవహించిన నిర్లక్ష్యాన్ని తొలగించేందుకు కలెక్టర్ ఈ పంథాను ఎంచుకున్నారు. ఇలా చేయడం ద్వారా నిత్యం క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో అధికారులు తెలుసుకోవడంతో పాటు ప్రజా సమస్యలను గుర్తించేందుకు అవకాశం ఏర్పడుతుందని కలెక్టర్ భావన. కానీ కొన్ని శాఖల అధికారులు మాత్రం ఇంకా నిర్లక్ష్యం వీడడం లేదు. తమ శాఖలో ఏం జరుగుతుందో కలెక్టర్ చెప్పే వరకు కూడా వారికి తెలియడం లేదు. పోనీ కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాకైనా కదులుతున్నారా..? అంటే అదీ లేదు. పలానా మీడియా కథనాలపై వివరణ ఇవ్వాలంటూ కలెక్టరేట్ నుంచి లేఖలు అందుతున్నా కొన్ని శాఖల్లో అవి చెత్తబుట్టల్లోకి చేరుతున్నాయి. ఆయా శాఖల ఉన్నతాధికారులు కనీసం వీటిని పట్టించుకోవడం లేదు. కలెక్టర్ ఆదేశాలను కూడా పట్టించుకోలేనంత బిజీగా సదరు శాఖల అధికారులు వ్యవహరిస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో జవాబుదారీతనం లేకుండా పోయింది. ప్రజా సమస్యల పరిష్కారం కన్నా ఎమ్మెల్యేలు, వైసీపీ నాయకుల సమస్యల పరిష్కారానికే ఎక్కువ ప్రాధాన్యం కల్పించారు. దీంతో ప్రజా సమస్యలు కుప్పలుతెప్పలుగా పేరుకు పోవడంతో పాటు అధికార యంత్రాంగం కూడా అవినీతి ఊబిలో కూరుకుపోయింది. అలాంటి పాలనను మెచ్చని ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి తీర్పునిచ్చారో స్పష్టంగా కనిపించింది. ఈ నేపథ్యంలోనే కొత్త ప్రభుత్వం పాలనలో మార్పులు తీసుకువస్తున్నా, కొందరు అధికారులు ఇంకా ఆ మార్పులకు అనుగుణంగా నడుచుకోవడంలేదు. ఈ అంశంపై కలెక్టర్ సీరియస్‌గా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.




- విధుల్లో ఇంకా కొంతమంది అధికారుల తీవ్ర నిర్లక్ష్యం
- పత్రికల్లో కథనాలకు వివరణ ఇవ్వాలంటూ కలెక్టర్ ఆదేశం
- ఖాతరు చేయని పలుశాఖల ఉన్నతాధికారులు
- ప్రభుత్వం మారినా మారని కొందరి తీరు

# మేమింతే..!

**పొదలకూరు, ఆగస్టు 6:** గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు చేసిన అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పొదలకూరు మండలంలోని వరదాపురంలో క్వార్ట్జ్ దోపిడీ, మొగళ్లూరు నుంచి తెల్లరాయి అక్రమ రవాణా ఘటనలు మరువకముందే.. తాజాగా పులికల్లు గ్రామ సర్వేనెంబరు 556లో అక్రమంగా క్వార్ట్జ్ తవ్వకాలు చేపట్టి 2,812 మెట్రిక్ టన్నుల ఖనిజాన్ని వెలికితీశారు. ప్రభుత్వం మారడంతో ఏమీ ఎరగనట్లుగా క్వార్ట్జ్ గుంతలను పూడ్చివేశారు. అయితే గ్రామస్థులు, స్థానిక ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేయడంతో జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారులయిన రాయల్టీ ఇన్‌స్పెక్టర్ దేవీసింగ్, మైన్స్ సూపర్‌వైజర్ ఎం.సుధాకర్‌రావు, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్‌వో శారద మంగళవారం రంగంలోకి దిగారు. అక్రమంగా మైనింగ్ జరిగిన ప్రాంతాన్ని వారు తనిఖీ చేసి ఎంత పరిమాణంలో క్వార్ట్జ్‌ను తొలగించారో లెక్క కట్టారు. 2,812 మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్‌ను తోడేటి కామాక్షమ్మ అనే ఆమెకి చెందిన పొలంలో శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి తవ్వకాలు జరిపినట్లుగా నిర్ధారించారు. ఇందుకు పులికల్లుకి చెందిన వైసీపీ నాయకుడొకరు సహకరించినట్లు సమాచారం. ఈ మేరకు మైనింగ్ అధికారులు పంచనామా నివేదిక సిద్ధం చేశారు.

**● మైనింగ్ లీజును ఆపేయాలి : ఎమ్మార్పీఎస్**

పొదలకూరు పంచాయతీ పరిధిలోని తోకంచి గ్రామాన్ని ఆనుకుని ఉన్న సర్వే నెంబరు 77లో మైనింగ్ లీజును నిలుపుదల చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పాపయ్య, కామంచి వెంకయ్యలు మంగళవారం తహసీల్దారు సారంగపాణికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తోకంచి గ్రామంలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉన్నారని, వీరిలో కొందరు పశువులను, జీవాలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. మైనింగ్ వల్ల ఆ జీవాలకు ప్రాణాపాయం ఉందన్నారు. కావున వెంటనే మైనింగ్ లీజ్‌ను రద్దు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీ. పెంచలప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పులికల్లులో 2812 మెట్రిక్ టన్నుల వెలికితీత

# అక్రమంగా క్వార్ట్జ్ తవ్వకాలు

- అనంతరం గుంతల పూడ్చివేత
- స్థానికుల ఫిర్యాదుతో మైనింగ్ అధికారుల తనిఖీ
- పంచనామా నిర్వహణ



కావలి మున్సిపల్ కార్యాలయం

# వైసీపీ నేతలకు ఊడిగం... మున్సిపాలిటీ నుంచి వేతనం !

- కావలి పురపాలక సంఘం ఖజానాకు భారీ గండి
- ఐదేళ్లలో రూ.ఐదు కోట్ల మేర దోపిడీ
- కూటమి ప్రభుత్వంలో అడ్డుకట్ట ?

**కావలి,ఆగస్టు6:** అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతూ, వచ్చిన ఏ అవకాశాన్ని వదలకుండా జగన్ పాలనలో మున్సిపల్ ఖజానాకు వైసీపీ నేతలు గండి కొట్టారు. పీఏల దగ్గర నుంచి వాహనాల డ్రైవర్లు, ఇళ్లలో పనిచేసేవారు.. ఇలా వైసీపీ నాయకుల వద్ద పనిచేస్తున్న సుమారు 55 మందికి గత ఐదేళ్లుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా, దినసరి పారిశుధ్య కార్మికులుగా చూపించి మున్సిపాలిటీ నుంచి జీతాలు ఇప్పించారు. వీరిలో కొందరిని ఎన్నికల కోడ్ వచ్చాక, మరికొందరిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొత్తంగా అందరినీ తొలగించినట్లు అధికారులు చెబుతున్నారు.

**● చివరి నిమిషంలో కూడా...**

వైసీపీ ప్రభుత్వం దిగిపోయేటప్పుడు కూడా అప్పటి ఎమ్మెల్యే సిఫారసు లేఖ మేరకు 27 మందిని ఆప్కాస్‌లోకి అదనంగా చేర్చుకుందుకు అనుమతులు తెచ్చుకున్నారు. అయితే అనుమతులు వచ్చేసరికి ప్రభుత్వం మారటంతో 17 మందిని చేర్చుకోకుండానే నిలిపివేశారు. మొత్తం మీద కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు చేయకుండా జీతాలు తీసుకుంటున్న 25 మంది ఆప్కాస్ ఉద్యోగులు, 30 మంది దినసరి కార్మికులను గుర్తించి తొలగించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెలకు రూ.21,000లు, దినసరి కూలీలకు నెలకు రూ.12,000ల వంతున మున్సిపాలిటీ అధికారులు ఈ ఐదేళ్ల జీతాలు చెల్లించారు. దీంతో నెలకు సుమారు రూ.9 లక్షలు వరకు మున్సిపల్ ఖజానా నుంచి ప్రజల సొమ్మును వైసీపీ నేతల అనుచరులకు చెల్లించారు. ఇలా ఏడాదికి సుమారు రూ. కోటి చొప్పున ఐదేళ్లలో రూ.5 కోట్ల మున్సిపల్ సొమ్మును అప్పనంగా మెక్కేశారు.

**● తొలగింపుపై తర్జన భర్జన**

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా కావలి మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్నవారిలో ఎక్కువ మంది వైసీపీ నేతల అనుచరులే. మున్సిపాలిటీ ప్రతి కదలికను వారు వైసీపీ నాయకులకు చేరవేస్తున్నారనే ప్రచారం ఉంది. ఇంకా మున్సిపాలిటీలోని వివిధ విభాగాలలో సుమారు 260 మంది ఔట్‌సోర్సింగ్ కింద వైసీపీ నేతల అనుచరులు పనులు చేస్తున్నారు. వీరిని తొలగించి కొత్తవారికి అవకాశం కల్పించాలని కూటమి నేతలు పట్టుబడుతున్నారు. ఈ విషయం బయటకు పొక్కటంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో అనుమానం ఉన్న వారంతో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి వద్దకు, కూటమి నేతల వద్దకు క్యూకట్టారు. మీరు చెప్పినట్లుగా నడుచుకుంటూ, మీకు అనుకూలంగా ఉంటామని చెబుతుండడంతో వారి తొలగింపుపై నేతలు తర్జనభర్జన పడుతున్నారు. మున్సిపల్ కార్యాలయంలో కీలకపోస్టుల్లో ఉన్న ఆరుగురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను మాత్రం విధులకు రావద్దని చెప్పారు. వారికి జీతాలను నిలిపివేసినా వారి సేవలను ఏదోఒకవిధంగా అధికారులు వినియోగించుకుంటున్నారనే ప్రచారం ఉంది. దీంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులలో ఎంత మందిని తొలగిస్తారనే దానిపై మున్సిపల్ కార్యాలయంలో చర్చ సాగుతోంది.

# పశుగణన పక్కాగా జరగాలి

**● నోడల్ అధికారి శ్రీనివాసరాజు**

**నెల్లూరు(వ్యవసాయం):** జిల్లాలో పశు గణన పక్కాగా నిర్వహించాలని విజయవాడ పశుసం వర్ధకశాఖ ప్రధాన కార్యాలయం నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాసరాజు ఆదేశించారు. పశు సంపద ద్వారా ఉత్పత్తి అయ్యే పాలు, గుడ్లు, మాంసం వంటి విలువలను లెక్కించి తద్వారా దేశ జాతీయ స్థూల ఉత్పత్తి విలువను లెక్కించడంలో పశుగణన ప్రధాన భూమిక పోషిస్తుందని తెలిపారు. నెల్లూరులోని పశుసంవర్ధకశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం 21వ అఖిల భారత పశుగణనకు సంబంధించి సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు అవసరమైన పథకాలు, సేవలను అందించేందుకు తగిన ప్రణాళికలను రూపొందించేందుకు పశుగణన ఉపయోగపడుతుందన్నారు. పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ సెప్టెంబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు పశుగణన కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి పశుపక్ష్యాదుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 2వేల కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్, పట్టణ ప్రాంతాల్లో ప్రతి 3వేల కుటుంబాలకు ఒక ఎన్యుమ రేటర్‌ను కేటాయించినట్లు చెప్పారు. ఐదుగురు ఎన్యుమ రేటర్లకు ఒక సూపర్ వైజరు ఉంటారన్నారు. నెల్లూరు, కావలి, కందుకూరు డివిజన్లలో ఐదు రోజులు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ డీడీ టీ సోమయ్య, నాగమణి, డాక్టర్ రామచంద్రారెడ్డి, మంజునాథ్‌సింగ్ పాల్గొన్నారు.

- పారిశుధ్యంలో కలుస్తున్న మానవ వ్యర్థాలు
- కొత్త వ్యాధులు పుట్టుకువచ్చే అవకాశం
- నిబంధనలు పాటించని జీజీహెచ్
- మూడేళ్ల తర్వాత వ్యర్థాలకు గదుల కేటాయింపు



చెత్తతో కలిపిన మానవ వ్యర్థాలు

# నిర్వహణపై నిర్లక్ష్యం

**నెల్లూరు(వైద్యం),ఆగస్టు 6:** మానవ వ్యర్థాల (బయో మెడికల్ వేస్ట్) నిర్వహణపై అడగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది. వైద్య సిబ్బంది బాధ్యతారాహిత్యం కారణంగా ఏర్పడిన ఈ సమస్యపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టకపోవటంతో కొత్త వ్యాధులు పుట్టుకువచ్చే అవకాశం ఉంది. ఈ పరిస్థితి ఎక్కడో కాదు. జిల్లా కేంద్రమైన నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనే నెలకొంది.

**● అధికారుల చర్యలు శూన్యం**

జీజీహెచ్‌లో కొంతకాలంగా బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అస్తవ్యస్తంగా తయారైంది. ఈ విషయమై ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు, ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా ఇక్కడ నిల్వ ఉన్న చెత్తను తొలగించాలని మున్సిపల్ అధికారులకు తెలియ చేయటంతో మున్సిపల్ వాహనం చెత్త తొలగించేందుకు ఇటీవల జీజీహెచ్‌కు చేరుకుంది. ఈ చెత్తతో పాటు బయోమెడికల్ వేస్ట్ ఉందని గ్రహించిన పారిశుధ్య సిబ్బంది, వాటిని తొలగిస్తుండగా సింహ పురి చైతన్య వేదిక, విద్యార్థి సంఘాలు అడ్డుకున్నాయి. వెంటనే మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది చెత్తను తరలించే వాహనాన్ని వెనక్కు తీసుకెళ్లడంతో చెత్తతోపాటు బయో మెడికల్ వేస్ట్ జీజీహెచ్‌లో నిలిచి పోయింది. ఈ నేపథ్యంలో సింహపురి చైతన్య వేదిక నిర్వాహకులు జీజీహెచ్‌లో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తీరుపై వారం క్రితం కలెక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కాలుష్య నివారణ అధికారి రాజశేఖర్‌కు కూడా వినతిపత్రం ఇచ్చారు. వెంటనే రాజశేఖర్ జీజీహెచ్‌కి వచ్చి బయో మెడికల్ వేస్ట్ నిర్వహణను సక్రమంగా పాటించాలని అధికారులను హెచ్చరించారు. దీంతో బయోమెడికల్ వేస్ట్ తీసుకువెళ్లే ఎస్ఎస్ బయో కేర్ వాహనం వచ్చి ఈ వేస్ట్‌ను తీసుకువెళ్లింది. ఇంత జరిగినా ఈ వ్యర్థాల తొలగింపుపై వైద్య సిబ్బందిలో మార్పు రాలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



వ్యర్థాల బిన్‌లు ఇలా..

**● వేటిని ఎక్కడ వేయాలి..**

మానవ వ్యర్థాల తొలగింపునకు ఎరుపు, పసుపు, బులుగు రంగుల్లో ఉండే పీపీసీ బిన్ వంటి కవర్లను వాడాలి. ఎరుపు డబ్బాలోని మందపాటి కవర్‌లో డిస్పోజిబుల్ సిరంజీలు, వీవీట్యూబ్స్, కెథెటర్స్, ఇతర ట్యూబ్‌లు, బ్లడ్‌బ్యాగ్స్, యూరిన్‌బ్యాగ్స్ వంటి మానవ వ్యర్థాలను వేయాలి. పసుపురంగు డబ్బా కవర్‌లో కణజాలాలు, శరీర భాగాలు, ప్లసెంటా, ఎంబాస్టర్ పిండాలు, అంగాలు, నెత్తూరు, చీము, డ్రస్సింగ్ వేస్ట్ వంటి వ్యర్థాలు వేయాలి. అలాగే బులుగు రంగు డబ్బా కవర్‌లో గాజు సీసాలు, పీపీసీ బిన్‌లోని కవర్‌లో బ్లేడ్‌లు, ఇంజక్షన్ మందు ఉండే పగిలిన వయల్స్, వెయిల్స్ రోగికి ఉప యోగించే పదునైన వస్తువులు వేయాలి. వీటి నిర్వాహణ బాధ్యతను నర్సులు చేపట్టాలి. వీటిపై పర్య వేక్షణను అధికారులు చేపట్టాలి. మానవ వ్యర్థాలతో పాటు భోజన వ్యర్థాలు, ఇతర వ్యర్థాలు వీటిలో కలపటం వల్ల కొత్తకొత్త వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. పైగా ఎస్ఎస్ బయోకేర్ ద్వారా ఈ వ్యర్థాలను తరలి స్తుండటం వల్ల ఇక్కడకు వచ్చే రోగులు, సహాయకులు తీవ్ర అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది.

**● మూడేళ్ల తర్వాత గదుల కేటాయింపు**

జీజీహెచ్‌లో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు ప్రత్యేకంగా నాలుగు గదులను నిర్మించారు. అయితే పారిశుధ్యం కాంట్రాక్టర్ ఇందులో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. తాజాగా సింహపురి చైతన్య వేదిక చొరవ వల్ల బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు ఆ గదులను కేటాయించారు.ఇకనైనా మానవ వ్యర్థాల నిర్వహణపై జీజీహెచ్ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

# అధికారులకు పట్టని పరిశుభ్రత!


వరికుంటపాడు: మండల కార్యాలయం వెనుక పేరుకపోయిన చెత్తాచెదారం

**వరికుంటపాడు, ఆగస్టు 6:** సభలు, సమావేశాల సమయంలో పరిశుభ్రతపై ఉపన్యాసాలు ఊదరగొట్టే అధికారులు తమ సొంత కార్యాలయాల తీరును మాత్రం పట్టించుకోకుండా మరిచిపోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం ప్రజలు, ప్రజా ప్రతినిధులతో రద్దీగా ఉండే మండల పరిషత్, వెలుగు, ఉపాధిహామీ, హౌసింగ్ కార్యాలయాల చుట్టూరా అపరిశుభ్రత విలయతాండవం చేస్తుంది. దీన్ని పట్టించుకొనే వారు కరువయ్యారు. గదుల చుట్టూరా చెత్తా, చెదారం పేరుకపోవడంతో పాటు ఏపుగా పెరిగిన కంపచెట్లు, ఇతరత్రా వ్యర్థాలు నెలల తరబడి దర్శనమిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం దారుణమని ప్రజలు మండిపడుతున్నారు. ప్రాంగణంలోను అపరిశుభ్రత పుణ్యమాని విషపురుగులు సంచరించే ప్రమాదం దాపురించింది. కార్యాలయాలకు వెళ్లే ప్రజలు దీన్ని గమనించి అటువైపు వెళ్లలేకపోతున్నారు.

## లవణాలు ఎక్కువైతే పైరులో పెరుగుదల ఉండదు

**ఏఎస్ పేట, ఆగస్టు 6:** వరి పొలాల్లో లవణాలు ఎక్కువైతే పైరులో పెరుగుదల సక్రమంగా ఉండదని ఆత్మకూరు ఏడీఈఏ దేవసేన తెలిపారు. మంగళవారం ఆమె పందిపాడు రైతులు సాగు చేసిన వరి పంటలను పరిశీలించి మాట్లాడారు. వరి పైరు సక్రమంగా పెరగలేదని పంటలకు మడులు ఏర్పాటు చేసి ఏ మడికి ఆమడికి సాగునీరు పారించి నీరు తీసివేయడం ద్వారా లవణాల ప్రభావం తగ్గించవచ్చన్నారు. అలా చేస్తే పైరులో పెరుగుదల బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ఏవో రజనీ, ఏఈవో చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దారు బాధ్యతల స్వీకరణ

**మర్రిపాడు, ఆగస్టు 6:** తహసీల్దారు స్వప్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల అనంతరం జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం పనిచేస్తున్న ఆమె డిప్యూటీ తహసీల్దారు ప్రమోషన్‌తో మర్రిపాడుకు బదిలీపై వచ్చారు.

## అక్రమంగా గ్రావెల్ తరలింపు



**అనంతసాగరం, ఆగస్టు 6:** ఉప్పలపాడు సమీపంలోని ప్రభుత్వ భూమిలో మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తవ్వి ట్రాక్టర్లతో మంచాలపల్లికి తరలించారు. విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు.

## ఈ-పంట నమోదు తప్పనిసరి

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 6:** ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి జయశ్రీ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు తమ పరిధిలోని రైతు సేవాకేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యానవన సహాయకులను సంప్రదించి ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. ఇలా చేస్తేనే ప్రభుత్వ రాయితీలు వరిస్తాయన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై బింధు, తుంపర్ల పరికరాలను అందజేస్తుందని, అవసరమైన రైతులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ధ్రువపత్రాల మంజూరుపై విచారణ

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 6:** మోచి(ఎస్సీ-బీ) కులాల వారికి ధ్రువీకరణ పత్రాల మంజూరుపై ఇన్‌చార్జి తహసీల్దారు షేక్ జహీర్‌బాబు రెవెన్యూ అధికారులతో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మోచి కులానికి చెందిన 15కుటుంబాలు ఉన్నాయని చెప్పారు. 2016 వరకు వారికి కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారని, అనంతరం మంజూరు చేయడం నిలిపివేశారన్నారు. అందుకు గల కారణాలపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు జాఫర్, వెంకటేశ్వర్లు, మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

## నివేదిక సిద్ధం చేయండి

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 6:** ఈ నెల 20న జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆరు నెలల నుంచి 19 ఏళ్ల వయసులోపు విద్యార్థుల నివేదికను సిద్ధం చేయాలని మండల వైద్యాధికారి శివకల్యాన తెలిపారు. మంగళవారం గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమీక్షించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అనంతరం మాత్రలు మింగించాలన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సంబంధిత రికార్డులు పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

# నీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన


అనంతసాగరం: ఖాళీ బిందెలతో నిరసన తెలియచేస్తున్న కాలనీవాసులు

**అనంతసాగరం, ఆగస్టు 6:** మంచాలపల్లి ఎస్సీ కాలనీ వాసులు మంగళవారం ఆత్మకూరు-సోమశిల రోడ్డుపై తాగునీటి కోసం స్థానికులు ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. వీరికి సీపీఎం నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా నాయకులు అన్వర్‌బాష, వెంకటేశ్వర్లు, రవి, శంకరయ్యలు మాట్లాడారు. కాలనీలో వారం రోజులుగా నీటి సరఫరా జరగడం లేదన్నారు. ఉన్న చేతిపంపు కూడా పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**ఆత్మకూరు:** పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి ప్రజలకు తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని మంగళవారం సాయంత్రం సీపీఎం నాయకులు స్థానికులతో కలిసి రాస్తోరోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కె డేవిడ్‌రాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సంధాని మాట్లాడారు. తాగునీటి పైపులు మరమ్మతులతో నీటి సమస్యల వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజులుగా ఈ ప్రాంతంలో నీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మండిపడ్డారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.


ఆత్మకూరు: రాస్తోరోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, మహిళలు

## జీవితంలో ఇక జగన్‌రెడ్డి సీఎం కాలేడు

● ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

**వింజమూరు, ఆగస్టు 6:** వైఎస్ జగన్‌రెడ్డి జీవిత కాలంలో ఇక ముఖ్యమంత్రి కాలేరని ఆయన గ్రాఫ్ బాగాలేక నా గ్రాఫ్ బాగాలేదు అన్నాడని ఉదయగిరి మాజీ శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. వింజమూరు పంచాయతీలోని జీబీకేఆర్ ఎస్టీ కాలనీ లోని రామ మందిరానికి పంచలోహ విగ్రహాలను అందజేసే క్రమంలో ముందురోజు జరుగు తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం స్థానిక బంగ్లా సెంటర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పరిపాలన విధానాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దగ్గర నేర్చుకోవాలని కొనియడారు. ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ ఉన్నతంగా వ్యవహరిస్తూ పరిపాలన విభాగంలో ఇప్పటికే తనకంటూ ఒక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో అన్ని శాఖలను నిర్వీర్యం చేసిన ఘనుడు జగన్‌రెడ్డి అన్నారు. ఎన్నికలకు ఆరునెలల ముందే తెలుగుదేశం పార్టీలో చేరి పార్టీ విజయానికి కృషి చేశానని తెలిపారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కోసం తాను, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, చంచలబాబుయాదవ్, మన్నేటి వెంకటరెడ్డిలు ఎంతో కృషి చేశామన్నారు. ఎన్డీయే ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందని ఆయన జోస్యం చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, వేణు, జూపల్లి రాజారావు, చల్లా మాల్యాద్రి, పాములపాటి మాల్యాద్రి, పెరుమాళ్ల షేక్.రఫీ, వసంతరావు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**సీతారామపురం, ఆగస్టు 6:** అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన గారపాటి చెన్నకేశవులు (40)మంగళవారం సీతారామపుం బెస్తకాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంటును పునరుద్ధరించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కూలిపోయాడు. గమనించిన స్థానికులు 108అంబులెన్స్‌లో సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్య సిబ్బంది పరీక్షలు జరిపి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈయన సీతారామపురం తోటకాలనీలో నివాసం ఉంటూ ప్రైవేటుగా కరెంట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి కుమారుడు, కమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు కోరారు.

## కొలగాని రామయ్య చౌల్ట్రీ ఆక్రమణలపై చర్యలు

● దుకాణాదారులకు నోటీసుల జారీ

**ఆత్మకూరు, ఆగస్టు 6:** పట్టణ నడిబొడ్డులోని కొలగాని రామయ్య చౌల్ట్రీని కొందరు కబ్జా చేసి దుకాణాలు, భవనాలు నిర్మించి ఉన్నారని, వాటి తొలిగింపునకు మంగళవారం ఎండో మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎండోమెంట్ అధికారులు, సిబ్బంది కొలగాన సత్రంలోని దుకాణాదారులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు. అంతకుముందు సంబంధిత స్థలంలోని దుకాణాలన్నింటినీ వారు పరిశీలించారు. స్థానిక బీఎస్ఆర్ సెంటర్‌కు సమీపంలోని ప్రాంతం, వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో రోడ్డుపై నుంచి రామకృష్ణ థియేటర్ వరకు వస్తరించి ఉన్న కొలగాని రామయ్య సత్రానికి సంబంధించిన స్థలం వరకు ఉన్న దుకాణాల యజమానుల పేర్లును నమోదు చేసుకున్నారు. కార్యక్రమానికి ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ఎస్ఐ ముత్యాలరావు ఆధ్వర్యంలో ఏఎస్ఐ సత్యనారాయణ, పోలీసుల సిబ్బంది ఉన్నారు.



## ఎస్ఎంసీ ఎన్నికల్లో నియమావళి పాటించాలి

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 6:** ఈ నెల 8న ప్రభుత్వ పాఠశాలల్లో జరగనున్న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో నియమ నిబంధనలు పాటించి ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రోసనారెడ్డితో కలిసి ప్రధానోపాధ్యాయులతో సమావేశం అయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నికల నియమావళిని అనుసరించి ఎన్నుకోవాలన్నారు. ఎన్నికల అనంతరం వారి వివరాలను అధికారులకు అందజేయాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే సమాచారం అందించాలన్నారు. మనబడి మన భవిష్యత్ పనులపై సమీక్షించారు. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని సూచించారు.

## తాగునీటి వసతిపై సర్వే చేపట్టాలి

**వరికుంటపాడు, ఆగస్టు 6:** గ్రామాల్లో తాగునీటి వసతిపై సమగ్ర సర్వే చేపట్టాలని ఎంపీడీవో వెంకట కృష్ణకుమారి సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆమె పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో కలిసి సమావేశం అయ్యారు. ప్రతి ఇంటికెళ్లి తాగునీటి వసతిపై, వసతిలేని గృహాలను గుర్తించాలని సూచించారు. అనంతరం పంచాయతీల వారీగా నివేదికలు సేకరించాలన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి



## కోలగట్లలో గడ్డివామి దగ్ధం

**సంగం, ఆగస్టు 6:** కోలగట్లలో గట్టుపల్లి చిన్న పెంచలయ్య అనే రైతుకు చెందిన పది ఎకరాల గడ్డివాము మంగళవారం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆర్థిక నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాల మేరకు.. తన ఇంటి పక్కనే పశువుల కోసం వరిగడ్డి వాము వేశాడు. ఉదయం 8గంటల సమయంలో దానికి నిప్పు అట్టుకుని మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. కానీ మంటలు అదుపు కాలేదు. దీంతో స్థానికులు ఆత్మకూరు అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేసి ఇళ్లకు మంటలు వ్యాపించకుండా నివారించారు. ప్రమాదం ఎలా జరిగిందో తెలియరాలేదు. గుర్తుతెలియని వ్యక్తులు పొగ తాగి ఆర్పకుండా పారవేయడంతో గాలికి నిప్పురవ్వలు రేగి ఈ మంటలు వ్యాపించి ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

# కావలి
## కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



## అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

**కావలి, ఆగస్టు 6:** చుండూరులో అగ్రవర్ణాల దాడిలో మృతి చెందిన దళితులకు ఇప్పటికి న్యాయం జరుకగపోవటం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ట్రంకురోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. మల్లి మాట్లాడుతూ గుంటూరు జిల్లా చుండూరులో 1991 ఆగస్టు 6న సినిమాహాల్‌లో జరిగిన చిన్న గొడవ కారణంగా 12 మందిని ఆ రాత్రి నరికి చంపారన్నారు. ఈ విషయంపై హత్య చేసిన వారందరికి గుంటూరు జిల్లా కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తే ఆ తర్వాత హైకోర్టు దానిని కొట్టి వేసిందన్నారు. హత్య చేసినవారి సామాజిక వర్గానికి చెందిన జడ్జితో కేసును కొట్టివేయంచగా అందుకు ప్రతిఫలంగా వైసీపీ ప్రభుత్వంలో ఆ జడ్జికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కీలక పదవి ఇప్పించడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో దళితసంఘాల నేతలు ముక్కు మోహన్‌రావు, జరుగుమల్లి విజయరత్నం, అలూరి బ్రహ్మయ్య, డీ.రమేష్, ఆత్మకూరి బాలచంద్ర, తిరుపతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాలకు శ్రావణమాస శోభ


ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి, దుర్గాభ్రమరాంబ

**కావలిటౌన్, ఆగస్టు 6 :** పట్టణంలోని ఆలయాలకు శ్రావణమాస శోభ సంతరించుకుంది. మంగళవారం పట్టణ పరిధిలోని పాతూరు శివాలయం, కలుగోళ శాంభవీదేవి ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, వెంగళరావునగర్ ఆలయ క్షేత్రాలకు భక్తులు పెద్దఎత్తున చేరుకుని పూజలు నిర్వహించారు. పాతూరు శివాలయంలో దుర్గాభ్రమరాంబకు ఖడ్గమాల అలంకారంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కొత్తబజారులోని కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక అలంకారంలో పూజలు నిర్వహించారు.

# ‘పాలిటెక్నిక్’లో సమస్యలు పరిష్కరించాలి

● ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డికి వినతి

**కావలి రూరల్, ఆగస్టు 6:** కావలి మండలం రుద్రకోటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.సుశీల్ కుమార్‌ప్రియ, అధ్యాపక బృందం ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం వారు ఎమ్మెల్యేని ఆయన నివాసంలో కలసి కళాశాలలోని సమస్యలను వివరించారు. కళాశాలకు చుట్టూ ప్రహరీ నిర్మించాలని, కళాశాల ప్రాంగణంలో గుంటల మిట్టలను చదును చేయించాలని కోరారు. ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ విభాగాల బ్రాంచీల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరు చేయించాలన్నారు. కళాశాల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని, రుద్రకోట పంచాయతీ నుంచి కళాశాలకు తాగునీటి వసతి కల్పించాలన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం కళాశాల ముందు బస్ షెల్టర్ ఏర్పాటు చెయ్యాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

### పోలేరమ్మకు ఎమ్మెల్యే పూజలు

**కావలి :** కావలి నియోజకవర్గ ప్రజలందరినీ చల్లగా చూడాలని కోరుతూ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పట్టణంలోని 36వ వార్డు పెంకులఫ్యాక్టరీ కాలనీలో మంగళవారం పోలేరమ్మకు పూజలు చేశారు. పోలేరమ్మకు జరిగిన పొంగళ్ల కార్యక్రమంలో టీడీపీ నాయకుడు తాతా వెంకటేశ్వర్లు ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్‌బాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, జనసేన నాయకుడు మన్నేపల్లి రిషికేష్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## వివాదాస్పద స్థలంలో బోర్డు ఏర్పాటు

**లింగసముద్రం, ఆగస్టు 6 :** లింగసముద్రం మీ సేవా కేంద్రం సమీపంలోని వివాదాస్పద ఆర్అండ్‌బీ స్థలంలో రెవెన్యూ, ఎంపీడీవో, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. గ్రామ సర్వే నంబరు 77లో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న ఆ శాఖకు చెందిన ఖాళీ స్థలంలో గత నెల 25వ తేదీన రాత్రి ఓ వ్యక్తి రేకుల షెడ్డు నిర్మించారు. అధికారులు ఈ షెడ్డు నిర్మాణం అక్రమమని కూల్చి వేశారు. దీనిపై అప్పట్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో మంగళవారం సాయంత్రం అధికారుల ఆదేశాలతో ఆ స్థలంలో ఇది ప్రభుత్వ స్థలమని దీనిని ఎవరైనా ఆక్రమించినచో చట్టపరమైన చర్యలు తీసుకోబడునని బోర్డు ఏర్పాటు చేశారు.


ఆర్అండ్‌బీ స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

## రామతీర్థం జలాశయం కట్టపై కంపచెట్ల తొలగింపు

**కందుకూరు, ఆగస్టు 6:** కందుకూరు మున్సిపాలిటీ ప్రజల దాహార్తి తీర్చే రామతీర్థం మంచినీటి పథకం సమ్మర్ స్టోరేజి ట్యాంకు కట్టపై చిల్లచెట్లు, ఇతర కంపచెట్ల తొలగింపుకు మున్సిపల్ అధికారులు మంగళవారం పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఇటీవల సమ్మర్‌స్టోరేజి ట్యాంకును సందర్శించిన సందర్భంగా కట్టపై దట్టంగా కంపచెట్లు పెరిగి ఉండటం అక్కడ అపరిశుభ్ర వాతావరణం కనిపించటంతో తక్షణం కంపచెట్లు తొలగించి మంచినీటి చెరువు పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణం ఉండేలా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో కంపచెట్ల తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు.


జలాశయం కట్టపై చెట్లు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

## ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి

**అల్లూరు, ఆగస్టు 6 :** విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో రవీంద్రనాథ్ అన్నారు. మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలతో మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓపెన్ స్కూల్ చేరికలు, విద్యా కమిటీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించి పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలన్నారు.

## ఇస్కపల్లిలో హర్ ఘర్ తిరంగ వేడుకలు

**అల్లూరు, ఆగస్టు 6 :** ప్రభుత్వాలు చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని మండలంలోని ఇస్కపల్లి జడ్పీ హైస్కూలులో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు దేశనాయకుల వేషధారణలో ప్రత్యేక దేశభక్తి గీతాలు ఆలపింఆరు. నృత్యాలు, వివిధ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో జ్యోతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటాలన్నారు. ప్రతి ఇంటా స్వాతంత్ర్య దినోత్సవం నాడు మువ్వన్నెల జెండాను ఎగురవేయాలన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పాటుపడిన దేశ నాయకుల త్యాగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


వేషధారణలోని చిన్నారులతో ఎంపీడీవో జ్యోతి

## దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు

**కందుకూరు, ఆగస్టు 6:** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలింకో సహాయంతో సక్షమ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు అవసరమైన ఉకరణాలు ఉచితంగా అందజేస్తున్నందున అవసరమైన దివ్యాంగులు బుధ, గురువారాలలో స్థానిక సక్షమ్ దివ్యాంగ కేంద్రంలో సంప్రదించాలని చెన్నా రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయం కృషి మానసిక దివ్యాంగుల పాఠశాల ఆవరణలో బ్యాటరీ ట్రైసైకిళ్లు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్స్ చంక కర్రలు, వినికిడి యంత్రాలను వారి అవసరాలను బట్టి ఉచితంగా అందజేస్తారని పేర్కొన్నారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు వీల్‌చైర్స్, వినికిడి యంత్రాలను సదరమ్ సర్టిఫికెట్‌తో పనిలేకుండా వారి అవసరాన్ని బట్టి ఇసాంతరని, బ్యాటరీ ట్రైసైకిళ్లు, ట్రై సైకిళ్ల కోసం సదరం సర్టిఫికెట్, యుడీఐడీ కార్డు సమర్పించాలని పేర్కొన్నారు. ఉపకరణాలు అవసరమైన ప్రతిఒక్కరూ ఆధార్, రేషన్‌కార్డు, ఫొటో తప్పకుండా తీసుకుని రావాలని తెలిపారు. గత మూడేళ్లలో ఉపకరణాలు పొందిన వారు అనర్హులని, 2023లో జరిగిన అలింకో క్యాంపునకు హాజరైన వారికి త్వరలో ఉపకరణాల పంపిణీ జరగనున్నందున వారు రావాల్సిన అవసరం లేదని తెలిపారు. వివరాలకు 9949334606 నెంబరులో సంప్రదించాలని కోరారు.

## ఒరిగిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు

**వలేటివారిపాలెం, ఆగస్టు 6 :** వలేటివారిపాలెంలో జాతీయ రహదారి పక్కన పొలాల్లో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలకు ఆ శాఖ ఏఈ తాటికొండ మధుబాబు తమ సిబ్బందితో మంగళవారం మరమ్మతులు చేయించారు. ‘ఒరిగిన విద్యుత్ స్తంభాలతో పొంచి ఉన్న ప్రమాదాలు’ అని ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన శీర్షికకు విద్యుత్ ఏఈ స్పందించారు. వెంటనే మరమ్మతులు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి రైతులు, కూలీలు కృతజ్ఞతలు తెలిపారు.


విద్యుత్ స్తంభాలకు చేస్తున్న మరమ్మతులు

## తహసీల్దారుకు సత్కారం

**కావలిటౌన్, ఆగస్టు 6:** కావలి తహసీల్దారుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రావణ్‌కుమార్‌ను మంగళవారం డివిజన్ విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేతలు కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు మొగల్ సిరాజ్‌బేగ్ తదితరులు పెన్షనర్ల సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తను ఎల్లవేళలా సిద్ధమని ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దారు హామీ ఇచ్చారు.

## కార్పొరేట్ జాబ్స్‌కు కఠోర సాధన ముఖ్యం

**కందుకూరు, ఆగస్టు 6:** కఠోర సాధనతోనే కార్పొరేట్ జాబ్స్ సాధించవచ్చునని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య పేర్కొన్నారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ (సీఆర్‌టీ) ముగింపు సందర్భంగా మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కష్టేఫలి అన్న నానుడిని ఆచరిస్తేనే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించగలుగుతారని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మాక్స్ శిక్షణసంస్థ చైర్మన్ కోటిరెడ్డి, కళాశాల టెక్నికల్ డైరక్టర్ డాక్టరు కె.విజయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20మందికి నగదు అవార్డులను అందజేశారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

**లింగసముద్రం, ఆగస్టు 6 :** కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో లింగసముద్రం పంచాయతీలోని బలిజపాలెంలో విద్యుత్‌శాఖ అధికారులు 100 కేవీ ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేశారు. గ్రామంలో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుండడంతో గ్రామస్థులు ఎమ్మెల్యే నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం ఏడీఈ విజయ్‌బాబు, మండల ఏఈ షేక్ ఫిరోజ్‌లు ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేశారు.

## బీదను కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి

**నెల్లూరు(వైద్యం):** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం నగరంలోని బీద నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర ఇంటూరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీద జ్యోతి ఉన్నారు.

## రోడ్డు ఆక్రమణలపై అధికారుల పరిశీలన

**కావలి, ఆగస్టు 6:** కావలి పట్టణం ముసునూరులోని కేజీబీవీ పాఠశాలకు ఎదురుగా ఉన్న రోడ్డును ఆక్రమించారని పాఠశాల ప్రిన్సిపాల్ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే దానిపై విచారించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్పందించిన కావలి ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్‌లు మంగళవారం పాఠశాల వద్దకు వెళ్లి అక్కడ పరిశీలించారు. జగనన్న కాలనీకి చెందిన మెగాలేఅవుట్ పక్కనే ఎవరో రోడ్డు ఆక్రమించి నాన్ లే అవుట్ వేసేందుకు రాళ్లు పాతడంతో అధికారులు ఆ రాళ్లను తొలగింపజేశారు.

## రైల్వే వైద్యశాలలో ఉచిత వైద్య శిబిరం

**బిట్రగుంట, ఆగస్టు 6:** బిట్రగుంట రైల్వే వైద్యశాలలో మంగళవారం ఒంగోలు కిమ్స్, రైల్వే ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో 162 మందికి పైగా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండె, కీళ్ల, జీర్ణకోశ, స్త్రీల సంబంధిత, కంటి, సాధారణ వ్యాధులకు వైద్యనిపుణులు కపిల్ కార్తికేయ, అశోక్ కుమార్, సుజనీ, హైందవి, రామాంజనేయులు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు, అంకిరెడ్డి, మెడికల్ సూపరిటెండెంట్ శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్‌కు ఘన నివాళులు

**కావలిటౌన్, ఆగస్టు 6:** ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన అభిమానులు సిద్ధు, దేవరకొండ శ్రీను, ఆలా శ్రీను మిత్రబృందం ఆధ్వర్యంలో బ్రిడ్జి కూడలిలో శిబిరాన్ని ఏర్పాటు చేసి గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ ప్రధాన కూడళ్లలో గద్దర్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఆయనపై అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు మల్లి, శ్రీధర్‌రెడ్డి, జనసేన రూరల్ అధ్యక్షుడు తిరుపతిస్వామి, విద్యార్థి నాయకులు విజయ్, సాధు శ్రీధర్ పాల్గొన్నారు.

## రెంటాల రాఘవేంద్రకు డాక్టరేట్

**కావలిటౌన్, ఆగస్టు 6:** విక్రమ సింహపురి యూనివర్శిటీ కావలి పీజీ కళాశాల రీసెర్చ్ స్కాలర్ రెంటాల రాఘవేంద్రకు డాక్టరేట్ లభించింది. కామర్స్ విభాగాధిపతి ఆచార్య సీహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఫైనాన్షియల్ పర్ఫార్మెన్స్ ఆఫ్ సెలెక్టెడ్ పబ్లిక్ సెక్టార్ బ్యాంక్స్ ఇన్ ఇండియా ఎ కంపారిటివ్ స్టడీ అనే అంశంపై చేసిన పరిశోధనకు వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసిందని రాఘవేంద్ర తెలిపారు. తన పరిశోధనకు మార్గదర్శకుడు ఆచార్య శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.